www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

ప్రజాపక్షం 7th ANNIVERSARY 22nd October, 2025

PRAJAPAKSHAM ★★

మళ్లీ పోరాటంలోకి కార్మికులు, రైతులు ఎందుకు? 06

ప్రజాస్వామ్యవాదులు ఏకకంఠి బిహార్‌లో యువత ఆకాంక్షలు అణచివేత 05

సంపుటి 08, సంచిక: 327 | బుధవారం | 29-10-2025 | మహబూబ్‌నగర్ | Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

# తుమ్మిడిహట్టి నుంచి సుందిళ్లకు 80 టిఎంసిలు

## నీటిని తరలించేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలి

- డ్యామ్‌ల స్థితిగతులపై నివేదిక రూపొందించాలి
- సంబంధిత ఏజెన్సీలే బాధ్యత వహించేలా చూడాలి
- ప్రాజెక్టుల వారీగా పూర్తిస్థాయి నివేదికల ఆధారంగా సమీక్షలు
- అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం



**సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల పరిస్థితులు, సిఆర్ పాటిల్ రాసిన లేఖపై అధికారులతో సమీక్ష**

ప్రజాపక్షం/హైదరాబాద్

తుమ్మిడిహట్టి నుంచి సుందిళ్ల వరకు 80 టిఎంసిల నీటిని తరలించేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సిఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సాగు,తాగు నీరు అందించేందుకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. దీనికి పాత పనులను ఉపయోగిస్తూ, ముందుకు వెళ్లేందుకు అంచనాలను రూపొందించాలని చెప్పారు. సుందిళ్లకు మరమ్మత్తులను చేపట్టి వినియోగంలోనికి తీసుకురావాలని,తద్వారా ఆ నీటిని శ్రీపాద ఎల్లంపల్లికి తరలించేందుకు అవసరమైన ప్రణాళికలు, అంచనాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. బ్యారేజీల రిపేర్లకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, సిఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, కార్యదర్శి మాణిక్‌రాజు, నీటిపారుదల శాఖ అధికారులు హాజరయ్యారు. ఇటీవల కేంద్రజలశక్తి మంత్రి సిఆర్ పాటిల్ సిఎం రేవంత్ రెడ్డికి రాసిన లేఖపై రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులతో చర్చించారు. అలాగే తుమ్మిడిహట్టి వద్ద చేపట్టాల్సిన ప్రాజెక్టు, సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల పరిస్థితిపైన కూడా సిఎం సమీక్షించారు. కేంద్ర మంత్రి లేఖలో ప్రస్తావించిన అంశాలను సిఎం అధికారులకు వివరించారు. డ్యాముల భద్రత విషయంలో ఏ విధంగా ముందుకెళ్లాలనే అంశంపై ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. కేంద్ర మంత్రి లేఖలో పొందుపర్చిన అంశాలు, ప్రాజెక్టులకు వారీగా స్థితిగతులు, అంచనాలను పూర్తిస్థాయి నివేదికలను తరువాయి 2లో



# వేతన సంఘం ఏర్పాటు

రంజన ప్రకాశ్ దేశాయ్ నేతృత్వంలో 8వ పే కమిషన్

18 నెలల్లో తుది నివేదిక విడుదల

తీర్మానానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం

రబీ సీజన్‌లో ఎరువుల సబ్సిడీ పెంపునకు రూ.37,952 కోట్లకు గ్రీన్ సిగ్నల్

**న్యూఢిల్లీ:** బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు పోలింగ్ ప్రక్రియ సమీపిస్తున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం ఎనిమిదవ వేతన సంఘాన్ని ఏర్పాటు చేసింది. సుప్రీంకోర్టు విశ్రాంత మహిళా న్యాయమూర్తి జస్టిస్ రంజన ప్రకాశ్ దేశాయ్ ఈ వేతన సంఘానికి నాయకత్వం వహిస్తారు. ఎనిమిదవ వేతన సంఘం కార్యకలాపాల పరిధిని, పరిమితులను నిర్దేశిస్తూ న్యూఢిల్లీలో మంగళవారం జరిగిన కేంద్రమంత్రివర్గ సమావేశం ఒక తీర్మానానికి ఆమోదం తెలియజేసింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షత వహించారు. ఏడవ వేతన సంఘం కాలపరిమితి ముగిసిన వెంటనే కొత్త వేతన సవరణలు చేపట్టడానికి వీలుగా 2026 జనవరి ఒకటో తేదీ నుండీ (సాధారణ సంప్రదాయ తేదీ) ఎనిమిదవ వేతన సంఘం పనిచేయడం ప్రారంభిస్తుంది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలలో చేయవలసిన మార్పులు, వారికి లభించాల్సిన ప్రయోజనాలకు సంబంధించి ఈ వేతన సంఘం సిఫార్సులు చేస్తుంది. ఈ సిఫార్సులవల్ల దేశంలో 50 లక్షలమంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 69 లక్షల మంది పెన్షనర్లు ప్రయోజనం పొందుతారు. తొలుత ఒక తాత్కాలిక నివేదిక ఇచ్చిన తర్వాత, 18 నెలల గడువులో సంఘం తుది నివేదిక సమర్పిస్తుంది. తాత్కాలిక నివేదిక ఇచ్చిన తర్వాత ఈ వేతన సంఘం పనిచేయడానికి ఒక నిర్దిష్ట ప్రారంభ తేదీని నిర్ణయిస్తామని మంత్రివర్గ సమావేశం అనంతరం సమాచార ప్రసారాలశాఖమంత్రి అశ్వనీ వైష్ణవ్ పాత్రికేయులకు చెప్పారు. సాధారణ సంప్రదాయం ప్రకారం వేతన సంఘం జనవరి ఒకటోతేదీనే బాధ్యతలు తీసుకుని పనిచేయడం తరువాయి 12లో



# అమెజాన్‌లో 14 వేల ఉద్యోగాల కోత

కృత్రిమ మేధపై వ్యయాల పెంపు

**సీటెల్:** అమెజాన్ కంపెనీ 14,000 కార్పొరేట్ ఉద్యోగాల్లో కోత పెట్టేందుకు సిద్ధమైంది. మానవశ్రమ స్థానంలో కృత్రిమ మేధకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. వినియోగదారుల అభిరుచులు, భవిష్యత్ అవసరాలు, మార్పులు,పోటీ ప్రపంచానికి అనుగుణంగా కృత్రిమ మేధపై ఎక్కువ ఖర్చుపెట్టేందుకు కంపెనీ సిద్ధమైంది. ఉన్నతస్థాయి ఉద్యోగులతోపాటు వివిధ స్థాయిల్లో పనిచేసే ఉద్యోగాలలో కూడా కోత విధిస్తారు. ఈ వారం నుండే ఈ ప్రక్రియ ప్రారంభం అవుతుంది. ఉద్యోగాల కోత ప్రభావం పడే టీములు, ఉద్యోగులను మంగళవారంనాడే గుర్తించింది. ప్రపంచవ్యాప్తంగా పనిచేసే సిబ్బంది ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించుకోవడానికి 90 రోజులు గడువు ఇస్తారని సీనియర్ వైస్ ప్రెసిడెంట్ బెత్ గాలెట్టి ఒక మెసేజ్ ద్వారా ఉద్యోగులకు తెలియజేశారు. అమెజాన్‌లో 3,50,000 మంది కార్పొరేట్ ఉద్యోగులు ఉన్నారు. మొత్తంగా కంపెనీలో 15.60 లక్షలమంది శ్రామికులు ఉన్నారు. ఈ లెక్క ప్రకారం తాజా లేఆఫ్‌లో నాలుగు శాతం మందిని తొలగిస్తారు. 2023లో 27,000 మంది ఉద్యోగులను అమెజాన్ తొలగించిన తర్వాత మూడు సంవత్సరాలకు ఇంత భారీస్థాయిలో ఉద్యోగాల్లో కోత పెట్టడం మళ్ళీ ఇదే. ఆనాడు రెండు విడతలుగా 9,000 మందిని ఒకసారి, 18,000 ఉద్యోగులను మరోసారి కంపెనీ తొలగించింది. ఈసారి కూడా ఇదే విధానం పాటిస్తారని భావిస్తున్నారు. కంపెనీ కార్యకలాపాలు, మానవ వనరులు, క్లౌడ్ కంప్యూటింగ్ యూనిట్, తరువాయి 2లో

**సినిమా టిక్కెట్ ధర పెంచాలంటే కార్మికులకు 20 శాతం వాటా ఇవ్వాల్సిందే**

వాటా ఇస్తేనే ధరల పెంపు జిఒ జారీచేస్తాం

సినీ కార్మికుల ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

సినీ కార్మికులపై సిఎం వరాలజల్లు 03

# సాయుధ పోరాటం వీడిన చంద్రన్న, బండి ప్రకాశ్



డిజిపి శివధర్‌రెడ్డి ఎదుట లొంగుబాటు

జనజీవన స్రవంతిలో కలిసిన మావోయిస్టులకు రక్షణ కల్పిస్తామని హామీ

ఈ ఏడాది ఇప్పటివరకూ 427 మంది లొంగిపోయినట్లు వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్

సిపిఐ (మావోయిస్టు) కీలక నేతలు, కేంద్ర కమిటీ సభ్యుడు పుల్లూరి ప్రసాద్‌రావు అలియాస్ చంద్రన్న, రాష్ట్ర కమిటీ సభ్యుడు బండి ప్రకాశ్ అలియాస్ ప్రభాత్‌లు తెలంగాణ డిజిపి శివధర్ రెడ్డి ఎదుట మంగళవారం లొంగిపోయారు. ఇటీవలే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు వీరు అజ్ఞాతం వీడారు. జనజీవన స్రవంతిలో కలవాలని నిర్ణయించుకున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను డిజిపి వెల్లడించారు. సాయుధ పోరాటాన్ని వీడి జనజీవన స్రవంతిలోకి వచ్చిన వచ్చే మావోయిస్టు నేతలకు పూర్తి రక్షణ కల్పిస్తామని, వారిపై ఎలాంటి చర్యలు ఉండవని డిజిపి శివధర్ రెడ్డి స్పష్టం చేశారు. కాగా, మావోయిస్టు పార్టీలో 40 ఏళ్లకు పైగా వివిధ స్థాయిల్లో చంద్రన్న పనిచేశారని తెలిపారు. 1980లో పుల్లూరి ప్రసాదరావు కిషన్‌జీకి అనుచరుడిగా పనిచేశారని, 1981లో పీపుల్స్‌వార్‌లో చేరారని వెల్లడించారు. అంచెలంచెలుగా ఎదిగి తరువాయి 2లో

**మావోయిస్టు సిద్ధాంతం ఓడిపోలేదు : చంద్రన్న** 03



# కాంట్రాక్ట్ కార్మికులకు శాశ్వత ఉద్యోగాలు

- ఇంటికో ప్రభుత్వ ఉద్యోగం, పాత పెన్షన్ పునరుద్ధరణ
- కల్లుపై నిషేధం ఎత్తివేత
- బిహార్ మహాఘట్ బంధన్ మ్యానిఫెస్టో విడుదల

**పాట్నా :** తాము అధికారంలోకి వస్తే బిహార్‌లో ప్రతి ఇంట్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని, పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరిస్తామని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తును అందిస్తామని మహాగఠ్‌బంధన్ హామీ ఇచ్చింది. 'బిహార్ కా తేజస్వి ప్రణ్' పేరుతో 32 పేజీల ఎన్నికల ప్రణాళికను పాట్నాలోని ఓ ప్రముఖ హోటల్‌లో కూటమి నేతలు కిక్కిరిసిన విలేకరుల సమావేశంలో మంగళవారం కూటమి నేతలు మహాగఠ్‌బంధన్ మేనిఫెస్టో విడుదల చేశారు. కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థి, ఆర్‌జెడి నేత తేజస్వీ యాదవ్,కాంగ్రెస్ నుంచి పవన్ ఖేడా, మదన్‌మోహన్ ఝా, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామ్‌నరేశ్ పాండే, విఐపి నేత ముకేశ్ సాహ్ని, ఐఐపి నాయకుడు ఐ.పి.గుప్తా, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. బిహార్ ఎన్నికల కోసం గఠ్‌బంధన్ మ్యానిఫెస్టోలో ఆచరణాత్మక పరిష్కారాలను హామీనిచ్చే 25 ప్రధాన అంశాలు ఉన్నాయని తేజస్వీ యాదవ్ ఈ సందర్భంగా తెలిపారు.'బిహార్‌లో ఇండియా కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన 20 రోజుల్లోపు ఉపాధికి హామీ ఇచ్చే కొత్త చట్టం ప్రవేశపెట్టబడుతుంది' అని ఆయన అన్నారు. బిహార్ అంతటా ఉపాధి హామీ పథకం అమలు చేయబడుతుందని ఆయన అన్నారు. 'బిహార్ ప్రభుత్వ విభాగాలలోని అన్ని కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేస్తాం. అలాగే, అ 'జీవిక దీదీ'లందరినీ పర్మినెంట్ చేసి, నెలకు రూ.30,000 జీతం ఇస్తామని' మ్యానిఫెస్టోలో పేర్కొన్నారు. మ్యానిఫెస్టోలో ఐటి పార్కులు, సెజ్‌లు, పాడి పరిశ్రమ, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, ఎడ్యుకేషన్ సిటీ(విద్యా నగరం), రాష్ట్రంలో ఐదు కొత్త ఎక్స్‌ప్రెస్‌వేలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. 'బిహార్ ప్రజలు నేరాలు, మోసాలు లేని పాలనను కోరుకుంటున్నారు... వారు ఎన్నికల్లో ఎన్‌డిఎకి గుణపాఠం చెబుతారు' అని తరువాయి 2లో

# తీరందాటిన 'మోంతా'

- గాలి, వానతో తీర ప్రాంతం అల్లకల్లోలం
- ఆంధ్రప్రదేశ్‌లో పొంగుతున్న వాగులు వంకలు, స్తంభించిన జనజీవనం
- నేలకొరిగిన భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు



**అమరావతి:** వాతావరణ శాఖ అంచనా వేసినట్లుగానే 'మోంతా' బీభత్సం సృష్టిస్తోంది. గంటకు 15కిలోమీటర్ల వేగంతో తీరంవైపు దూసుకొస్తోంది. ఈ ప్రభావంతో ఎపి రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. కోస్తా జిల్లాల్లోని సముద్ర తీరమంతటా అలలు ఎగసిపడుతున్నాయి. గాలి, వానలతో తీర ప్రాంతం అల్లకల్లోలంగా మారింది. మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో ఉత్తర వాయవ్యంగా కదిలి బంగాళాఖాతంలో ఏర్పడిన మోంతా తుపాను కాకినాడ మచిలీపట్నం మధ్య అంతర్వేదిపాలెం సమీపంలో తీరాన్ని తాకింది. పూర్తిగా తీరం దాటేందుకు మూడు నుంచి నాలుగు గంటల సమయం పడుతుందని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. తీరం దాటే సమయంలో గంటకు 90 నుంచి 110 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశముందని, ఈ ప్రభావంతో శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు అతి భారీ వర్షాలు కురుస్తాయని, కొన్ని చోట్ల అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశముందని ఏపీ విపత్తుల తరువాయి 2లో

## తెలంగాణలో భారీ వర్షాలు

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర తుపాను 'మోంతా' ప్రభావంతో రాష్ట్రంలో రానున్న మూడురోజులు భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని హెచ్చరించారు. బుధవారం ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, తరువాయి 2లో



# 2030 నాటికి తెలంగాణ 'ఏరో-ఇంజిన్' రాజధాని

'ఏరో ఇంజిన్ రొటేటివ్ కాంపోనెంట్స్' న్యూ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ' ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు


ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణను 2030 నాటికి దేశంలోనే 'ఏరోఇంజిన్' రాజధానిగా తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని ఐటి, పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఈ లక్ష్య సాధనకు అంతర్జాతీయ, జాతీయ దిగ్గజ ఏరో సంస్థలు రాష్ట్రంలో కొత్తగా పెట్టుబడులు పెట్టేలా సమగ్ర తరువాయి 2లో

# డాక్టర్లకు అండగా ఉండాలి

**లేదంటే న్యాయవ్యవస్థను సమాజం క్షమించదు**

'సుప్రీంకోర్టు' కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ :** డాక్టర్లను జాగ్రత్తగా చూసుకోకపోతే, వారికి అండగా నిలబడకపోతే న్యాయవ్యవస్థను సమాజం క్షమించదని మంగళవారం సుప్రీంకోర్టు పేర్కొంది. గుర్తింపులేని హాస్పిటళ్లలో కోవిడ్ 19తో పోరాడుతూ ప్రాణాలను కోల్పోయిన వైద్యులు, ఆరోగ్య కార్యకర్తలను బీమా పాలసీలలో చేర్చకూడదని దాఖలైన పిటిషన్‌పై అత్యున్నత న్యాయస్థానం తన తీర్పును రిజర్వ్ చేస్తూ ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. న్యాయమూర్తులు జస్టిస్ పి.ఎస్.నరసింహ, ఆర్.మహదేవన్ ద్విసభ్య ధర్మాసనం బీమా కంపెనీలు చెల్లుబాటు అయ్యే (వాలీడ్) క్లెయిమ్‌లను పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించింది. ప్రైవేట్ వైద్యులు లాభదాయకంగా పనిచేస్తున్నారనే భావన సరైనది కాదని హితవు పలికింది. 'మనం మన వైద్యులను జాగ్రత్తగా చూసుకోకపోతే, వారి తరపున నిలబడకపోతే సమాజం మనల్ని తరువాయి 12లో



# మాజీమంత్రి హరీశ్‌రావుకు పితృవియోగం

- సిఎం రేవంత్‌రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు సంతాపం
- సత్యనారాయణ మృతదేహానికి నివాళి అర్పించిన మాజీ సిఎం కెసిఆర్, మంత్రులు పొన్నం, గడ్డం తదితరులు



# ప్రపంచం
WORLD NEWS

## లోయలో పడిన బస్సు : ఆరుగురు మృతి



**సుక్రే:** సెంట్రల్ సౌత్ అమెరికా దేశం బొలీవియాలో మంగళవారం ఒక బస్సు లోయలోపడిపోవడంతో 16 మంది మరణించారు. మరో 32 మంది గాయపడ్డారు. పర్వతమార్గంలో ఉన్న సన్నటి దారిలో ప్రయాణించి వెళుతుండగా రోడ్డు అంచున ఉన్న 1000 అడుగుల లోతు (300 మీటర్లు) ఉన్న లోయలోకి బస్సు జారి పడిపోయింది. డ్రైవరు స్టీరింగ్ అదుపు తప్పడంతో కొచాబంబ ప్రాంతంలో ఈ దుర్ఘటన జరిగింది. మృతదేహాలను వెలికి తీయడం సమస్యగా మారింది. కేవలం మూడు మృతదేహాలను మాత్రమే వెలికితీశారు. ఐతే ప్రమాదంలో 23 ఏళ్ళ వయసుగల యువ డ్రైవరు తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నాడు. వాతావరణం సరిగ్గా లేని పరిస్థితుల్లో ప్రమాదకరమైన మలుపులో స్టీరింగ్‌ను తిప్పుతుండగా ఈ ఘటన జరిగి ఉండవచ్చునని అధికారులు అంచనావేశారు.



## ఏది కోరుకుంటే అదిస్తా, జపాన్‌కు అండగా ఉంటా

### పొగడ్తల వలకు చిక్కిన ట్రంప్ వరాల జల్లు
### నోబెల్‌కు సిఫార్సు చేసిన తకచి

**టోక్యో:** రెండు రోజుల జపాన్ పర్యటనలో ఆ దేశ సైన్యం పూర్తి లాంఛనాలతో అమెరికా అధ్యక్షుడు డోనాల్ ట్రంప్‌కు ఘన స్వాగతం పలికింది. వాణిజ్య ఒప్పందాలు, పొగడ్తలు, చిరునవ్వులు, కేరింతల మధ్య గొప్ప గౌరవాన్ని ఆయన అందుకున్నారు. అమెరికాకు ఆర్థిక లాభంతోపాటు ట్రంప్ వ్యక్తిగతంగా కూడా లాభపడ్డారు. జపాన్ పొగడ్తలతో ఉబ్బితబ్బిబ్బైపోయిన ట్రంప్ ప్రధానమంత్రి సనే తకచిని తిరిగి పొగడ్తల్లో ముంచెత్తారు. ''జపాన్ ఏది కోరుకుంటే అది ఇస్తా, మీకు ఎప్పుడు ఏ సమయంలో ఎలాంటి సహాయం కావాలన్నా అండగా నిలబడతా, ఎలాంటి సహాయం కావాలన్నా ఇస్తా'' అంటూ జపాన్ ప్రధానమంత్రి సనే తకచికి అభయం ఇచ్చారు. వరాలు ప్రసాదించారు. జపాన్ తమకు ఎంతో బలమైన మిత్రదేశమని ప్రకటించారు. అరుదైన ఖనిజాల సరఫరాపై రెండు దేశాల నాయకులు సంతకాలు చేశారు. రెండు దేశాల సంబంధాలు సరికొత్త స్వర్ణయుగంలోకి ప్రవేశించాయని సనే తకచి ప్రకటించారు. మొదటి రోజు సోమవారం సాయంత్రం జపాన్ చక్రవర్తితో ట్రంప్ సమావేశం జరిపారు. తర్వాత మంగళవారం జపాన్ కొత్త ప్రధానమంత్రి సనే తకచితో ట్రంప్ ముఖాముఖీ సమావేశమయ్యారు. అమెరికాకు అరుదైన ఖనిజ వనరులను సమకూర్చేందుకు జపాన్ వాణిజ్య ఒప్పందం చేసుకుంది. కేరింతలు, పొగడ్తలు, చిరునవ్వులు, వాణిజ్య ప్రయోజనాలు, వ్యక్తిగత ప్రయోజనాలమధ్య ఉల్లాసంగా ట్రంప్ పర్యటన సాగింది. అమెరికాలో భారీ పెట్టుబడులు సమకూర్చేందుకు జపాన్ కొత్త ప్రధానమంత్రి తకచి ట్రంప్‌కు భరోసా ఇచ్చారు. ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ట్రంప్‌తో సమావేశం నిర్వహించి మొదటి విషమ పరీక్షను తకచి విజయవంతంగా అధిగమించారు. అదేవిధంగా ప్రపంచశాంతికి కృషి చేస్తున్నందుకుగాను డోనాల్డ్ ట్రంప్ పేరును నోబెల్ బహుమతికి సిఫార్సు చేస్తామని ఆమె ప్రకటించారు. ట్రంప్‌ను ఆమె పెద్ద ఎత్తున పొగడ్తలలో ముంచెత్తారు.

## దురుసు ప్రవర్తన, మొరటుభాషతో
# టర్కీ చర్చలకు పాక్ భగ్నం!



### అఫ్గానిస్తాన్‌కు యుద్ధ హెచ్చరిక

**కాబూల్:** అఫ్గానిస్తాన్-పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తత పరిష్కారానికి టర్కీలో జరుగుతున్న చర్చలు ఎలాంటి ఫలితాలు లేకుండా ముగిశాయి. దురుసు ప్రవర్తన, మొరటు భాషతో పాకిస్థాన్ ప్రతినిధులు చర్చలను భగ్నం చేశారు. ఈ చర్చలు ప్రధానంగా పాకిస్తాన్‌లో ఉగ్రవాద సంస్థ తెహ్రీక్-ఎ-తాలిబన్ పాకిస్తాన్ (టిటిపి) గురించే జరిగాయి. టిటిపిని అదుపు చేయాలని అఫ్గానిస్థాన్ ప్రభుత్వప్రతినిధులను పాకిస్తాన్ కోరింది. టిటిపి ఉగ్రవాదులు పాకిస్తాన్‌లో దాడులుచేస్తే అఫ్గానిస్థాన్‌పై ప్రతీకారం తీర్చుకుంటామని, యుద్ధం తప్పదని పాకిస్థాన్ ప్రతినిధులు మొరటు హెచ్చరిక చేశారు. టర్కీలో మధ్యవర్తుల ద్వారా అక్టోబరు 25న శనివారం ఈ చర్చలు మొదలయ్యాయి. ఐతే ఇంకా పరిష్కార మార్గాలను ఇరు పక్షాలు అన్వేషిస్తున్నాయని మంగళవారం ఉదయం తొలుత వార్తలు వెలువడ్డాయి. టిటిపి దాడులు చేయకుండా అదుపు చేసుకునే బాధ్యత పాకిస్థాన్ సైన్యం, భద్రతా దళాలదే తప్ప తమకు సంబంధం లేదని అఫ్గానిస్థాన్ ప్రతినిధులు చర్చల్లో స్పష్టం చేశారు. తమ భూభాగం నుండి ఎవరూ దాడులు చేయకుండా చూసుకోవడం మాత్రమే తమ బాధ్యత అని పేర్కొన్నారు. పాకిస్థాన్ ప్రతినిధులు మొండిగా వాదించడంతో, తమ భూభాగాన్ని ఎవరూ దుర్వినియోగం చేయకుండా తాము చూసుకుంటామని, కానీ పాకిస్థాన్ దళాలు తమ భూభాగంలోకి ప్రవేశించడం, గగనతలాన్ని ఉల్లంఘించడం వంటి చర్యలకు పాల్పడకూడదని అఫ్గానిస్థాన్ ప్రతినిధులు తిరిగి హెచ్చరిక చేశారు. టిటిపి ఉగ్రవాదం పాకిస్థాన్ అంతర్గత విషయమని, దాంతో తమకు సంబంధం లేదని, మీ దేశంలో ఉగ్రవాదులను తామెలా అదుపుచేస్తామని అఫ్గానిస్థాన్ ప్రతినిధులు ప్రశ్నించినప్పటికీ పాకిస్థాన్ ప్రతినిధులు వినిపించుకోలేదు. టర్కీలో జరుగుతున్న ఈ చర్చల్లో సంప్రదింపుల సందర్భంగా పాకిస్థాన్ ప్రతినిధులు అనుసరించిన దురుసు ప్రవర్తన, మొరటు భాష, పదజాలం చూసి మధ్యవర్తిదేశం టర్కీ, ఖతార్‌లకు చెందిన అధికార ప్రతినిధులు కూడా విస్తుపోయినట్లు సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ కాబూల్ కేంద్రంగా ప్రచురితమవుతున్న పత్రిక మంగళవారం బ్రేకింగ్ న్యూస్‌లో ప్రకటించింది.పాకిస్థాన్ తరఫున ప్రతినిధులకు చర్చల్లో నాయకత్వం వహించిన వ్యక్తి పూర్తిగా మర్యాద తెలియనివాడని వర్గాలు పేర్కొన్నాయి. తమ దురుసు ప్రవర్తనతో పాకిస్థాన్ ప్రతినిధులు చర్చలను భగ్నం చేశారు. ఈ సంప్రదింపులు ఎలాంటి ఫలితాలు లేకుండానే ముగిశాయని పేర్కొంది. పాకిస్థాన్ ప్రతినిధుల ప్రవర్తన చూసి మధ్యవర్తిదేశం తీవ్రంగా కలత చెందిందని పత్రిక పేర్కొంది. చర్చల బల్లవద్ద ఎలా ప్రవర్తించాలో పాకిస్థాన్ ప్రతినిధులకు తెలియదని, ఎలాంటి పొంతనాలేని వాదనలు వారు సంప్రదింపుల్లో ముందుకు తీసుకువస్తున్నారని పేర్కొంది. ఎజెండాలో ఉన్న అన్ని అంశాలపై చర్చ జరిగినప్పటికీ ఒకేఒక్క అంశం చుట్టూ చర్చలను పాకిస్థాన్ ప్రతినిధులు సాగదీస్తున్నారు. పాకిస్థాన్‌లో ఉంటూ పాకిస్థాన్‌లో తిరుగుబాటు చేసి, ప్రభుత్వంపై యుద్ధం చేస్తున్న గ్రూపులన్నింటినీ మీరే నియంత్రణలోకి తీసుకురావాలని, మీరే వారిని అదుపుచేయాలని అఫ్గానిస్థాన్ ప్రతినిధులను పాకిస్థాన్ ప్రతినిధిబృందం నాయకుడు డిమాండ్ చేయడం మధ్యవర్తులను దిగ్భ్రాంతికి గురిచేసింది. ''సమస్య పాకిస్థాన్‌లో ఉంది, పాకిస్థాన్ భూభాగంలో పోరాటం జరుగుతున్నందువల్ల ఈ సమస్యతో తమకు సంబంధం లేదని అఫ్గానిస్థాన్‌కు చెందిన తాలిబన్ ప్రభుత్వ ప్రతినిధులు వాదించారు. కానీ భారతదేశ సహకారంతో తాలిబన్ ప్రభుత్వం చేతులు కలిపి ఉగ్రవాదులను తమ భూభాగంలోకి పంపిస్తోందన్నది మొదటినుండీ పాకిస్థాన్ ప్రభుత్వం చేస్తున్న వాదన. ఐతే ఈ చర్చల్లో టిటిపి వెనుక భారతదేశం ఉందన్న విషయం, భారతదేశం పేరు వినిపించిందా? లేదా? అనే విషయం బయటకు రాలేదు. ''మీదేశంలో ఉన్న మీదేశ తిరుగుబాటుదారులను వేరే దేశం ద్వారా నియంత్రణ చేయాలని అడుగుతారా? స్వంతదేశంలో ఉన్న తిరుగుబాటుదారులను అదుపు చేయమని పొరుగు దేశాన్ని ఎలా అడుగుతారు?'' అనేది అఫ్గానిస్థాన్ ప్రతినిధులు అడుగుతున్న ఎదురుప్రశ్న.

**నేను చిటికెలో పరిష్కరిస్తా : ట్రంప్**

పాకిస్థాన్-అఫ్గానిస్థాన్ మధ్య తలెత్తిన సంఘర్షణను తాను చిటికెలో పరిష్కరిస్తానని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అన్నారు. ప్రస్తుతం జపాన్ పర్యటనలో ఉన్న ట్రంప్ అంతకుముందు మలేసియాలో పర్యటించినప్పుడు థాయ్‌లాండ్-కాంబోడియా మధ్య శాంతి ఒప్పందంపై సంతకాల సందర్భంగా ఆదివారం మాట్లాడుతూ, పాకిస్థాన్-అఫ్గానిస్థాన్ మధ్య సమస్యను తాను చిటికెలో పరిష్కరిస్తానన్నారు. టిటిపి ఉగ్రవాదులకు అఫ్గానిస్థాన్ ఆశ్రయం ఇచ్చి తమ భూభాగంలోకి పంపుతోందని పాకిస్థాన్ ప్రభుత్వం పదే పదే ఆరోపణలు చేస్తున్నది. ఈ వ్యవహారంలో భారత్‌పై కూడా ఆరోపణలు చేస్తోంది. మీరు దాడి చేశారంటే మీరే దాడిచేసి మా భూభాగంలోకి వచ్చారంటూ రెండు దేశాలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నాయి.

# సూడాన్ అంతర్యుద్ధంలో కొత్త మలుపు!

### కాల్పుల విరమణకు ఐక్యరాజ్యసమితి డిమాండ్





**న్యూయార్క్ :** ఆఫ్రికా ఈశాన్యప్రాంత దేశం సూడాన్‌లో అంతర్యుద్ధ పరిస్థితులు పరాకాష్ఠకు చేరాయి. అల్-ఫాషెర్ నగరం తమ చేతికి చిక్కిందని ఆర్‌ఎస్‌ఎఫ్ పేర్కొంది. దీంతో సూడాన్‌లో అంతర్యుద్ధం కొత్త మలుపు తిరిగింది. ఈ పరిణామంతో డార్ఫర్‌లోని ఐదు రాష్ట్రాలూ ఆర్‌ఎస్‌ఎఫ్ నియంత్రణలోకి వచ్చినట్లయింది. దీంతో డార్ఫర్‌తోపాటు సూడాన్ దక్షిణానకొన్ని ప్రాంతాలు కూడా ఆర్‌ఎస్‌ఎఫ్ అధీనంలో ఉన్నట్లవుతుంది. ఆర్మీపై ఆర్‌ఎస్‌ఎఫ్ ఆధిపత్యం సాధించినట్లవుతుంది. 2023కు ముందు సైన్యంతో కలిసి పరిపాలన చేసిన నాయకులు ఆర్‌ఎస్‌ఎఫ్ (ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్స్) పేరుతో చీలికవర్గంగా విడిపోయి ఆర్మీపై అంతర్యుద్ధం ప్రారంభించి తాజాగా డార్ఫర్‌లోని అతిపెద్ద అల్-ఫాషెర్ నగరాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆర్మీ కేంద్ర కార్యాలయాన్ని స్వాధీనంలోకి తెచ్చుకున్నారు. ఈ నేపథ్యంలో సూడాన్ ఆర్మీ అల్-ఫాషెర్ నుండి తిరుగుముఖం పట్టింది. ఈ విషయాన్ని మంగళవారంనాడు సూడాన్ ఆర్మీ వర్గాలు ధృవీకరించాయి. పశ్చిమ డార్ఫర్‌లో ఆర్మీ అధీనంలో ఉన్న చిట్టచివరి కేంద్రం ఇదే. ఇది కూడా చేజారిపోయింది. దీంతో అల్-ఫాషెర్ నగరంలో ఉన్న ప్రజల భద్రతపట్ల ఐక్యయరాజ్యసమితి, స్థానిక గ్రూపులు ఆందోళన చెందుతున్నాయి. అల్-ఫాషెర్ లో పరిస్థితులను ప్రజాస్వామ్య అనుకూలవాదులు వీడియోల ద్వారా బాహ్య ప్రపంచానికి తెలియజేస్తున్నారు. ఈ నగరంలోని వీధుల్లో కాలి బూడిదైన వాహనాలు కుప్పలు కుప్పలుగా పడి ఉండటం కనిపిస్తోంది. అనేకమృతదేహాలు కూడా ఈ వాహనాలవద్దనే పడి ఉన్న దృశ్యాలు వీడియోల్లో కనిపిస్తున్నాయి. అల్-ఫాషెర్ వెలుపల ఉన్న అబూ షౌక్ శిబిరంతో పాటు ఆ చుట్టుపక్కల అనేక శిబిరాలలో 4.50 లక్షలమంది ప్రజలు తలదాచుకున్నారు. యుద్ధం మొదలైనప్పటినుండీ రెండేళ్ళుగా ఈ శిబిరాలపై ఆర్‌ఎస్‌ఎఫ్ దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. అల్-ఫాషెర్ నగరంలో దాదాపు 2.50 లక్షలమంది ప్రజలు చిక్కుకుపోయారు. ఈ నగరాన్ని స్వాధీనం చేసుకోవడానికి అనేక రోజులుగా ఆర్‌ఎస్‌ఎఫ్ ప్రయత్నాలు చేస్తోంది. ఆర్‌ఎస్‌ఎఫ్ ఈ నగరాన్ని చుట్టుముట్టి లోపలికి గానీ, వెలుపలికిగానీ రాకపోకలను 2024 నుండి నిషేధించింది. చివరకు స్వాధీనం చేసుకుంది. దీంతో నగరంలో ప్రజలు ఆహార కొరతతో మల మల మాడిపోతున్నారు. సూడాన్‌లో పరిస్థితులపట్ల ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనీ గుటెర్రెస్ మంగళవారం తీవ్రంగా స్పందించారు. సూడాన్‌లో కాల్పుల విరమణ పాటించాలని ఆయన ప్రతిపాదించారు. ఆకలితో మలమల మాడిపోతున్న ప్రజలు బయటకు వచ్చే మార్గాలను అన్వేషించాలని, వారిని వదిలిపెట్టాలని, లేదా అల్-ఫాషెర్‌లోకి మానవతా సహాయాన్ని పంపిణీ చేసేందుకు అనుమతించాలని ఆంటోనీ గుటెర్రెస్ డిమాండ్ చేశారు. సూడాన్‌లో వేలాదిమంది ప్రజలను ఆర్‌ఎస్‌ఎఫ్ ఊచకోత కోస్తోందని ఆయన విమర్శించారు. వీటిని ఆరోపణలుగా పేర్కొంటూ ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్స్ ఖండించింది. 2023లో ప్రారంభమైన ఈ అంతర్యుద్ధంలో ఇప్పటివరకూ 1,50,000 మంది మరణించగా, మరో 1.40 లక్షల మంది ఇళ్ళు వదలిపారిపోయారు.

## భారీ వర్షాలు (మొదటి పేజీ తరువాయి)

కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్ జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేశామన్నారు. ఆసిఫాబాద్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయనే అంచనాలు ఉన్నాయని తెలిపారు. గురువారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, ములుగు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయన్నారు.

## శాశ్వత ఉద్యోగాలు (మొదటి పేజీ తరువాయి)

తేజస్వీ యాదవ్ అన్నారు. ప్రజలు 'పడాయి' (మెరుగైన విద్య), 'దవాయి' (మెరుగైన ఆరోగ్య సౌకర్యాలు), 'కమాయి' (ఉపాధి),'సిచాయ్' (మెరుగైన నీటిపారుదల సౌకర్యాలు) అందించే ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారని ఆయన అన్నారు. బిహార్ పట్ల ఎన్‌డిఎకి ఎలాం టి దార్శనికత లేదని, వారు ఇప్పటివరకు ఎన్నికల కోసం మ్యానిఫెస్టోను విడుదల చేయలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌ను బిజెపి నాయకులు, అవినీతి అధికారులు కీలుబొమ్మగా మార్చారని, బిజెపిని పెంచుకోవడంపైనే ఆ పార్టీకి ఆసక్తి ఉందని, అందుకు నితీశ్‌కుమార్‌ను ఉపయోగించుకుంటున్నారని, ఆయన ముఖ్యమంత్రి ముఖం కాదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇప్పటికే స్పష్టం చేశారని ఆయన ఆరోపించారు. బిహార్ నిషేధం, ఎక్సైజ్ చట్టం పూర్తిగా విఫలమైందని,ఇండియా బ్లాక్ అధికారంలోకి వస్తే, కల్లుపై నిషేధాన్ని ఎత్తేస్తామని తేజస్వీ యాదవ్ అన్నారు. బిహార్ అభివృద్ధికి ఇండియా బ్లాక్ మ్యానిఫెస్టో ఒక రోడ్ మ్యాప్ అని, రాష్ట్రాన్ని నంబర్ వన్ గా మార్చాలనేది దీని సంకల్పం అని ఆయన పేర్కొన్నారు. లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ బుధవారం నుంచి ఇండియా బ్లాక్ తరఫున బిహార్ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని పవన్ ఖేడా తెలిపారు.

**వక్ఫ్ సవరణ చట్టం అమలుకు నో..**
**బౌద్ధ సమాజ సభ్యులకు బౌద్ధ దేవాలయాల నిర్వహణ ..**

తాము అధికారంలోకి వస్తే బిహార్‌లో వక్ఫ్ (సవరణ) చట్టం అమలును అడ్డుకుంటామని, వక్ఫ్ ఆస్తుల నిర్వహణను మరింత పారదర్శకంగా, సంక్షేమ ఆధారితంగా చేస్తామని మ్యానిఫెస్టోలో పేర్కొన్నారు. బుద్ధగయలోని బౌద్ధ దేవాలయాల నిర్వహణను బౌద్ధ సమాజ సభ్యులకు అప్పగిస్తామని ప్రతిపక్ష కూటమి హామీ ఇచ్చింది.'అన్ని మైనారిటీ వర్గాల రాజ్యాంగ హక్కులు రక్షించబడతాయి. వక్ఫ్ (సవరణ) చట్టం నిలిపివేయబడుతుంది... వక్ఫ్ ఆస్తి నిర్వహణ పారదర్శకం గా, సంక్షేమ ఆధారితంగా, ఉపయోగకరంగా చేయబడుతుంది' అని ఇండియా బ్లాక్ మ్యానిఫెస్టోలో పేర్కొంది.

## ఉద్యోగాల కోత (మొదటి పేజీ తరువాయి)

అమెజాన్ వెబ్ సర్వీసెస్‌తోసహా అనేక విభాగాలపై ఈ కోత ప్రభావం పడుతుందని అంచనావేస్తున్నారు. ప్రపంచంలో అతిపెద్ద ఇ-కామర్స్ కంపెనీ, క్లౌడ్ కంప్యూటింగ్ సర్వీస్ ప్రొవైడర్ అమెజాన్ తన కంపెనీ క్రమబద్ధీకరణకు,బ్యూరోక్రసీని తగ్గించడానికి 30,000 ఉద్యోగాలలో కోత పెట్టేందుకు సిఇఓ ఆండీ జెస్సీ చొరవ తీసుకున్నారని రాయిటర్స్ వార్తాసంస్థ తొలుత ప్రకటించింది. ఈ వార్తపై వ్యాఖ్యానించేందుకు తిరస్కరించిన అమెజాన్, 14,000 కార్పొరేట్ ఉద్యోగాలలో కోత పెడుతున్నట్లు మంగళవారం అధికారిక ప్రకటన చేసింది. కంపెనీ ఖర్చులు తగ్గించాలని ఆండీ జెస్సీ ఈ ఏడాది జూన్ నెల నుండీ చాలా గట్టి పట్టుదలతో ఉన్నారు. ఈ మేరకు ఉద్యోగులకు లేఖ ద్వారా ఒక సందేశాన్ని చూచాయిగా అందించారు. ఇప్పుడు ఈ లేఖను కూడా జతచేసి ప్రకటన విడుదల చేశారు. సిఇఓగా 2021లో ఆయన బాధ్యతలు చేపట్టినప్పటినుండీ భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా కంపెనీలో కృత్రిమ మేధ ప్రాధాన్యాన్ని పెంచాలని ఉవ్విళ్ళూరుతున్నారు. ఆటోమేషన్ నిత్యకృత్యంగామారడం, అనిశ్చితి వంటి అనేక అంశాలు శ్రామికశక్తిని కుదించేందుకు దారితీశాయి. కంపెనీ శ్రామికశక్తి వినియోగంపై కృత్రిమ మేధ ప్రభావం చూపిస్తుందని రాబోయే సంవత్సరాలలో దానికే ప్రాధాన్యం వస్తుందని ఆండీ జెస్సీ ముందునుండీ హెచ్చరించిన విధంగానే ఈ నిర్ణయం ప్రకటించారు. దాదాపు 1000 జనరేటివ్ ఎ ఐ సర్వీసులు, వివిధ రకాల సేవలు అందించే ఎఐ అప్లికేషన్లు చురుగ్గా నిర్మాణంలో ఉన్నాయని ఆనాడే ఆయన చెప్పారు. కానీ ఎంతమంది ఉద్యోగులను తొలగిస్తారన్న విషయాన్ని ఆనాడు ఆయన ప్రకటించలేదు. కంపెనీ అనుసరించిన ''రిటన్ లూ ఆఫీస్'' విధానాన్ని అమలు చేయడంలో, స్వచ్ఛంధంగా తొలగింపులను సృష్టించడంలో వైఫల్యాలు ఎదురయ్యాయని, అందువల్లనే ఈ స్థాయిలో కంపెనీలో తొలగింపుల పరిస్థితికి దారితీసిందని కంపెనీ వర్గాలు చెబుతున్నాయి.





## నవీన్ యాదవ్‌కు సంపూర్ణ మద్దతు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జూబ్లీహిల్స్ శాసనసభ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు కమ్మ సంఘాల నాయకులు తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కాంగ్రెస్‌ను భారీ మెజారిటీతో గెలిపిస్తామని సిఎం రేవంత్ రెడ్డికి హామీనిచ్చారు. కమ్మ సంఘాల నాయకులు హైదరాబాద్, జూబ్లీ హిల్స్‌లోని సిఎం నివాసంలో కమ్మ సంఘాల నాయకులు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డితో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు తమ సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్లారు. నామినేటెడ్ పదవుల్లో తమ సామాజికవర్గానికి తగిన ప్రాధాన్యత కల్పించాలని, అమీర్‌పేట్ మైత్రీ వనంలో మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కమ్మ సంఘం ప్రతినిధులు సిఎంను కోరారు. దీనిపైన సిఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశంలో మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, పొన్నం ప్రభాకర్, సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపి అనిల్ కుమార్ యాదవ్, శేరిలింగంపల్లి ఎంఎల్‌ఎ అరికెపూడి గాంధీ, కూకట్ పల్లి ఇన్‌చార్జ్ బండి రమేశ్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, కమ్మ సంఘాల ముఖ్య నాయకులు హాజరయ్యారు.

## స్కూల్ నిర్మాణానికి రూ.10 కోట్ల నిధులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'సమగ్ర శిక్ష' కింద రంగారెడ్డి జిల్లాలోని ఫారూఖ్‌నగర్ మండలం, మొగిలిగిద్ద గ్రామంలో జిల్లా పరిషత్ హై స్కూల్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. ఈ మేరకు పాఠశాల విద్యా శాఖ కార్యదర్శి డాక్టర్ యోగితా రాణా రూ. 10 కోట్లను మంజూరు చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

## 80 టిఎంసిలు (మొదటి పేజీ తరువాయి)

రూపొందించాలని అధికారులను సిఎం ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని డ్యాముల స్థితి గతులపైన నివేదికను రూపొందించాలని అధికారులను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రాజెక్టుల వారీగా పూర్తిస్థాయి నివేదికల ఆధారంగా తదుపరి తీసుకోవాల్సిన చర్యల పట్ల నవంబర్ రెండవ వారంలో మరోసారి సమీక్ష సమావేశాన్ని నిర్వహించాలని సిఎం నిర్ణయించారు. బ్యారేజీల రిపేర్లకు అవసరమై న ప్రణాళికలు సిద్ధం చేయాలని, దీనికి సంబంధిత ఏజెన్సీలే బాధ్యత వహించేలా చూడాలని సిఎం సూచించారు.



## 'సిఎం ప్రజావాణి'లో 256 దరఖాస్తులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన 'సిఎం ప్రజావాణి' కార్యక్రమంలో మొత్తం 256 దరఖాస్తులను స్వీకరించారు. ఇందులో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 71, రెవెన్యూ శాఖకు సంబంధించి 37, ఇందిరమ్మ ఇండ్ల కోసం 83దరఖాస్తులు రాగా, ప్రవాసి ప్రజావాణికి ఒక దరఖాస్తు అందింది. ఇతర శాఖలకు సంబంధించి 64 దరఖాస్తులు అందినట్టు అధికారులు తెలిపారు. సిఎం ప్రజావాణి ఇన్‌చార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులను స్వీకరించి ప్రజలు ప్రస్తావించిన సమస్యలను ఆయా శాఖలకు చెందిన సంబంధిత అధికారులతో వారు ఫోన్ లో మాట్లాడారు.

## 'ఏరో ఇంజిన్' రాజధాని (మొదటి పేజీ తరువాయి)

'రోడ్ మ్యాప్'ను సిద్ధం చేస్తున్నామన్నారు. 'టాటా అడ్వాన్స్‌డ సిస్టమ్స్ లిమిటెడ్ , 'సాఫ్రాన్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్స్' సంయుక్తంగా రూ.425 కోట్ల పెట్టుబడితో ఆదిభట్లలో ఏర్పాటు చేసిన 'ఏరో ఇంజిన్ రొటేటివ్ కాంపోనెంట్స్' న్యూ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీని మంగళవారం హైటెక్ సిటీలోని ఐటిసి కోహినూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వర్చువల్‌గా ఆయన ప్రారంభించారు. గ్లోబల్ 'ఏరోస్పేస్‌డిఫెన్స్ స్పేస్' హబ్‌గా తెలంగాణ ను మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున తీసుకుంటున్న చర్యలను ఈ సందర్భంగా ఆయన వివరించారు. హైదరాబాద్ అంటే కేవలం 'సిటీ ఆఫ్ పెరల్స్' మాత్రమే కాదని, ప్రొపల్షన్, ప్రెసిషన్, ప్రోగ్రెస్ నగరంగా మార్చేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. ఏరోస్పేస్, రక్షణ రంగాల ఎగుమతులు 2023-24లో రూ.15,900 కోట్లు ఉండగా, 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొదటి 9 నెలల్లోనే ₹30,742 కోట్లకు పెరిగాయన్నారు. ఇవి కేవలం అంకెలు మాత్రమే కాదని, తమ ప్రభుత్వ హయాంలో ఈ రంగం సాధించిన వృద్ధి రేటుకు నిదర్శనమన్నారు. ఈ 'న్యూ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ'లో ఎయిర్‌బస్, బోయింగ్ సంస్థలు లీప్ ఇంజిన్ల తయారీలో వినియోగించే బేరింగ్ హౌసింగ్ (స్టేషనరీ కాంపోనెంట్), లో ప్రెషర్ ట్బన్ షాఫ్ట్ (రోటేటివ్ కాంపోనెంట్) తయారవుతాయన్నారు. ఫలితంగా తెలంగాణ బ్రాండ విశ్వవ్యాప్తమవ్వడంతో పాటు కొత్తగా 500 మందికి ఉపాధి లభిస్తుందన్నారు. 'విమాన ప్రయాణ భవిష్యత్తును నిర్మించాలనుకుంటే దానిని తెలంగాణలో నిర్మించండి' అని ఈ వేదికగా అంతర్జాతీయ దిగ్గజ ఏరో సంస్థలకు పిలుపునిచ్చారు. ఇంజిన్స్, కాంపోనెంట్స్, ఎమ్మార్వో, కన్వర్షన్స్, స్పేస్, డ్రోన్స్, డిజిటల్, ఏఐ మాన్యుఫ్యాక్చరింగ్ తదితర రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ సీఈవో, ఎండీ సుకరన్ సింగ్, ఈడీ మసూద్ హుస్సేన్, సాఫ్రాన్ ఎయిర్ క్రాఫ్ట్ ఇంజిన్స్ వైస్ ప్రెసిడెంట్ డొమినిక్ డూప్, టీజీఐఐసీ ఎండీ శశాంక, తెలంగాణ ఏరో స్పేస్ డిఫె న్స్ డైరెక్టర్ ప్రవీణ్ పిఎ తదితరులు పాల్గొన్నారు.

## తీరందాటిన 'మోంథా'
(మొదటి పేజీ తరువాయి)

నిర్వహణ సంస్థ వెల్లడించింది. ఇప్పటికే కోస్తా అంతటా అనేక ప్రాంతాల్లో భారీ వృక్షాలు నేలకూలాయి. విద్యుత్ స్థంభాలు నేలకొరిగాయి. ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమయ్యాయి. మామిడికుదురు మండలం మాకినపాలెం గ్రామంలో ఈదురుగాలులకు తాటిచెట్టు కూలి 49 ఏళ్ళ మహిళ మృతి చెందింది. నగరం గ్రామంలో మరో తాటిచెట్టు కింద పడి 15 ఏళ్ళ మందపాటి ప్రవీణ్ తీవ్రంగా గాయపడ్డాడు. కోస్తాలోని అన్ని జిల్లాల్లో భారీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా నెల్లూరు జిల్లా దగదర్తి, ప్రకాశం జిల్లా సింగరాయకొండలో కుంభవృష్టి కురిసింది. ఈ రెండు ప్రాంతాల్లో దాదాపు 100 మిల్లీమీటర్లకు పైగా వర్షపాతం నమోదైంది. ఒక్క నెల్లూరు జిల్లాలోనే 15 ప్రాంతాల్లో 50 నుంచి 100 మిల్లీమీటర్ల మధ్యలో వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. తుపాన్ ప్రభావం నేపథ్యంలో శంషాబాద్ నుంచి ఏపీకి వెళ్లాల్సిన 18 విమాన సర్వీసులు రద్దయ్యాయి. దక్షిణ మధ్య రైల్వే దాదాపు 107 రైళ్ళను రద్దు చేసింది. కొన్నింటిని దారిమళ్ళించారు. ఏపీ, తెలంగాణాలో ప్రత్యేక వార్ రూమ్‌లు ఏర్పాటు చేశారు.

## చంద్రన్న, బండి ప్రకాష్
(మొదటి పేజీ తరువాయి)

1983లో కమాండర్ స్థాయికి వెళ్లి 1992లో ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శిగా పనిచేశారని, 2008లో మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడయ్యారని తెలిపారు. దాదాపు 17 ఏళ్ల పాటు మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడిగా కొనసాగారని ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన పిలుపుతో బండి ప్రకాష్‌తో పాటు పుల్లూరి ప్రసాదరావు లొంగిపోయారని స్పష్టం చేశారు. ఆరోగ్య పరిస్థితి క్షీణించడం, దీర్ఘకాలిక మోకాళ్ల వ్యాధి, భద్రతా దళాల నిరంతర ఒత్తిడి అలాగే సిపిఐ మావోయిస్టులో ఏర్పడిన సిద్ధాంతపరమైన భేదాభిప్రాయాలు, అంతర్గత విభేదాలు వంటి కారణాల వల్ల చంద్రన, ప్రకాష్‌లు పార్టీతో తమ సంబంధాలను తెంచుకొని తెలంగాణ ప్రభుత్వ సహాయంతో జన జీవన స్రవంతిలో తిరిగి చేరాలని నిర్ణయించుకోవడం జరిగిందని డిజిపి శివధర్‌రెడ్డి తెలిపారు. మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన బండి ప్రకాష్ (55)1984 అక్టోబర్‌లో సిపిఐ నాయకుడు విటి అబ్రహం హత్యకు పాల్పడి 1988లో అదిలాబాద్ జైలు నుంచి పారిపోయి 1999లో మావోయిస్టు ఉద్యమంలో చేరి అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడని డిజిపి తెలిపారు. అబ్రహం హత్య కేసులో జీవిత ఖైదు శిక్ష విధించగా 1992లో మల్కాజ్‌గిరిలో ప్రకాష్‌ను అరెస్టు చేసి చంచల్‌గూడ జైలుకు తరలించారు. 2004 ఆగస్టులో క్షమాభిక్షపై ఇతను విడుదలయ్యాడు.2005లో ప్రభుత్వంతో మావోయిస్టులు జరిపిన శాంతి చర్చలు విఫలం కావడంతో ప్రకాష్ మళ్లీ అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు.2015 నుండి ఇప్పటి వరకు ఇతను సింగరేణి కోల్ బెల్ట్ కమిటి ఇన్‌ఛార్జ్‌తో పాటు తెలంగాణ రాష్ట్ర కమిటి ప్రెస్ టీమ్ ఇన్‌ఛార్జ్‌గా కొనసాగుతూ మావోయిస్టు పత్రికా ప్రకటనలను ప్రభాత్ పేరుతో విడుదల చేస్తున్నాడని డిజిపి వివరించారు. పుల్లూరు ప్రసాద్‌రావు మీద ప్రకటించిన రూ.25 లక్షల నగదు, బండి ప్రకాష్ పేరు మీద ప్రకటించిన రూ.20లక్షల నగదు బహుమతిని డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో డిజిపి వారికి అందించారు. వీరిద్దరికి పునరావాస విధానంలో లభించాల్సిన అన్ని ప్రయోజనాలు అందిస్తామని డిజిపి స్పష్టం చేశారు.

**ఈ ఏడాది లొంగిపోయిన వారి సంఖ్య 427..**

అజ్ఞాతంలో ఉన్న సిపిఐ (మావోయిస్టు) పార్టీకి చెందిన 427 మంది నేతలు, సభ్యులు ఈ ఏడాది లొంగిపోయిన వారిలో ఉన్నారని డిజిపి శివధర్‌రెడ్డి తెలిపారు. వీరిలో ఇద్దరు కేంద్ర కమిటి సభ్యులు, ఎనిమిది మంది రాష్ట్ర కమిటి సభ్యులు, ఇద్దరు డివిజన్ కమిటి కార్యదర్శులు, ఎనిమిది మంది డివిజన్ కమిటి సభ్యులు, 35 మంది ఏరియా కమిటి సభ్యులు సాయుధ పోరాటాన్ని వీడి తమ కుటుంబాలతో కలిసి శాంతియుత జీవితం గడపాలని పోలీసుల ముందు లొంగిపోయారని డిజిపి తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రానికి చెందిన 64 మంది మావోయిస్టులు ఇంకా అజ్ఞాతంలో ఉన్నారన్నారు. విలేకరుల సమావేశంలో అదనపు డిజిపి మహేష్ మురళీధర్ భగవత్, ఇంటెలిజెన్స్ చీఫ్ విజయ్‌కుమార్, ఎస్‌ఐబి చీఫ్ బి.సుమతిలతో పాటు లొంగిపోయిన మావోయిస్టు నేతలు పుల్లూరి ప్రసాద్‌రావు, బండి ప్రకాష్‌లు పాల్గొన్నారు.

**ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల కుట్ర భగ్నం**

**భద్రాద్రి కొత్తగూడెం:** పోలీసులే లక్ష్యంగా మావోయిస్టులు తలపెట్టిన కుట్ర భగ్నమైంది. దీంతో సిఆర్‌పిఎఫ్ జవాన్లు తృటిలో ప్రాణాలతో బయట పడ్డారు. వివరాల ప్రకారం, సుక్మా జిల్లా పుల్బాగ్డి పోలీస్ స్టేషన్ పరిధిలోని మావోయిస్టుల కోసం సిఆర్‌పిఎఫ్ బలగాలు కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. ఆ దిశగా బాంబు డిటెక్టర్‌తో సోదాలు నిర్వహిస్తుండగా 40 కేజీల ఐఇడి మందుపాతరను గుర్తించారు. దానిని బయటకు తీసి బిఆర్‌పిఎఫ్ బాంగు స్క్వాడ్ నిపుణులు నిర్వీర్యం చేశారు. దీంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. ఆ ఐఇడి బాంబు పేలితే భారీ నష్టం వాటిల్లేదని పోలీసులు తెలిపారు.




# జనరల్
STATE & REGIONAL NEWS



నల్లకుంట శంకర మఠంలో శృంగేరి జగద్గురువులు విధుశేఖర భారతీ స్వామి వారిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ధర్మ విజయ యాత్రలో భాగంగా హైదరాబాద్‌కు వచ్చిన విధుశేఖర భారతీ స్వామితో సిఎం రేవంత్ రెడ్డి సమావేశమై ఆశీర్వచనాలు పొందారు. ఈ సందర్భంగా సిఎం వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి పనులు, భవిష్యత్ ప్రణాళికల గురించి స్వామివారికి వివరించారు. రాష్ట్రంలోని హిందూ ఆలయాల అభివృద్ధి పట్ల ప్రభుత్వం కట్టుబడి ఉందని సిఎం స్వామికి తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న పాలకులు

● పెండింగ్ ఫీజులను చెల్లించకపోతే విద్యార్థుల చదువులు ఎలా కొనసాగుతుంది? ● ప్రభుత్వ నిర్ణయాలు విద్యార్థులకు శాపంగా మారాయ్ : తక్కళ్ళపల్లి శ్రీనివాస రావు, ఎన్.ఎ స్టాలిన్ మండిపాటు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సమాజానికి అవసరమైన సామాజిక, ఆర్థిక, రాజకీయ, నైతిక, వైజ్ఞానిక, మానవీయ విలువలు కల్పించే సాధనే విద్యా అని, అలాంటి విద్యను నేటి పాలకులు భ్రష్టు పట్టిస్తున్నారని ఎఐఎస్‌ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షుడు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్ళపల్లి శ్రీనివాస రావు, ఎఐఎస్‌ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు ఎన్.ఎ స్టాలిన్ విమర్శించారు. సమస్యల సుడిగుండంలో, సకల సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న విద్యారంగాన్ని కాపాడలేని నిస్సహాయక స్థితిలో పాలక వర్గాలు ఉన్నాయన్నారు. పెండింగ్ ఫీజులను చెల్లించకపోతే విద్యార్థుల చదువులు ఎలా కొనసాగుతుందని?, ప్రభుత్వ నిర్ణయాలు విద్యార్థులకు శాపంగా మారాయని మండిపడ్డారు.హైదరాబాద్, హిమాయత్ నగర్‌లోని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి అధ్యక్షతన ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సమితి సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా తక్కళ్ళపల్లి శ్రీనివాసరావు, ఎన్.ఎ.స్టాలిన్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యారంగంలో నెలకొన్న సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించకుండా, కొత్త సమస్యలను సృష్టిస్తూ, భ్రష్టు పట్టిస్తున్నాయని దుయ్యబట్టారు. విద్యారంగం సమస్యలను పరిష్కరించడంలో పాలక వర్గాలకు ఎటువంటి చిత్తశుద్ధి లేదనే విషయం వారి పాలనతోనే స్పష్టమవుతోందన్నారు. ప్రభుత్వ విద్యను పూర్తిగా నిర్వీర్యం చేసి, పేద, మధ్య తరగతి వర్గాలకు విద్య పూర్తిగా దూరం చేసే కుట్రను అమలు చేస్తున్నారని విమర్శించారు. ఇందులో భాగంగానే 'నూతన జాతీయ విద్యావిధానం2020' పేరుతో కేంద్ర ప్రభుత్వం విద్యను కార్పొరేటీకరణ, విద్య కేంద్రీకరణ, కాషాయికరణ చేయాలని చూస్తోందని దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే జాతీయ నూతన విద్యా విధానాన్ని ఉపసహరించుకోవాలని డిమాండ్ చేశారు. జాతీయ నూతన విద్యా విధానాన్ని రద్దు చేసేందుకు విద్యార్థులు ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. ఎన్.ఎ.స్టాలిన్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని ఉద్ధరిస్తామంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, విద్య పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైంది కాదన్నారు. రాజకీయ లబ్ధి కోసం వందల కోట్ల రూపాయాల ప్రజాధనాన్ని ఖర్చు చేస్తున్న పాలకులు, ప్రభుత్వ విద్యను పక్కన పెడుతోందని మండిపడ్డారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్స్, ఫీజు రియింబర్స్‌మెంట్ రూ. 8, 300 కోట్ల బకాయిలను, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ విద్యార్థుల బకాయిలను చెల్లించడం లేదని, తద్వారా విద్యార్థులు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నిరవధిక సమ్మె నోటీస్‌లు ఇచ్చిన ప్రైవేటు విద్యా సంస్థల యాజమాన్య సంఘాలతో రాష్ట్ర ప్రభుత్వం చర్చించి, విద్యార్థుల విద్యా సంవత్సరం నష్టపోకుండా చూడాలని కోరారు.

ఈ సమావేశంలో ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మ ణ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ, గ్యార నరేష్, రహమాన్, గ్యార క్రాంతి, సి.రాజు, రాష్ట్ర నాయకులు జేరిపోతుల జనార్దన్, మచ్చ రమేష్, భాషబోయిన సంతోష్, నెల్లి సత్య, అక్రమ్, అజిత్, ప్రీతమ్, దిడ్డి పార్థసారథి, మూడవత్ పవన్, ప్రణీత్ గౌడ్, ప్రవీ ణ్, బి.ప్రేమ్ కుమార్, దినాకర్, అనిల్, హరీష్, దత్తు రెడ్డి,ప్రవీణ్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## సినిమా టికెట్ ధర పెంచాలంటే సినీ కార్మికులకు 20% వాటా ఇవ్వాల్సిందే

అభినందన సభలో సినీ కార్మికులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరాల జల్లు






**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇక నుంచి సినిమా టికెట్ ధర పెంచాలంటే కార్మికులకు 20 శాతం వాటా ఇవ్వాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. వాటా ఇస్తేనే టికెట్ల పెంపునకు జిఒ ఇస్తామని స్పష్టం చేశారు. హైదరాబాద్ యూసుఫ్ గూడ పోలీస్ గ్రౌండ్స్‌లో మంగళవారం సిని కార్మిక సంఘాల ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సినీ కార్మికులపై సిఎం వరాల జల్లు కురిపించారు. సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వాలు సినీ పరిశ్రమ అభివృద్ధి కోసం కృషి చేశాయన్నారు. తెలుగు సినీ పరిశ్రమను హైదరాబాద్‌కు తీసుకురావడంలో ఆనాటి ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి, అన్న ఎన్‌టిఆర్, అక్కినేని నాగేశ్వరరావు, కృష్ణ వంటి ప్రముఖులు కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. డాక్టర్ ప్రభాకర్ రెడ్డి సినీ, కార్మికులను ఆదుకున్నారన్నారు. డాక్టర్ ప్రభాకర్ రెడ్డి సినీ కార్మికుల కోసం మణికొండలో 10 ఎకరాల స్థలాన్ని అందించి, చిత్రపురి కాలని ఏర్పాటులో కీలక పాత్ర పోషించారన్నారు. సిని కార్మికుల శ్రమ తనకు తెలుసునని, ఆస్కార్ స్థాయికి తెలుగు పరిశ్రమ వెళ్లింది అంటే కారణం కార్మికులేనని అన్నారు. సినీ కార్మికులు రాత్రి పగలు తేడా లేకుండా శ్రమిస్తున్నారని అభినందించారు. వారి సమస్యలను తెలుసుకునేందుకే దిల్ రాజును ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించామన్నారు. 1964లో నంది అవార్డులను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిందని సిఎం గుర్తు చేశారు. గత ప్రభుత్వం నంది అవార్డులను పట్టించుకోలేదన్నారు. నిలిపివేసిన నంది అవార్డుల స్థానంలో ప్రజాయుద్ధ నౌక గద్దర్ పేరుమీదు గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్‌ను ప్రకటించి చిత్ర పరిశ్రమను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్‌ను ప్రపంచ సినీ పరిశ్రమకు వేదికగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. తెలంగాణ రైజింగ్ 2047 ప్రణాళికలో ఫిల్మ్ ఇండస్ట్రీకి ప్రత్యేక చాప్టర్ ఉంటుందన్నారు. హాలీవుడ్‌ను హైదరాబాద్‌కు తీసుకువచ్చే బాధ్యత తనదన్నారు. చిన్న సినిమాలను తక్కువచేసి చూసే ప్రసక్తే లేదన్నారు. సినీ కార్మికులకు ఉచిత వైద్యం అందిస్తామని హామీనిచ్చారు. కృష్ణానగర్ ప్రాంతంలో సినీ కార్మికుల పిల్లలు చదువుకునేందుకు 34 ఎకరాల్లో కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాల నిర్మిస్తామని హామీనిచ్చారు. 'కర్ణుడు ప్రాణం పోయినా మిత్రధర్మం వదలలేదు, అలానే మీకు అండగా నిలబడడం తెలంగాణ ప్రభుత్వ ధర్మం' అని సిఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఆలోచనలో చిత్తశుద్ధి ఉంటే ప్రకృతి కూడా సహకరిస్తుందన్నారు. నవంబర్ చివరి వారంలో సినీ కార్మికుల సమస్యలపై మరోసారి సమావేశం ఏర్పాటు చేసి, సంక్షేమానికి సమగ్ర ప్రణాళిక రూపొందిస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపి అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు, సిని నిర్మాతలు, దర్శకులు, కార్మిక సంఘాల ప్రతినిధులు తదితరులు హాజరయ్యారు.

### సినీ కార్మికులపై సిఎం వరాల జల్లు..

- సినీ కార్మికుల కోసం ప్రత్యేక వెల్ఫేర్ ఫండ్ ఏర్పాటు.
- ఆ నిధికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.10 కోట్లు మంజూరు.
- సినిమా ఆదాయంలో 20 శాతం వాటా కార్మికుల వెల్ఫేర్ ఫండ్‌కు ఇవ్వాలన్న సూచన.
- టికెట్ ధరలు పెంపు అనుమతులు కూడా కార్మికుల వాటా నిబంధనతో మాత్రమే ఇస్తాం.
- కార్మిక సంఘాల అసోసియేషన్ భవన నిర్మాణానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం.
- భారత్ ఫ్యూచర్ సిటీలో సిని ఫైటర్స్ ట్రైనింగ్‌కు స్థలం కేటాయిస్తాం.
- కృష్ణా నగర్‌లో సిని కార్మికుల పిల్లల కోసం కార్పొరేట్ స్థాయి పాఠశాల నిర్మిస్తాం.
- ఆరోగ్య సమస్యలకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్యం అందించనున్నట్లు సిఎం హామీలు ఇచ్చారు.

## అప్పుడు అడవిలో.. ఇప్పుడు జనంలో

మావోయిస్టు భావజాలాన్ని ఓడించడం ఎవరి తరం కాదు: పుల్లూరి ప్రసాదరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ డిజిపి శివధర్ రెడ్డి ఎదుట లొంగిపోయిన మావోయిస్టు పార్టీ కీలక నేత పుల్లూరి ప్రసాదరావు అలియాస్ చంద్రన్న కీలక వ్యాఖ్యలు చేశారు. 'మాది లొంగుబాటుకాదు.. అభివృద్ధిలో కలిసి పనిచేయడానికే జనజీవన స్రవంతిలో కలిశాం.. ఇప్పటి వరకు ఉద్యమంలో పీడిత ప్రజల కోసమే పోరాటం చే శాం భవిష్యత్తు లో కూడా అలాగే చేస్తాం.. మా సిద్ధాంతం ఓడిపోలేదు.. ఓడించడం కూడా ఎవరితరం కాదు.. ప్రజల మధ్య ఉండి సేవ, పోరాటం చేయాలని నిర్ణయించుకున్నాం.. ఆయుధాలను పార్టీకే ఇచ్చి జనంలోకి వచ్చాం'' అని చంద్రన్న కీలక వ్యాఖ్యలు చేశారు. డిజిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మీడియా అడిగిన పలు ప్రశ్నలకు ఆ యన సమాధానం చెప్పారు. ప్రస్తుతం సిపిఐ (మావోయిస్టు) ప్రధాన కార్యదర్శిగా తిప్పిరి తిరుపతి అలియాస్ దేవోజి ఎన్నికయ్యారని ఆయన స్పష్టం చేశారు. మావోయిస్టు పార్టీలో చీలిక వచ్చిందని చెప్పారు. ప్రస్తుతం చంద్రన్నతో కలిసి తాము ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజల కోసం పనిచేయడం ఖాయమన్నారు. మావోయిస్టు భావజాలంను ఓడిచ దం ఎవరితరం కాదు, ఎల్లవేళ్లలో బతికే ఉంటుందన్నారు. ప్రజల నుంచే ఈ భావజాలం పుట్టుకొస్తుందని ఆశిస్తున్నానన్నారు. కాగా, తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఉన్న చంద్రన్న.. మావోయిస్టు పార్టీలో 45 ఏళ్లు వివిధ స్థాయిల్లో పనిచేశారు. పోలీసుల ఎదుట లొంగిపోయి, జనజీవన స్రవంతిలో కలిసిన మావోయిస్టులపై ఎలాంటి చర్యలు ఉండవని తెలంగాణ డిజిపి శివధరరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం చంద్రన్నతో పాటు మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు బండ ప్రకాశ్ కూడా తెలంగాణ డిజిపి ఎదుట లొంగిపోయారు.

## పత్తి మద్దతు ధర పెంచి రైతులను ఆదుకోండి

సిసిఐ చైర్మన్‌కు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విజ్ఞప్తి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో పత్తి రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మంగళవారం ముంబయిలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ లలిత్ కుమార్ గుప్తాతో ప్రత్యేకంగా భేటి అయ్యారు. వారిద్ద రి మధ్య గంట పాటు సాగిన ఈ సమావేశంలో, ప్రస్తు త వాతావరణ పరిస్థితులు, ఎంఎస్‌పి సేకరణతో పా టు రైతులకు తక్షణ ఉపశమనం అందించాల్సిన అవసరాన్ని మంత్రి సిసిఐ చైర్మన్‌కు వివరించారు. తెలంగాణతో సహా దక్షిణ భారత రాష్ట్రాలలో అధిక తేమ స్థా యిలు ఉన్న కారణంగా, ప్రస్తుత నిబంధనల ప్రకారం నిర్దేశించిన 8–12 శాతం తేమ శాతాన్ని పాటించడం అసాధ్యమని మంత్రి స్పష్టం చేశారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలు, తుఫాను వల్ల పంటలు దెబ్బతిన్నాయి. అందుకే, రైతులకు నష్టం జరగకుండా ఉండేందు కు తేమ శాతాన్ని తక్షణమే 14 శాతం వరకు సడలించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. పెరుగుతున్న సాగు ఖ ర్చులకు అనుగుణంగా పత్తికి కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)ని సవరించాలని, అలాగే అన్ని పత్తి పండించే జిల్లాల్లో సిసిఐ కొనుగోలు కేంద్రాలను విస్తరించి , ప్రైవేట్ వ్యాపారుల దోపిడీ నుండి రైతులను కాపాడాలని కోరారు. తెగులు నష్టం, అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు ప్రత్యేక ఉపశమన ప్యాకేజీ అందించాలని కోరారు. గత సీజన్లలో సేకరించిన పత్తికి సంబంధించి రైతులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. పత్తిరైతుల సమస్యలను కేంద్ర ప్రభుత్వంతో చర్చించి,సానుకూలంగా పరిష్కరిస్తామని సిసిఐ చైర్మన్ లలిత్ కుమార్ గుప్తా..మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి హామీ ఇచ్చారు.

## ఎల్ఐసి సొమ్ము అదానీకి బిజెపి ప్రభుత్వం ధారాదత్తం

డిసెంబర్ 26న ఖమ్మంలో సిపిఐ శాతాబ్ది బహిరంగ సభను జయప్రదం చేయాలి

సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి



**ప్రజాపక్షం/నల్లగొండ :** కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఎల్ఐసిలో ఉన్న రూ.33 వేల కోట్ల ప్రజల బీమా సొమ్మును సంక్షోభంలో ఉన్న అదానీ కంపెనీకి కట్టబెట్టి కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తుందని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి ఆరోపించారు. సిపిఐ నల్లగొండ జిల్లా కౌన్సిల్ సమావేశం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం జరిగింది సమావేశానికి జాతీయ కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం ఎల్ఐసిలో దేశ ప్రజల సొమ్మును అదానికి ధారాదత్తం చేయడాని తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రభుత్వం నిర్ణయాని వ్యతిరేకిస్తూ ప్రజలు తిరుగుబాటు చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ నుండి ఈతర రాష్ట్రాలకు వెళుతున్న ప్రైవేట్ ట్రావెల్స్‌లపై ఆర్‌టిఎ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వలన తరుచుగా ప్రమాదాలు జరిగి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదాలు జరిగినప్పుడే అధికారులు, ప్రభుత్వం ఆర్భాటం చేస్తుంది తప్ప మిగతా సమయంలో ఎందుకు తనిఖీలు చేయడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఆర్‌టిఎ అధికారులు నిరంతరం తనిఖీలు నిర్వహించి నిబంధనలను పాటించని ట్రావెల్స్‌లపై చర్యలు తీసుకొని వాహనాలను సీజ్ చేయాలని కోరారు. డిసెంబర్ 26న ఖమ్మం వేదికగా జరిగే భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శాతాబ్ది ఉత్సవ ముగింపు బహిరంగ సభ ఓచారిత్రాత్మక ఘట్టంగా మిగిలిపోతుందని ఇందుకోసం ప్రతి కార్యకర్త నడుం బిగించాలని ఖమ్మంకు తరలిరావాలని పిలుపునిచ్చారు. సిపిఐ 100 సంవత్సరాల ప్రస్థానంలో అనేక పోరాటాలు, ఉద్యమాలు నిర్మించిందని, దేశ స్వతంత్ర పోరాటంలో అగ్ర భాగం నిలిచిందని, తెలంగాణ సాయుధ పోరాటం నడిపి రజాకార్లను తరిమికొట్టిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీదే అన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎల్‌ఏసి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ వాతావరణంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పంటలు దెబ్బతిని రైతంగం తీవ్రంగా నష్టపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తడిసిన వరి ధాన్యం, పత్తిని మద్దతు ధరతో కొనుగోలు చేయవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదన్నారు. వరి,పత్తి తేమ శాతం పేరుతో ఇబ్బందులు పెట్టకుండా వెంటనే కొనుగోలు చేయాలని కోరారు.వరి ధాన్యాన్ని తడవకుండా కాపాడుకోవడానికి రైతులకు సరైన వసతులు కల్పించాలని ప్రభుత్వాని కోరారు. అదేవిధంగా సిపిఐ శతాబ్ది బహిరంగ సభ విజయవంతం కోరుతూ జిల్లా వ్యాప్తంగా నవంబర్ 17 నుంచి జరిగే సిపిఐ జాతను జయప్రదం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి ఉజ్జిని యాదగిరి రావు అధ్యక్షత వహించగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహా రెడ్డి, సినియర్ నాయకులు మల్లేపల్లి అది రెడ్డి,జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్ రెడ్డి, లోడంగి శ్రవణ్ కుమార్,కార్యవర్గ సభ్యులు పబ్బు వీరాస్వామి, గురిజ రామచంద్రం, బంటు వెంకటేశ్వర్లు, బోలు రి నర్సింహా, నల్పరాజు రామలింగయ్య, తీర్పాటి వెంకటేశ్వర్లు, బుచ్చి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





## మాజీ మంత్రి హరీశ్‌రావుకు పితృవియోగం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ మంగళవారం మరణించారు. ఆయన అంత్యక్రియలు హైదరాబాద్, ఫిలింనగర్‌లోని మహాప్రస్థానంలో పూర్తయ్యాయి. సత్యనారాయణ చితికి హరీశ్‌రావు నిప్పు అంటించారు. సత్యనారాయణ మరణం పట్ల ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సంతాపం తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థించారు. హరీష్ రావు కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. హరీశ్‌రావు తండ్రి సత్యనారాయణ మృతి పట్ల రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీ నాయకులు తమ సంతాపాన్ని తెలియజేశారు. కాగా అంతకుముందు హైదరాబాద్‌లోని సత్యనారాయణ భౌతికకాయానికి పలువురు నివాళ్లు అర్పించారు. బిఆర్‌ఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్ రావు సత్యనారాయణ భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. సత్యానారయణ భార్య లక్ష్మ మ్మకు కెసిఆర్ ధైర్యం చెప్పారు. ఆయన మృతి పట్ల కెసిఆర్ విచారం వ్యక్తం చేశారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి,, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, గడ్డం వివేక్ వెంకట స్వామి, బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావుతో పాటు బిఆర్‌ఎస్‌కు చెందిన మాజీ మంత్రులు , ఎంఎల్‌ఎలు, మాజీ ఎంఎల్‌ఎలు, నాయకులు హరీశ్ రావు తండ్రి భౌతికకాయానికి నివాళ్లు అర్పించారు.

**సిపిఐ సంతాపం:** సత్యనారాయణ మరణం పట్ల సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు సంతాపాన్ని తెలియజేశారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని ప్రకటించారు.

PUBLIC NOTICE

To whom so ever It May Concern: In respect of Registered Sale Deed Document No.4104/2025 dtd 11.09.2025 on the file of SRO Bheemgal.This Public Notice issued as per the instructions of my Client The DCB BANK in respect of the In respect of Registered Sale Deed Document 4104/2025 dtd 11.09.2025 on the file of SRO Bheemgal executed by Smt. Arepally Sunitha in favour of Smt. Dusa Divya in respect The RCC ROOFED house bearing G.P No: 2-50/1, admeasuring area place in area 1533.58 Sq.ft or 170.40 Sq. Yards bounded by: North: 12-0" Wide Road, South House of Nadukuda Rajender, East: Open place of Dusa Divya, West: Open Plot of Arepally Rajpal.This public notice is being issued to inform the general public and all concerned parties that my client intend to avail a loan facility from a private bank namely (DCB BANK) against the security of the aforementioned property. At Present the said Property is in the Possession of the Applicant/Present Owner Smt. Dusa Divya. If any-body is having claim, right, mortgage, charge over the said property, approach before me with the documentary evidence within 07 days, otherwise it can be presumed that the said property covered in the Sale Deed Document No. 4104/2025 document is genuine as there is link document No 2030/2019 and also as per the Gram panchayath records said house stands on vendor of my client i.e Arepally Sunitha and authorities issued the Gp ownership Certificate No G.P/03/2018-19 dtd: 10.05.2018. The Bank intends to make advance to the Present owner i.e Dusa Divya as the said property is free from all encumbrances in and charges.

Issued By:
M.Shyam Babu,
B.Sc., LLB.
Advocate,
H.No: 6-7-148,
Hamalwadi X Road,
Nizamabad.
Ph.No: 7386580285

Date: 28.10.2025
Place: Nizamabad

తెలంగాణ ప్రభుత్వము
పంచాయత్ రాజ్ ఇంజనీరింగ్ విభాగము
జిల్లా పంచాయత్ రాజ్ ఇంజనీర్, కొత్తగూడెం.


NIT No. 194/2025-26, E- ప్రొక్యూర్మెంట్ టెండర్ నోటీసు తేది: 28.10.2025

ఈ దిగువ సంతకం దారుచే SERP పథకముల క్రింద భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లోని (01) పనులు కొరకు గాను అంచనా విలువ రూ. 7.20 లక్షలు ఆన్‌లైన్‌లో రిజిస్టర్డ్ కాంట్రాక్టర్ల నుండి పిలవబడుతున్నవి.
ECV, EMD ఇతరవివరములు https://tender.telangana.gov.in నందు ది: 30.10.2025 నుండి లభించును. భవిష్యత్తులో ఏవైనా సవరణలు, నిబంధనలలో మార్పులు ఉన్నచో పై వెబ్‌సైట్ నుండి మాత్రమే ప్రమరించబడును.

Sd- DISTRICT PR ENGINEER, PIU KOTHAGUDEM
Sd/- Dy.Excecutive Engineer(T) PIU Division, Kothagudem
DIPR R.O. No. : 9824-PP/CL/ADVT/1/2025-26, Date: 28-10-2025

## రాజకీయ ఉద్దేశంతోనే ఇసి నిర్ణయాలు

సిపిఐ(ఎం) మాజీ ప్రధాన కార్యదర్శి ప్రకాశ్‌కరత్ విమర్శ




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారత ఎన్నికల సంఘం (ఇసి) స్వతంత్రంగా వ్యవహరించాలని, ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని సిపిఐ(ఎం) మాజీ ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ కరత్ డిమాండ్ చేశారు. ఈనెల 23న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రారంభమైన సిపిఐ (ఎం) అఖిల భారత స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు మంగళవారంతో ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రకాశ్‌కరత్ మాట్లాడుతూ ఇసి రాజకీయ ఉద్దేశంతో నిర్ణయాలు తీసుకుంటున్నదని విమర్శించారు. 12 రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ నిర్వహించాలని ఇసి ప్రకటించిందన్నారు. రెండు నెలల క్రితం ఎస్ఐఆర్‌ను బీహార్‌లో నిర్వహించిందని గుర్తు చేశారు. లౌకిక, ప్రతిపక్ష పార్టీలన్ని ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశాయని చెప్పారు. బతికున్న ప్రజల ఓట్లను ఇసి తొలగించిందని విమర్శించారు. ఎస్ఐఆర్ పై సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని అభ్యంతరాలు వ్యక్తం చేసిందన్నారు. ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తూ కేరళ అసెంబ్లీ తీర్మానం చేసిందన్నారు. అక్కడ స్థానిక సంస్థల ఎన్నికలు జరగబోతున్నాయని చెప్పారు. ఈ సమయంలో ఎస్ఐఆర్‌ను నిర్వహిస్తే ప్రజలు గందరగోళానికి గురవుతారని అన్నారు. ఓటర్ జాబితాలో పేరు నమోదు చేసుకునేందుకు ఆధార్ కార్డును కూడా పరిగణనలోకి తీసుకోవాలని ఇసిని సుప్రీంకోర్టు ఆదేశించిందన్నారు. రాజకీయ ఉద్దేశంతో ఇసి నిర్ణయాలు తీసుకుంటున్నదని విమర్శించారు. గతంలో ఇసి నిర్ణయాలను అధికారంలో ఉన్న పార్టీ వ్యతిరేకించేదని గుర్తు చేశారు. ఇప్పుడు అధికార పార్టీకి అనుకూలంగా నిర్ణయాలు తీసుకోవడం సరైంది కాదన్నారు. ఇసి స్వతంత్రతను కోల్పోతున్నదని ప్రకాష్‌కరత్ ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్ఐఆర్‌పై సుప్రీం కోర్టు మధ్యంతర ఉత్తర్వులు మాత్రమే ఇచ్చిందని, ఇంకా తుది తీర్పును వెల్లడిరచలేదని గుర్తు చేశారు. దేశంలో ఆర్ఎస్ఎస్, బిజెపిపై రాజకీయంగా, సైద్ధాంతికంగా పోరాటం చేయాలని ప్రకాశ్ కరత్ పార్టీ శ్రేణుల కు పిలుపునిచ్చారు. ఇందుకోసం వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర శక్తులను ఐక్యం చేస్తామని చెప్పారు. ఆర్ఎస్ఎస్, బిజెపి హిందూత్వ ఎజెండాను అమలు చేస్తున్నాయని విమర్శించారు. బిజెపి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా పార్టీని బలోపేతం చేయాలని ఏప్రిల్‌లో మధురైలో నిర్వహించిన సిపిఐ(ఎం) 24వ మహాసభలో లక్ష్యంగా నిర్దేశించుకున్నామన్నారు. పార్టీ స్వతంత్ర బలాన్ని పెంచుకోవడంతో పాటు రాజకీయంగా, సైద్ధాంతికంగా బలోపేతం కావాలన్నారు. సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు మాట్లాడుతూ లౌకిక శక్తులన్నింటిని ఒకవే దిక మీదకు తేవడం తమ లక్ష్యమన్నారు. బిజెపి, ఆర్ఎస్ఎస్‌కు వ్య తిరేకంగా జరిగే పోరాటాలకు పార్టీ శ్రేణులను సంసిద్ధం చేస్తామన్నారు.

### ఫీజు బకాయిలను విడుదల చేయాలి : జాన్‌వెస్లీ

రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫీజు బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాలు ఈనెల 30న తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. సిపిఐ(ఎం) మాజీ ఎంపి పి.కె. బిజు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.డి. అబ్బాస్ తదితరులు పాల్గన్నారు.

శ్రీ కోదండ రామస్వామి దేవస్థానం
గ్రా|| నవాబుపేట, మం|| లింగాలఘణపురం, జి|| జనగామ.

లేఖ నెం. 10/SKRSD/2025, ఈ-టెండర్, సీల్డ్ టెండర్ మరియు బహిరంగ వేలం ప్రకటన తేది: 16.10.2025

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా! జనగామ జిల్లా, లింగాలఘణపురం మండలం, నవాబుపేట నందు గల శ్రీ కోదండరామస్వామి వారి దేవస్థానమునకు చెందిన 2025 2026వ సంవత్సరమునకు చెందిన అంగడి హక్కు పొందు వేలం పాటను ఈ-టెండర్, సీల్డ్ టెండర్ మరియు బహిరంగవేలం ప్రక్రియల ద్వారా తేది. 30-10-2025 గురువారం మ. 12:00 గం.లకు శ్రీయుత కలెక్టరు గారి కార్యాలయము, జనగామ నందు జరుపుటకు నిర్ణయించడమైనది. ఈ వేలంపాట నందు పాల్గొనదలచిన వారు తేది: 26-10-2025 నుండి 30-10-2025 ఉ.10:30 ని.ల వరకు ఆన్‌లైన్‌లో https://tender.telangana.gov.in వెబ్‌సైట్ నందు టెండరు దాఖలు చేసుకోవలయును. సీల్డ్ టెండర్స్ కోరు వార్కి 26-10-2025 నుండి 29-10-2025 సాయంత్రం 5:00 గం.ల వరకు దేవస్థాన కార్యాలయము నందు టెండర్స్ షెడ్యూల్ ఫారం లభించును. సీల్డు టెండర్స్ 30-10-2025 మ.12:00 గం.లకు శ్రీయుత కలెక్టరు గారి కార్యాలయ ఆవరణ నందు గల మీటింగు హాలు నందు పెట్టబడిన టెండరు బాక్సు నందు రూ. 10,00,000/- ధరావత్తు డి. డి. జతపర్చి టెండరు వేయవలెను. బహిరంగ వేలం పాటలో పాల్గొనదలచినవారు తేది.26-10-2025 ఉ.10:00 గం.ల నుండి తేది 29-10-2025 రోజు సా. 5:00 గం.ల లోపు దేవస్థాన కార్యాలయము నందు రూ. 5,000/-లు చెల్లించి రశీదు పొందవలయును. రశీదు మరియు 10,00,000/- డిడితో తేది: 30-10-2025 గురువారం మ. 12:00గం.లకు శ్రీయుత కలెక్టరు గారి కార్యాలయము, జనగామకు హాజరు కావలయును.

ఈ-టెండర్, సీల్డ్ టెండర్ మరియు బహిరంగవేలం షెడ్యూలు

| క్ర.సం. | ఈ-టెండరు వివరములు | ధరావత్తు సొమ్ము | షెడ్యూలు ఖరీదు | కాలపరిమితి |
|---|---|---|---|---|
| 1 | అంగడి వేలం | రూ. 10,00,000/- డి.డి. ద్వారా | 115,000/- డి.డి. ద్వారా | 22-11-2025 21-11-2026 1 సంవత్సరం మాత్రము |

శ్రీ బి.వి. సురేష్ బాబు, ఫౌండర్ ట్రస్టీ
ఇట్లు అర్చక మరియు సిబ్బంది
బి.లక్ష్మీ ప్రసన్న, కార్యనిర్వహణాధికారి, సెల్: 8317600148
DIPR R.O. No. : 9869-PP/CL/ADVT/1/2025-26, Date: 28-10-2025




# జనరల్
STATE & REGIONAL NEWS

## వచ్చే 15న లోక్‌అదాలత్

ప్రజాపక్షం/హైదరాబాద్ : లోకా అదాలత్లో కేసులను రాజీ చేసుకునేందుకు వీలుగా పోలీసులు కూడా తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్యామ్కోషి కోరారు హైకోర్టు ఆవరణలోని అథారిటీ ఆఫీసులో మంగళవారం ఆయన పోలీస్ ఉన్నతాధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. చీఫ్ జస్టిస్ ఏకే సింగ్ సూచనల మేరకు నవంబర్ 15న ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. క్రిమినల్ కాంపౌండబుల్ కేసులు అంటే జరిమానా విధింపుతో పరిష్కారమయ్యే కేసులను అధిక సంఖ్యలో పరిష్కరించేందుకు పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. దీని వల్ల కోర్టులపై కేసుల భారం తగ్గుతుందన్నారు. ఈ మేరకు సహకారం అందిస్తామని, పోలీసులకు తగిన ఆదేశాలిస్తామని డీజీపీ బీ శివధర్రెడ్డి చెప్పారు ఈ సమావేశంలో పోలీస్ ఉన్నతాధికారులు మహేశ్ భగవత్, చారు సిన్హా, అథారిటీ మెంబర్ సెక్రటరీ పంచాక్షరి, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనర్లు ఇతరులు హాజరయ్యారు.

## ప్రభుత్వ పాఠశాల అటెండర్ అరెస్ట్

ప్రజాపక్షం/కరీంనగర్:కరీంనగర్ జిల్లాలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో ఆఫీస్ సబార్డినేట్/అటెండర్గా పనిచేస్తున్న మహ్మద్ యాకూబ్ పాషా(30)ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు కరీంనగర్ రూరల్ ఎసిపి విజయ్‌కుమార్ వెల్లడించారు. గంగాధర మండలంలో కొన్ని రోజులు పాఠశాలలో చదువుతున్న మైనర్ విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తూ వేధింపులకు గురిచేస్తున్నాడని, పాఠశాల వేడుకల్లో విద్యార్థినులతో ఫోటోలు దిగగా వాటిని మార్ఫింగ్ చేసి బెదిరించి పోస్ట్ చేశాడని ఫిర్యాదులు అందాయి. ఈ మేరకు జిల్లా చైల్డ్ అండ్ మహిళా వెల్ఫేర్ అధికారి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు, మండల విద్యాధికారి, ఎంపిడిఓలు పాఠశాలను సందర్శించారని తెలిపారు. ఈ సంధర్బంగా బాధిత విద్యార్థినుల నుంచి సమగ్ర వివరాలు సేకరించారు. ఫిర్యాదులో పేర్కొన్న అభియోగాలు నిజమేనని అధికారుల కమిటీ విచారణలో తేలింది. కాగా సోమవారం సాయంత్రం పా ఠశాల ప్రధానోపాధ్యాయురాలు గంగాధర పోలీస్ స్టే షన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై బిఎన్ఎస్, పో క్సో, ఐటి చట్టాల్లోని కఠినమైన సెక్షన్లలో కేసు నమోదు చేయ డం జరిగిందని తెలిపారు. కరీంనగర్ రూరల్ ఎసిపి జి.విజయ్‌కుమార్ ఈ కేసు దర్యాప్తు చేపట్టారు. మైనర్లపై దాష్టీకానికి పాల్పడిన కేసు కావడంతో ఎసిపి వేగవంతంగా విచారణ చేపట్టారని తెలిపారు. పాఠశాలలో చదువుతున్న కొందరు విద్యార్థినులపై లైంగిక దాడి చేసినట్లు ఎసిపి విజయ్ కుమార్ విచారణలో నిర్ధారణ అయ్యింద ని, దీంతో నిందితుడిని పట్టుకోవాలని గంగాధర్ ఎస్ఐ, సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఉదయం నిందితుడు మహ్మద్ యాకూబ్ పాషాను కరీంనగర్‌లోని రేకుర్తి చౌరస్తా వద్ద అదుపులోకి తీసుకోవడం జరిగిందని తెలిపారు. నిందితుడిని వైద్య పరీక్షల అనంతరం కోర్టులో హాజరుపర్చగా జ్యుడీషియల్ రిమాండ్ వి ధించడం జరిగిందని పేర్కొన్నారు.

**ప్రధానోపాధ్యాయురాలు సస్పెన్షన్**

ఆఫీస్ సబార్డినేట్ ఎండి.యాకూబ్ పాషా బాలికల పై లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటనలో ఉన్నతాధికారులకు నివేదించడం, వాస్తవాలు దాచడం, నిర్లక్ష్యం కారణంగా పాఠశాల గ్రేడ్2 గెజిటెడ్ ప్ర ధానోపాధ్యాయురాలు టి.కమలను విధుల నుంచి సస్పె ండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఉత్తర్వులు జారీ చేశారు.

## అణ్వస్త్ర తయారీ ప్లుటోనియం ఒప్పందం రద్దుచేసిన పుతిన్

మాస్కో: ప్లుటోనియంను అణ్వస్త్రాల తయారీకి కాకుండా ఇంథన అవసరాలకు ఉపయోగించుకునే విధంగా పాతికేళ్ళక్రితం అమెరికా–రష్యా మధ్య కుదిరిన ఒక ఒప్పందాన్ని పుతిన్ రద్దుచేశారు. ఈ మేరకు ఒక ఉత్తర్వుపై ఆయన సోమవారం సంతకాలు చేశారు. ఐతే రష్యా–అమెరికా మధ్య సంబంధాలు దెబ్బతినడంతో ఈ ఒప్పందం విలువ కోల్పోయి ఇప్పటికే మూలపడింది. కానీ ఉక్రేన్‌లో యుద్ధం నియంత్రించేందుకు జరుగుతున్న ప్రయత్నాల్లో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ రష్యన్ అధ్యక్షుడు పుతిన్‌ను కించపరచేవిధంగా ఇటీవల ప్రకటనలు చేయడంతో ఈ ప్లుటోనియం ఒప్పందాన్ని రద్దు చేశారు. ఈ ఉత్తర్వు ప్రకారం ఇక రష్యా తన దగ్గర భారీ ఎత్తున నిల్వ ఉన్న ప్లుటోనియంను అణ్వస్త్రాలు తయారు చేసుకోవడానికి యథేచ్ఛగా ఉపయోగించుకునే అవకాశం ఉంటుందని ట్రంప్‌కు పుతిన్ పరోక్ష హెచ్చరిక చేశారు.

హంగేరీ రాజధాని బుడాపెస్ట్‌లో పుతిన్‌తో జరుప తలపెట్టిన రెండో విడత శిఖరాగ్ర సమావేశాన్ని ట్రంప్ ఇటీవల రద్దు చేసుకున్నారు. ఉక్రేన్‌లో శాంతి సాధనకు పుతిన్‌తో చర్చలను ఒక "టైమ్ వేస్ట్" ప్రక్రియగా ఆయన కొట్టిపారేశారు. రష్యాపై భారీ ఎత్తున కొత్త ఆంక్షలు విధించారు. ముఖ్యంగా రష్యాకు చెందిన లుక్ ఆయిల్ సహా రెండు పెద్ద పెద్ద చమురు కంపెనీలపై ఆంక్షలు పెట్టారు. ఇక యూరోపియన్ యూనియన్ కౌన్సిల్ కూడా రష్యాపై 19వ విడత ఆంక్షలను అమలు చేస్తూ తీర్మానం చేసింది. దీంతో లుక్ ఆయిల్ సంస్థ ఇప్పటికే విదేశాలలో ఉన్న తన ఆస్తులను రాబోయే పాతిక రోజుల్లో విక్రయించేందుకు సన్నాహాలు ప్రారంభించింది. ఈ సంస్థకు 11 దేశాలలో ఉన్న గ్యాస్, చమురు సంస్థలలో ఆర్థికపరమైన వాటాలున్నాయి. రష్యాతో సంప్రదింపుల ద్వారా ఉక్రేన్‌లో శాంతి సాధన ప్రయత్నాలకు బదులుగా ఆంక్షలు విధించి, అన్ని వైపుల నుండీ ఆర్థికంగా దెబ్బతీసేందుకు ట్రంప్ ప్రయత్నాలు చేస్తున్నారు. భారతదేశాన్ని కూడా రష్యా నుండి చమురు కొనుగోలు చేయకుండా 50 శాతం సుంకాలు విధించి బెదిరింపులు చేయడంతో మోదీ ప్రభుత్వం కూడా ఆలోచనలో పడింది.

సోవియట్ యూనియన్ అంతర్ధానమైన తర్వాత 1991లో ఉక్రేన్ స్వాతంత్ర్యం పొందింది. ఉక్రేన్‌లో ఉన్న భూభాగాలతో చారిత్రకంగా, భౌగోళికంగా, సాంస్కృతికంగా రష్యన్ ప్రజలకు ఆ ప్రాంత ప్రజలకు మధ్య ఎంతో గొప్ప మానసిక అనుబంధం ఉంది. కానీ ఉక్రేన్‌కు ఇయులో సభ్యత్వం ఇచ్చి ఒక పావులా ఉపయోగించుకుని, నాటో కూటమిని రష్యా వైపు విస్తరించేందుకు యూరోపియన్ యూనియన్ కుట్రలు చేయడంతో పుతిన్ అప్రమత్తమయ్యారు. తన భూభాగాల సంరక్షణ చర్యలు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో గడచిన 11 సంవత్సరాలుగా తిరిగి నాటో సామ్రాజ్యవాదానికీ, రష్యాకు మధ్య ఉద్రిక్తతలు పెరిగాయి. ఇందులో భాగంగా ఉక్రేన్–రష్యా యుద్ధం మొదలైంది.

# తెలంగాణ రైజింగ్ విజన్ 2047

### రాష్ట్ర భవిష్యత్తు రూపకల్పనలో ప్రతి పౌరుడి భాగస్వామ్యం

ప్రజాపక్షం/ హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర భవిష్యత్తు రూపకల్పనలో ప్రతి పౌరుడి స్వరాన్ని ప్రతిబింబించే లక్ష్యంతో తెలంగాణ రైజింగ్ విజన్ 2047 సిటిజన్ సర్వే'ను ప్రారంభించింది. ఈ సర్వే ప్రజల ఆలోచనలు, కలలు, ప్రాధాన్యతలను సేకరించి, రాష్ట్ర దీర్ఘకాలిక అభివృద్ధికి పునాదులు వేయాలన్న సంకల్పంతో రూపొందించబడింది. గత వారం ప్రారంభమైన ఈ సర్వేకు రాష్ట్రవ్యాప్తంగా విశేషమైన స్పందన లభిస్తోంది. వేలాది మంది ఇప్పటికే తమ అభిప్రాయాలు, సూచనలు పంచుకొని, భారత స్వాతంత్ర్యానికి 100 సంవత్సరాలు పూర్తికానున్న 2047 నాటికి తెలంగాణ ఎలా ఉండాలి అన్న దానిపై తమ దృష్టిని తెలియజేశారు. ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం ప్రతి గ్రామం, పట్టణం, నగరంలోని ప్రజల ఆశయాలను ప్రతిబింబించేలా.. ఒక ప్రగతిశీల, సుస్థిర, సమానత్వ తెలంగాణ కోసం సమగ్ర మార్గపటాన్ని రూపొందించడం. సర్వే ద్వారా ప్రజలు విద్య, ఉపాధి, ఆవిష్కరణ, మహిళా సాధికారత, ఆరోగ్యం, పచ్చదనం, జీవన ప్రమాణాలు వంటి కీలక రంగాలపై తమ ఆలోచనలు పంచుకుంటున్నారు. ఇది కేవలం పాలసీ ప్రణాళిక మాత్రమే కాదు..తెలంగాణ భవిష్యత్తును ప్రజలే ఊహించి నిర్మించుకునే ఉద్యమం. ఇప్పటికే పాల్గొన్న ప్రతి ఒక్కరికీ మనస్ఫూర్తిగా ప్రభుత్వం ధన్యవాదాలు తెలిపింది. ఇంకా పాల్గొనని పౌరులు తప్పక తమ ఆలోచనలు, సూచనలు పంచుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం. ఈ సర్వే రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి సులభంగా అందుబాటులో ఉంది. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలు, మెట్రో స్టేషన్లు, విద్యాసంస్థలు, పౌర ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్‌లను స్కాన్ చేసి లేదా www.telangana.gov.in/telanganarising వెబ్‌సైట్‌ను సందర్శించి పాల్గొనవచ్చు. సర్వేలో పాల్గొనడానికి గడువు నవంబర్ 1, 2025 వరకు పొడిగించబడింది. మీ ఆలోచన, మీ స్వరం — తెలంగాణ 2047 దిశను నిర్ణయించగల శక్తి మీ చేతుల్లోనే ఉంది. ఈరోజే పాల్గొని, భవిష్యత్తు తెలంగాణ నిర్మాణంలో మీ ముద్ర వేయండి అని ప్రభుత్వం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేసింది.

## పిడి యాక్ట్ కరెక్టే

ప్రజాపక్షం/హైదరాబాద్ : చట్ట వ్యతిరేకంగా గంజాయి అమ్మకాలు చేయడం, పోలీసులకు పట్టుబడటం, బెయ్యి బయటకు వచ్చాక మళ్లీ అదే నేరం చేసే అరుణాబాయి అలియాస్ అంగూరీబాయిని పీడీ యాక్ట్ కింద పోలీసులు ముందస్తు నిర్బంధంలోకి తీసుకోవడాన్ని హైకోర్టు సమర్థించింది. గంజాయి అమ్మకానికి అలవాటు పడిన ఆమె గంజాయి అమ్మకం వల్ల శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తోందని చెప్పింది. అం గూరీ బాయిపై పీడీ యాక్ట్ అమలు చేయడాన్ని కుమార్తె దాఖలు చేసిన పిటిషన్ను కొట్టివేసింది. ఈ మేరకు జస్టిస్ మౌషుమి భట్టాచార్య, జస్టిస్ గాడి ప్రవీణ్ కుమార్ డివిజన్ బెంచ్ తీర్పు చెప్పింది. అదే పనిగా గంజాయి అమ్మకాలు చేయడం వల్ల పీడీ యాక్ట్ నమోదు చేశారని ప్రభుత్వం చెప్పిం ది. ప్రభుత్వ ఆరోగ్యం, శ్రేయస్సును దెబ్బతీసేలా ఆమె చర్యలున్నాయని చెప్పింది. చట్టపరంగానే పీడీ యాక్ట్ అమలు చేసినందున హెబియస్ కార్పస్ పిటిషన్ చెల్లదని తీర్పులో పేర్కొంది.

### లావాదేవీలను చెప్పకుండా అప్పీల్ చెల్లదు

భూమిపై హక్కులున్నాయంటూ 1967నాటి లావాదేవీల గురించి గోప్యంగా ఉంచి 2020లో సూట్ వేయడం కుదరదని హైకోర్టు తీర్పు చెప్పింది. రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నంలోని సివిల్ కోర్టు తీర్పును రద్దు చేసింది. కింది కోర్టు ఆర్డర్ను సవాల్ చేస్తూ 22 సెంచరీ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అండ్ ప్రాజెక్టు లిమిటెడ్ వేసిన అప్పీల్ను జస్టిస్ అలిశెట్టి లక్ష్మీనారాయణ తీర్పు చెప్పారు. సివిల్ వివాదంపై ఆలస్యంగా అప్పీల్ చేయడం చెల్లదన్నారు.

## ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి: టిఎన్‌జిఒ

ప్రజాపక్షం/హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, పెండింగ్ బిల్లులను యుద్ధప్రాతిపదికన చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న ఐదు కరువు భత్యాలను తక్షణమే విడుదల చేయాలని టిఎన్‌జిఒ అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం.హుస్సేని ముజీబ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. హైదరాబాద్‌లోని టిఎన్‌జిఒ కేంద్ర సంఘం భవన్‌లో మంగళవారం టిఎన్‌జిఒ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మారం జగదీశ్వర్, ఎస్.ఎం. హుస్సేని ముజీబ్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు,పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి మంత్రి వర్గ ఉప సంఘం, అధికారుల కమిటీతో చర్చలు జరిగి, సిఎం, మంత్రులు స్పష్టమైన హామీ ఇచ్చినప్పటికీ, ఉద్యోగుల సమస్యలు పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. ఆరోగ్య రక్షణ పథకాన్ని (ఇహెచ్ఎస్) పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. పిఆర్‌సి నివేదికను వెంటనే తెప్పించుకుని 51శాతం ఫిట్‌మెంట్‌ను అమలు చేయాలని, వివిధ కారణాలతో సస్పెండైన ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, గచ్చిబౌలి స్థలాలను భాగ్యనగర్ టిఎన్‌జిఒలకు కేటాయించాలి కోరారు. స్థానికత ప్రాతిపదికగా అదనపు పోస్టులు సృష్టించి జిఒ 317 బాధితులకు న్యాయం చేయాలని, పదోన్నతుల కమిటీలను సకాలంలో ఏర్పాటు చేసి పదోన్నత్తులను కల్పించాలని, మిగితా పెండింగ్ సమస్యలనింటినీ వెంటనే పరిష్కరించాలని వారు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో టిఎన్‌జిఒ కేంద్ర సంఘం అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకట్, కోశాధికారి; ముత్యాల సత్యనారాయణ గౌడ్,ఉపాధ్యక్షులు చేపూరి నరసింహ చారి, సి.ఎస్. నరసింహారెడ్డి, వెల్లంకి మాధవి, ఉమా రెడ్డి , నజీర్ అహ్మద్, కొండల్ రెడ్డితో పాటు అన్ని జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు, కేంద్ర సంఘ కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు.

## గిరిజన విద్యార్థులు అంతర్జాతీయ క్రీడల్లో రాణించాలి

### మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్

ప్రజాపక్షం/హైదరాబాద్: గిరిజన కెనో స్ప్రింట్ నేషనల్ ఛాంపియన్‌షిప్ క్రీడలను విజయవంతంగా నిర్వహించనున్నట్లు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ అన్నారు. హుస్సేన్ సాగర్ బోట్స్ క్లబ్ ( సైయిలింగ్ అనెక్ట్) వద్ద మంగళవారం గిరిజన కెనో స్ప్రింట్ నేషనల్ ఛాంపియన్షిప్ క్రీడను ట్రైకార్డ్ చైర్మన్ బెల్లయ్య నాయక్, ఖానాపూర్ శాసనసభ్యులు వెద్మ బొజ్జు, స్పెషల్ చీఫ్ సెక్రటరీ సబ్య సాచి ఘోష్, గురుకులాల సెక్రటరీ సీతాలక్ష్మి, జిల్లా కలెక్టర్ హరిచందన దాసరిలతో కలసి మంత్రి ప్రారంభించి క్రీడాలను తిలకించారు. ఈ సందర్భంగా గిరిజన సంక్షేమ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో ఈ క్రీడకు ఎంతో ప్రాధాన్యత ఉన్నదని అలాగే తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ మహానగరంలో ఈ క్రీడలు నిర్వహించటం పది రాష్ట్రాల పిల్లలు ఈ క్రీడలలో పాల్గొనటం ఎంతో సంతోషాన్ని ఇస్తుందని మంత్రి తెలిపారు. గిరిజన యువత సాధికారతకు, వారి సాంప్రదాయ క్రీడా వారసత్వ పరిరక్షణకు రాష్ట్రం కట్టుబడి ఉన్నదని, భగవాన్ బిర్సా ముండా ఆత్మస్ఫూర్తితో, గిరిజన సమాజం యొక్క ధైర్యం, ఐక్యత, సాంస్కృతిక ఔన్నత్యమును ప్రతిబింబించే వేదికగా ఈ క్రీడా ఉత్సవం నిలుస్తుందని అన్నారు. ఈ తరహా క్రీడల ద్వారా గిరిజన ప్రాంతాల నుండి క్రీడా ప్రతిభను వెలికితీసి, వారికి జాతీయ స్థాయిలో ప్రోత్సాహం అందిస్తూ నీటి క్రీడల కేంద్రముగా అభివృద్ధి చేయడమే లక్ష్యమని అన్నారు. గిరిజన కెనో స్ప్రింట్ నేషనల్ ఛాంపియన్‌షిప్ – 2025 ను గిరిజన సాంస్కృతిక పరిశోధన శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో గిరిజన సంక్షేమ శాఖ పర్యవేక్షణలో తేదీ 28 నుండి 30 వరకు మూడు రోజుల పాటు హైదరాబాద్ లోని హుస్సేన్ సాగర్ లో నిర్వహించనున్నామని మంత్రి తెలిపారు.ఈ జాతీయ స్థాయి క్రీడా మహోత్సవం భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి పురస్కరించుకొని జన జాతీయ గౌరవ వర్ష్ (JJGV) లో భాగంగా, భారత ప్రభుత్వ గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ మార్గదర్శకత్వంలో చేపట్టడం జరిగిందని మంత్రి పేర్కొన్నారు. ట్రై కార్ చైర్మన్ బెల్లయ్య నాయక్ మాట్లాడుతూ గిరిజన విద్యార్థులకు క్రీడల్లో ప్రత్యేక తర్ఫీద్ అందించి వారు ఎంచుకున్న క్రీడల్లో రాణించే విధంగా కోచ్ లు ప్రత్యేక కృషి చేయాలని అన్నారు.

## భూములు లేని పేదలకు త్వరలోనే 'ఇందిరమ్మ ఇండ్ల' పాలసీ

### ఇండ్ల నిర్మాణానికి ఎస్‌హెచ్‌జి ద్వారా రుణాలు..

### ఇప్పటి వరకు లబ్ధిదారుల ఖాతాల్లో రూ.2526 కోట్లు జమ ...

### జన్‌దన్,చిన్న పొందుపు బ్యాంక్‌ఖాతాలు అప్‌డేట్‌చేసుకోండి..

### గృహ నిర్మాణ సంస్థ ఎండి వి.పి.గౌతం



ప్రజాపక్షం/హైదరాబాద్:'ఇందిరమ్మ ఇండ్లు'లబ్ధిదారుల్లో అత్యంత పేదలకు స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జి) ద్వారా రుణ సౌకర్యాన్ని కల్పించామని తెలంగాణ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఎం.డి వి.పి గౌతం వెల్లడించారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందే వరకు , అత్యంత పేదలకు ఈ అవకాశం ఎంతో దోహదపడుతుందన్నారు. జన్‌దన్,చిన్న పొదుపు బ్యాంక్ ఖాతాలకు కేవలం రూ.50వేల పరిమితి మాత్రమే ఉన్నందున, వారికి 'ఇందిరమ్మ' బిల్లులను చెల్లించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్పష్టం చేశారు. ఈ బ్యాంక్ ఖాతాలను అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. భూమి లేని వారికి ఇందిరమ్మ ఇండ్ల విషయంలో ప్రభుత్వం త్వరలోనే కొత్త పాలసీ ప్రకటిస్తుందన్నారు. హైదరాబాద్‌లోని గృహ నిర్మాణ సంస్థ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వి.పి గౌతం మాట్లాడుతూ 'ఇందిరమ్మ ఇండ్లకు, మినరల్ డిపార్ట్‌మెంట్ ఇసుక'యాప్‌ను అనుసంధానం చేస్తామని, తద్వారా ఇందిరమ్మ పేరుతో ఇసుక దుర్వినియోగం అయ్యే అవకాశాలు లేవన్నారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరైనప్పటికీ వివిధ కారణాలతో లబ్ధిదారులు వదులుకునేందుకు సిద్ధపడితే , ఆ లబ్ధిదారుల తిరస్కరణను వెంటనే ఆమోదించవద్దని, బలమైన కారణాలు ఉంటేనే తిరస్కరించాలని అధికారులను ఆదేశించారు. డబ్బులు లేఇన అత్యంత పేద వర్గాల విషయంలో ఎస్‌హెచ్‌జి ద్వారా రుణాలు అందేలా చూడాలని సూచించారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 21,993 మంది లబ్ధిదారులకు ఎస్‌హెచ్‌జి ద్వారా రూ.230 కోట్ల రుణాలను ఇప్పించామన్నారు. ఇందిరమ్మ స్కీమును పిఎంఎవై,ఎన్ఆర్ఇజిఎ,స్వచ్ఛభారత్ మిషన్‌తో అనుసంధానం చేస్తున్నామని, ఇందులో పిఎంఎవై త్వరలోనే అనుసంధానం కానుందని వివరించారు. తక్కువ భూమి ఉన్న వారికి కోసం రాష్ట్ర వ్యాప్తంగా జి ప్లస్ వన్ పద్ధతిలో ( కింద రెండు వందలు, మొదటి అంస్తులో మరో రెండు వందల ఎస్ఎఫ్‌టి) ఇందిరమ్మ ఇండ్లకు అనుమతినిస్తున్నామని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 2.25 లక్షల ఇందిరమ్మ ఇండ్లు వివిధ దశలలో ఉన్నాయని, వాటికి ఇప్పటి వరకు రూ.2526 కోట్లను లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలలో జమ చేశామన్నారు.ఇందిరమ్మ ఇండ్లు అమలు కాని గ్రామ పంచాయతీలు లేవని గౌతం అన్నారు.

**'డబుల్ బెడ్ రూముల'కు మౌలిక సదుపాయాల కల్పన**

హైదరాబాద్‌లోని రెండు పడకల గదులలో మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని, వాటిని కూడా త్వరితగతిన లబ్ధిదారులకు అందించేందుకుచర్యలు తీసుకుంటున్నామని వి.పి.గౌతం తెలిపారు. గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూముల ప్రాంతాల్లో రవాణ , పాఠశాల సౌకర్యం లేకపోవడంతో కొందరు లబ్ధిదారులు అక్కడికి వెళ్లడం లేదని, ఇలాంటి వారి విషయంలో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని, వారికి రవాణతో పాటు పాఠశాల సౌకర్యాన్నికల్పించాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు గౌతం వివరించారు.

## 'హైడ్రా' తవ్వితీసిన బమ్మృకున్నద్దౌలా చెరువు

### పాతబస్తీలో చారిత్రక చెరువు పునరుద్ధరణ

### నవంబరు నాటికి పూర్తి చేయాలి: హైడ్రా కమిషనర్



ప్రజాపక్షం/హైదరాబాద్ : పాతబస్తీలో చారిత్రాత్మక బమ్మృకున్నద్దౌలా చెరువు సర్వాంగ సుందరంగా సిద్ధమౌతోంది. నవంబరు నెలాఖరు నాటికి ఈ చెరువును పూర్తి స్థాయిలో పునరుద్ధరించాలనే లక్ష్యంతో హైడ్రా పని చేస్తోంది. ఈ క్రమంలో హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ మంగళవారం బమ్మృకున్నద్దౌలా చెరువు పునరుద్ధరణ పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వందల ఏళ్ల చరిత్ర ఉన్న ఈ చెరువును జాతి సంపదగా భావితరాలకు అందించాల్సిన అవసరాన్ని హైడ్రా కమిషనర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆ క్రమంలోనే చెరువు ఆక్రమణలను గత ఏడాది ఆగస్టు నెలలో తొలగించినట్టు చెప్పారు. 18 ఎకరాలకు పైగా ఉన్న ఈ చెరువు కేవలం 4.12 ఎకరాలకు పరిమితమైపోగా, ఆక్రమణలను తొలగించి పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. ఇప్పుడు చెరువును 18 ఎకరాల మేర విస్తరించి, వరద కట్టడితో పాటు భూగర్భ జలాలు సమృద్ధిగా ఉండేలా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. చెరువులోకి వరద నీరు చేరేలా, నిండితే పోయేలా నిర్మించిన ఇన్‌లెట్‌లు, ఔట్‌లెట్‌లను హైడ్రా కమిషనర్ పరిశీలించారు. చెరువు చుట్టూ బండ్ నిర్మించి వాకింగ్ ట్రాక్‌లు నిర్మిస్తున్నారు. చెరువు కట్ట చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. చెరువు లోపలి వైపు కూడా ఎవరూ లోపలికి వెళ్లకుండా గట్టి ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నారు. పిల్లలు ఆడుకునేందుకు ఇరువైపులా ఆట స్థలాలను తీర్చిదిద్దారు. వృద్ధులు సేద దీరే విధంగా అక్కడ సీటింగ్ ఏర్పాటు చేయడంతో పాటు పార్కులు నిర్మిస్తున్నారు. ఓపెన్ జిమ్‌లు, చెరువు చుట్టూ రహదారులు, గ్రీనరీని పెంచే విధంగా మొక్కలు నాటుతున్నారు. నాటి చారిత్రక ఆనవాళ్లను పరిరక్షిస్తూనే నగిషీలు చెక్కుతున్నారు. నిజాంల కాలంలో రాతితో నిర్మించిన బండ్‌ను చెక్కు చెదరకుండా కాపాడుతూ మరింత పటిష్టం చేస్తున్నారు. చెరువులో కూడా మట్టిలో కలిసిపోయిన నాటి రాళ్లను బయటకు తీసి భద్రపరుస్తున్నారు. ఔట్‌లెట్‌కు మళ్లీ గేట్లు బిగిస్తున్నారు. స్థానిక నివాసితులు అక్కడకు వచ్చి సేదదీరేవిధంగా రూపొందించడమే కాకుండా నిఘాను పట్టిష్టం చేసేందుకు సిసిటివి కెమేరాలను ఏర్పాటు చేశారు.

**చరిత్ర ఎంతో ఘనం.. :** చార్ సౌ షహర్ హమారా 435 ఏళ్లకు పైబడిన చరిత్ర ఈ నగరానిది. అడుగడుగునా చారిత్రక ఆనవాళ్లు, ఎన్నో విశేషాలు నగర సొంతం. అలాంటి కోవలోకే వస్తుంది. 1770లో హైదరాబాద్ మూడవ నిజాం సికందర్ జాకు ప్రధానమంత్రిగా ఉన్న నవాబ్ రుక్నుఉద్‌దౌలా నిర్మించిన బమ్మృకున్నద్దౌలా చెరువు. ఈ చెరువుకు సంబంధించిన సమాచారం స్థానికంగా ఉన్న వృద్ధులు పలు విధాలుగా వివరిస్తున్నారు. చారిత్ర ఆనవాళ్ల ప్రకారం వంద ఎకరాలకు పైగా ఈ చెరువు విస్తరించి ఉండేదని, రాజేంద్రనగర్, ఆరాంఘర్, కాటేదాన్ ప్రాంతాల నుంచి వచ్చే వరద ఈ చెరువుకు చేరేదని చెబుతున్నారు. నిజాంల కాలంలో మీరాలం ట్యాంక్‌ను రాజులు, బమ్మృకున్నద్దౌలా చెరువును రాణులు స్నానాలకు వినియోగించేవారని చెబుతున్నారు. బమ్మృకున్నద్దౌలా చెరువులో వనమూలికల చెట్లు, కొమ్మలు వేసి, ఆ దిగువున నిర్మించిన బావిలోకి వచ్చిన ఊట నీటిని తాగేందుకు వినియోగించేవారని మరి కొంతమంది వివరిస్తున్నారు. ఔషధగుణాలున్న ఈ నీటిని మాత్రమే నిజాంలు వినియోగించేవారంటున్నారు. అంతే కాదు ఈ చెరువు చుట్టు సువాసనలు వెదజల్లే పూల మొక్కలు విరివిగా ఉండేవని, ఆ పూలన్ని చెరువులో పడడంతో ఇక్కడి నీటిని సెంటు తయారీకి వినియోగించేవారన్నారు. ఇందుకోసం అరబ్ దేశాలకు ఇక్కడి నీరు తీసుకెళ్లేవారంటున్నారు. ఇలా ఎంతో చారిత్రక నైపథ్యం ఉన్న ఈ చెరువు మళ్లీ పునరుద్ధరణకు నోచుకోవడం చాలా ఆనందంగా ఉందని పలువురు స్థానికులు సంబర పడుతున్నారు.

## ఎన్నికల్లో ప్రిసైడింగ్ అధికారుల పాత్ర కీలకం

### జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి. కర్ణన్



ప్రజాపక్షం/హైదరాబాద్ : ఎన్నికలలో ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులది కీలకపాత్ర అని, తమ విధులు, బాధ్యతలపై పూర్తి అవగాహన పెంచుకుని ఉప ఎన్నిక పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ అన్నారు. షేక్‌పేట జి. నారాయణమ్మ ఇంజనీరింగ్ కళాశాలలో జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక నేపథ్యంలో మంగళవారం ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు రెండో విడత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ రోజు రెండు విడతలుగా జరిగిన ఈ శిక్షణ కార్యక్రమంకు 500 మందికి అధికారులు హాజరయ్యారు. శిక్షణ కార్యక్రమంకు హాజరైన ఎన్నికల పోలీస్ పరిశీలకులు ఓం ప్రకాశ్ త్రిపాఠి, వ్యయ పరిశీలకులు సంజీవ్ కుమార్ లాల్‌లు శిక్షణ జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అధికారి కర్ణన్, పిఒ, ఎపిఓలకు ఎన్నికల పోలింగ్ రోజు వారి విధులు, బాధ్యతలపై జిహెచ్ఎంసి ఎన్నికల విభాగం అదనపు కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌తో కలిసి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కర్ణన్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో పోలింగ్ రోజు ముఖ్యమైందని, పోలింగ్ దృష్ట్యా చేయాల్సిన అన్ని అంశాలపై ఎన్నికల సంఘం రూపొందించిన హ్యాండ్‌బుక్‌ను ప్రతి పిఓ, ఎపిఓ తప్పకుండా చదవడమే కాకుండా, అందులోని అన్ని నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని సూచించారు.

**ఎన్నికల విధులను సీరియస్‌గా తీసుకోవాలి..**

శిక్షణ పొందిన నాటి నుంచి పోలింగ్ ముగిసేంత వరకు తీసుకోవా ల్సిన జాగ్రత్తల పట్ల పిఓ, ఎపిఓగా విధులు నిర్వహించే వారికి అన్ని అంశాల పట్ల పూర్తి అవగాహన ఉండాలన్నారు. సందేహాలు ఉంటే శిక్షణ కార్యక్రమంలో నివృత్తి చేసుకోవాలన్నారు. పోలింగ్ ముందు రోజు చేయాల్సిన పనులను చెక్‌లిస్టు తయారు చేసుకొని విధులు నిర్వహించాలన్నారు. ప్రతి పోలింగ్ ఆఫీసర్ తీసుకోవాల్సిన మెటీరియల్,ఈవిఎంల నిర్వహణ, ఓటరు జాబితా మార్క్‌డ్ కాపి, పిఓ, ఎపిఓ రోజువారి విధులు, పోలింగ్ కేంద్రం బయట ప్రదర్శించాల్సిన సామాగ్రి, పోలింగ్ కేంద్రంలోకి అనుమతించే వారు, మాక్ పోల్, ఈవిఎం, వివిప్యాట్‌లను ఎలా అనుసంధానం చేయాలి వంటి అన్ని విషయాలు ఒకటికి రెండుసార్లు చదివి పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. పోలింగ్ రోజు ఏమైనా సమస్యలు ఉత్పన్నమైతే ఉన్నతాధికారుల దృష్టి తీసుకెళ్లాలన్నారు.

**ఈసిఐ మార్గదర్శకాల మేరకు ఎన్నిక పోలింగ్ జరిగేలా చూడాలి..**

ఎన్నికల పోలీస్ పరిశీలకులు ఓం ప్రకాశ్ త్రిపాఠి, వ్యయ పరిశీలకులు సంజీవ్ కుమార్ లాల్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను నిక్కచ్చిగా పాటిస్తూ ఎన్నిక పోలింగ్ సజావుగా జరిగేలా ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు పని చేయాలన్నారు. కార్యక్రమంలో శిక్షణ కార్యక్రమాల బాధ్యులు సునంద, మమత పాల్గొన్నారు.


దక్షిణ మధ్య రైల్వే
Follow us on X @SCRailwayindia
దక్షిణమధ్య రైల్వే టెండరు నోటీసుల వివరాలను మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.inలో చూడగలరు.

టెండరు నోటీసు నెంబరు:జి/ఇ.29/టిఆర్/టెండరు నోటీసు/28/2025/26, తేదీ. 27.10.2025 PUB/1353

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీరు /ట్రాక్షన్/గుంతకల్ భారత రాష్ట్రపతి తరపున విధినిర్వహణలో భాగంగా ఈ క్రింద పేర్కొన్న పనులకు ఇ–టెండర్లకు ఆహ్వానం.

**టెండరు నెం.** జిటిఎల్–టిఆర్‌డి–29–ఇటిఎన్–56–2025–26, **పని పేరు:** జిటిఎల్ డివిజన్ –ఓహెచ్ఇ/ పిఎస్ఐ మౌలిక సదుపాయాల విశ్వసనీయత మెరుగుదల జిటిఎల్–డబ్ల్యుడి & జిటిఎల్–బే సెక్షన్స్ బ్రాంచ్‌లైన్స్ కలిపి–160 చదరపు మి.మీ జి–జంపర్ ప్రొవిజన్, **సుమారు విలువ :** రూ.88,61,820.00, **ఇఎండి :** రూ.1,77,200.00

**టెండరు ముగింపు తేదీ మరియు సమయం : 18.11.2025 మధ్యాహ్నం 3.00 గంటల వరకూ.**

**గమనిక:** 1. టెండరు పత్రాన్ని **www.ireps.gov.in** ద్వారా టెండర్లర్లు ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చును.

టెండరు వేలంపాట కోసం మరియు ఇతర వివరాలకోసం **https://www.ireps.gov.in.** లో లాగిన్ కాగలరు. తప్పు ఒప్పులు, ఇతర వివరాలు అన్నీ ఆన్‌లైన్ ద్వారానే జారీ చేయబడును.

**సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీరు, ట్రాక్షన్, గుంతకల్**

టెండరు నోటీసు నెంబరు: జి/ఇ.29/టిఆర్/ టెండరు నోటీసు /29/2025/26, తేదీ. 28.10.2025 PUB/1354

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీరు/ ట్రాక్షన్/గుంతకల్ భారత రాష్ట్రపతి తరపున విధినిర్వహణలో భాగంగా ఈ క్రింద పేర్కొన్న పనులకు ఇ–టెండర్లకు ఆహ్వానం.

**టెండరు నెం.** జిటిఎల్–టిఆర్‌డి–29–ఇటిఎన్–57–2025–26, **పని పేరు:** జిటిఎల్ డివిజన్ – ఓహెచ్ఇ /పిఎస్ఐ మౌలిక సదుపాయాల విశ్వసనీయత మెరుగుదల జిటిఎల్–డబ్ల్యుడి & జిటిఎల్–బే సెక్షన్స్ బ్రాంచ్‌లైన్స్ కలిపి–7 మి.మీ ఆర్‌టి డ్రాపర్ మరియు ఫీడర్ స్ట్రెయిన్ జాయింట్ తొలగింపు ప్రొవిజన్, **సుమారు విలువ :** రూ.83,28,587.00, ఇఎండి : రూ.1,66,600.00

**టెండరు ముగింపు తేదీ మరియు సమయం : 19.11.2025 మధ్యాహ్నం 3.00 గంటల వరకూ.**

**గమనిక:** 1. టెండరు పత్రాన్ని **www.ireps.gov.in** ద్వారా టెండర్లర్లు ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చును.

టెండరు వేలంపాట కోసం మరియు ఇతర వివరాలకోసం **https://www.ireps.gov.in.**లో లాగిన్ కాగలరు. తప్పు ఒప్పులు, ఇతర వివరాలు అన్నీ ఆన్‌లైన్ ద్వారానే జారీ చేయబడును.

**సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీరు, ట్రాక్షన్, గుంతకల్**

టెండరు నోటీసు నెంబరు: 16–ఎఇసిహెచ్–చిబి–పియు–టిపిటివై–25–26, తేదీ. 25.10.2025 PUB/1355

డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీరు/ కమీషనర్ ఆఫ్ రైల్వే సేఫ్టీ/తిరుపతి భారత రాష్ట్రపతి తరపున విధుల నిర్వహణలో భాగంగా ఇ–టెండర్లకు ఆహ్వానం. టెండరు నెం.: ఇక్కడ దిగువన పేర్కొన్న ముగింపు తేదీ కింద పేర్కొన్న విధంగా ఉదయం 11.00 గంటల వరకూ. వేలంపాటలో పాల్గొనేవారు తమ ఒరిజినల్‌ను/సవరించిన బిడ్లను ముగింపు తేదీ వరకూ మరియు సమయం వరకూ మాత్రమే సమర్పించగలరు. ఈ టెండరుకు వ్యతిరేకంగా వ్యక్తులు స్వయంగా వచ్చి ఇచ్చే టెండర్లు స్వీకరించబడవు. అలాంటి ఏవైనా టెండర్లు స్వయంగా వచ్చి ఇచ్చినట్లయితే అలాంటివన్నీ బుట్టదాఖలు చేయబడును.

**క్రమ సంఖ్య.** 1, **పని వివరం:** 16–చెల్లోర్ కంటోన్మెంట్–పుదుచ్చేరి–తిరుపతి–25–26, తేదీ. 25.10.2025 "సరఫరా మరియు వందేభారత్ బోగీలకు పాలియురేతేన్ పెయింటింగ్ వేయవలెను. **సుమారు విలువ : (రూపాయిలలో)** : 44,94,608.00, **బిడ్ సెక్యూరిటీ (రూపాయిలలో):** 89,900.00, **పూర్తి చేయాల్సిన గడువు సమయం :** 06 నెలలు, **ముగింపు తేదీ:** 17.11.2025 @ 11.00 గంటలు.


**వెబ్‌సైటు వివరాలు:** www.ireps.gov.in, **టెండరుకు సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకోవడానికి నోటీసు బోర్డు ఉండే ప్రదేశం:** ప్రధాన వర్క్‌షాపు మేనేజర్‌వారి కార్యాలయం, క్యారేజీ రిపేర్ షాప్, తిరుపతి

తదుపరి టెండరు షరతులు/వివరాలు (టెండరు పత్రాలలో లభ్యం అవుతాయి) మరియు టెండరు పత్రాల డౌన్‌లోడ్ కోసం, తప్పు ఒప్పులు, దిద్దుబాట్లకోసం దయచేసి మా వెబ్‌సైటు **https://www.ireps.gov.in** ను సందర్శించగలరు.

**ఉప ప్రధాన మెకానికల్ ఇంజనీరు, క్యారేజీ రిపేర్ షాపు, తిరుపతి**

A1710

మరిన్ని టెండర్ షరతులు / వివరాల కోసం మరియు టెండర్ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవడానికి, దయచేసి http://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించండి.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## సిద్ధరామయ్య సిఎం పదవీకాలానికి.. కాలపరిమితిలేదు

**బెంగళూరు:** కర్ణాటక రాష్ట్ర ముఖ్యమంత్రి పదవి కోసం కాంగ్రెస్ పార్టీ నేతల్లో పోటీ నానాటికీ తీవ్రతరం అవుతోంది.ఈ నేపథ్యంలో కర్ణాటక హోంమంత్రి జి.పరమేశ్వర ఈ విషయమై స్పందించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రి కావడానికి సిద్ధరామయ్య కాంగ్రెస్ శాసనసభా పక్ష నాయకుడిగా (సిఎల్‌పి) ఎన్నికైనప్పుడు , ఆయన పదవీకాలానికి ఎటువంటి కాలపరిమితిని నిర్దేశించలేదని హోం మంత్రి జి.పరమేశ్వర స్పష్టం చేశారు.అయితే పార్టీ అధిష్ఠానం ఏది నిర్ణయించినా దానికి పార్టీలోని ప్రతీ ఒక్కరూ కట్టుబడి ఉంటారని, ఈ అంశంపై ఉన్న గందరగోళానికి ముగింపు పలకాలని ఆయన కాంగ్రెస్ నాయకులకు విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చే నెలలో తన ఐదేళ్ల పదవీకాలంలో సగం పూర్తి చేసుకున్నప్పుడు ముఖ్యమంత్రి పదవిలో ఈ నేపథ్యంలో కొందరు దీనిని 'నవంబరు విప్లవం' అని వ్యాఖ్యానిస్తున్నారు. సోవారం నాడు ఇక్కడ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి హెచ్.సి. మహదేవప్పను ఆయన నివాసంలో అధికార కాంగ్రెస్ పార్టీలో ఇద్దరు కూడా పేరొందిన దళిత నాయకులే.

## బిహార్‌లో శాంతిభద్రతలు పూర్తిగా కుప్పకూలాయ్

ఎన్‌డిఎ ప్రభుత్వానికి కనీస ఆందోళన లేదు

ఆర్‌జెడి నేత తేజస్వీ యాదవ్ విమర్శ



**సరాన్ :** బిహార్‌లో శాంతిభద్రతలు పూర్తిగా కుప్పకూలిపోయాయని ఆర్‌జెడి నేత తేజస్వీ యాదవ్ విమర్శించారు. ఈ పరిస్థితిపై రాష్ట్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వానికి కనీస ఆందోళన కూడా లేదని ఆరోపించారు. మంగళవారం ఆయన సరన్‌లో ఎన్నికల ర్యాలీలో పాల్గొని ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ప్రజలను మనోవేదనల నుంచి బయటపడేసేందుకు అసెంబ్లీ ఎన్నికల్లో ఇండియా కూటమికి అధికారంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. సరన్ ప్రతిరోజూ హత్య, దోపిడీ, అపహరణ వంటి ఘటనలను చూస్తోందని కానీ, ముఖ్యమంత్రి నితీష్ కుమార్ దాని గురించి కనీసం పట్టించుకోని, బాధితులను ఓదార్చడానికి ఆయన ఎప్పుడూ రారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శాంతిభద్రతలు, ఉద్యోగాలు, ఫిర్యాదుల పరిష్కారాన్ని మెరుగుపరచడానికి ఇండియా కూటమికి ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఒక ప్రభుత్వ ఉద్యోగం ఇస్తానని హామీ ఇచ్చారు. సరన్‌లోని తరైయా అసెంబ్లీ నియోజకవర్గంలో జరిగిన ర్యాలీలో యాదవ్ మాట్లాడుతూ బిహార్ ప్రజలు నిరుద్యోగం, ధరల పెరుగుదలతో విసిగిపోయారని, వారు 'పఢై, దవై, కమై, సిచాయ్' (మెరుగైన విద్య, ఆరోగ్య సౌకర్యాలు, ఉపాధి, నీటిపారుదల సౌకర్యాలు)ను నిర్ధారించే ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారన్నారు. పార్సా అసెంబ్లీ నియోజకవర్గంలో జరిగిన మరో ర్యాలీలో మాట్లాడుతూ బిహార్‌లో ప్రొహిబిషన్ విధానాన్ని తేజస్వీ వ్యతిరేకించారు. బిహార్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ చట్టం బిహార్‌లో పూర్తిగా విఫలమైందని, రాష్ట్రంలో మద్యం ఇంటికే డెలివరీ చేసే వ్యవస్థ ఉందని, ప్రజలు దానిని సులభంగా పొందుతున్నారని ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే, 'కల్లు' (తారి)పై నిషేధాన్ని తొలగిస్తామన్నారు. ఎన్‌డిఎ 20 సంవత్సరాలలో అమలు చేయలేని అభివృద్ధి పనులను, ఇండియా కూటమి అధికారంలోకి వస్తే 20 నెలల్లో చేపడుతుందని యాదవ్ కూడా నొక్కి చెప్పారు. దీనికి తమకు 20 నెలలు మాత్రమే కావాలన్నారు.

# ప్రజాస్వామ్యవాదులు ఏకం కండి

యావత్ దేశం ఎస్‌ఐఆర్‌ను వ్యతిరేకించాలి

ఇది దేశ ప్రజాస్వామ్య పునాదికి తీవ్ర ముప్పు

కేరళ సిఎం పినరయ్ విజయన్ ఉద్ఘాటన



**తిరువనంతపురం :** భారత ఎన్నికల నవంబరు 4వ తేదీ నుంచి నిర్వహించనున్న ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్‌ఐఆర్)ను యావత్ దేశం వ్యతిరేకించాలని కేరళ ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ పిలుపునిచ్చారు. ఇది దేశ ప్రజాస్వామ్య పునాదికి తీవ్ర ముప్పుగా ఆయన అభివర్ణించారు. ఈ క్రమంలో ప్రజాస్వామ్యాన్ని గౌరవించే వారందరూ ఏకం కావాలని సూచించారు. ఇసిఐ ఇప్పుడు బహుళ రాష్ట్రాలకు విస్తరింపజేస్తున్న ఎస్‌ఐఆర్ ప్రక్రియ సార్వత్రిక ఓటు హక్కును అణగదొక్కడానికి, రాజకీయ లాభం కోసం ఓటర్ల జాబితాలను తారుమారు చేయడానికి స్పష్టమైన ప్రయత్నాన్ని సూచిస్తుందని ఆయన హెచ్చరించారు. కేరళ, ఇతర రాష్ట్రాలలో ఎస్ఆర్‌ను అమలు చేయడానికి ఇసిఐ తీసుకున్న చర్య ప్రజాస్వామ్య ప్రక్రియకు తీవ్రమైన సవాల్‌ను విసురుతుందని విజయన్ ఒక ప్రకటనలో ఉద్ఘాటించారు. ఇది పోల్ ప్యానెల్ ఉద్దేశాలపై లోతైన సందేహాలను లేవనెత్తిందని, దేశ ఎన్నికల వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని దెబ్బతీస్తుందని ఆయన అన్నారు. కేంద్ర అధికారులు ఓటర్ల జాబితాను తమ ప్రయోజనాలకు అనుకూలంగా మార్చుకోవడానికి ఎస్ఆర్‌ను ఒక మార్గంగా ఉపయోగిస్తున్నారనే విమర్శను ఏ విధంగానూ తిరస్కరించలేమనిని, ఇది మరింత సందర్భోచితంగా ఉందని విజయన్ అన్నారు. బిహార్ ఎస్‌ఐఆర్ రాజ్యాంగ చెల్లుబాటు అంశం సుప్రీంకోర్టు పరిశీలనలో ఉన్నప్పటికీ, అదే ప్రక్రియను ఇతర రాష్ట్రాలకు విస్తరించాలనే చర్యను నిర్దోషిగా లేదా నిష్పాక్షికంగా చూడలేమన్నారు. దీర్ఘకాలిక, విస్తృతమైన సంప్రదింపులు అవసరమయ్యే ప్రత్యేక ఇంటెన్సివ్ సవరణను త్వరితగతిన నిర్వహించడం ప్రజల ఆదేశాన్ని దెబ్బతీసే ప్రయత్నాన్ని స్పష్టంగా సూచిస్తుందని విజయన్ పేర్కొన్నారు. ప్రస్తుత జాబితాలకు బదులుగా 2002 నుండి 2004 వరకు ఓటర్ల జాబితాల ఆధారంగా సవరణను రూపొందించాలనే కమిషన్ నివేదిక ప్రణాళిక ప్రజాప్రాతినిధ్య చట్టం, 1950, ఓటర్ల నమోదు నియమాలు, 1960ని నేరుగా ఉల్లంఘించడమేనని ముఖ్యమంత్రి ఎత్తి చూపారు. కేరళ స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవుతున్నందున, ఇప్పుడు ప్రత్యేక ఇంటెన్సివ్ సవరణను నిర్వహించడం అసాధ్యమని కేరళ ప్రధాన ఎన్నికల అధికారి కమిషన్ ఇప్పటికే తెలియజేశారని విజయన్ కూడా గుర్తించారు. ఎస్‌ఐఆర్ ప్రక్రియను వ్యతిరేకిస్తూ శాసనసభలో ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించిన రాష్ట్రాల్లో కేరళ తొలిస్థానంలో ఉంది. ఎస్‌ఐఆర్ వల్ల బిహార్‌లో ఏం జరిగిందో అందరికీ తెలుసునని, 65 లక్షల మంది పేర్లు ఓటర్లను జాబితా నుండి తొలగించారన్నారు. ప్రక్రియను వేరే చోట పునరావృతం చేయాలనే చర్య 'రాజ్యాంగంలోని ఆర్టికల్ 326 పూర్తి ఉల్లంఘన' అని పేర్కొన్నారు. 'ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు అయిన ఓటు హక్కును తీసివేయలేము లేదా రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా మార్చలేము' అని ఆయన అన్నారు. ఎస్‌ఐఆర్ 'జాతీయ పౌరుల రిజిస్టర్ (ఎన్ఆర్‌సి) బ్యాక్‌డోర్ అమలు'గా మారవచ్చని హెచ్చరించారు. కేరళతో సహా వివిధ రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ సవరణను నిర్వహించాలనే ఇసిఐ నిర్ణయం మన ప్రజాస్వామ్య ప్రక్రియకు అవమానం అని విజయన్ ఎక్స్‌లో పోస్టు చేశారు. పాత జాబితాల ఆధారంగా చేసుకుని స్థానిక ఎన్నికలకు ముందు తొందరపడి చేపట్టం తీవ్రమైన ఆందోళనలను లేవనెత్తుతుందని, ప్రజాస్వామ్యాన్ని అణగదొక్కే ఈ ప్రయత్నాన్ని కేరళ గట్టిగా వ్యతిరేకిస్తుందన్నారు. దానిని రక్షించడానికి ఐక్య ప్రతిఘటనకు పిలుపునిస్తుందన్నారు.

## బిహార్‌లో యువత ఆకాంక్షలు అణచివేత

'మోదీ-నితీశ్' ప్రభుత్వంపై రాహుల్‌గాంధీ ధ్వజం



**న్యూఢిల్లీ :** బిహార్‌లో 'మోదీ-నితీశ్' ప్రభుత్వమే లక్ష్యంగా ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. ఈ ప్రభుత్వం బిహార్ యువత ఆకాంక్షలను అణచివేసిందని, రాష్ట్రాన్ని గాలికి వదిలేసి ప్రతి అభివృద్ధిలోనూ అగాధంలోకి నెట్టివేసిందని ఆయన ధ్వజమెత్తారు. మార్పు కోసం, న్యాయం కోసం మహాఘట్‌బంధన్ సంకల్పాన్ని పునరుద్ఘాటించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో రాహుల్‌గాంధీ పేర్కొంటూ ఇటీవల బిహార్ యువతతో తన సంభాషణ వీడియోను షేర్ చేశారు. 'కొన్ని రోజుల క్రితం విద్య, ఆరోగ్యం, ఉపాధి ప్రతి అంశంపై బిహార్ యువతతో చాలా ఆసక్తికరమైన సంభాషణ చేశానన్నారు. ఈ అన్ని అంశాలలో ఈ దయనీయ రాష్ట్రానికి ఒకే ఒక దోషిగా బిజెపి-జెడియు ప్రభుత్వం అని తేలిందని అని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు తన పోస్ట్‌లో హిందీలో పేర్కొన్నారు. 'గత 20 సంవత్సరాలుగా, ఈ మోదీ-నితీష్ ప్రభుత్వం యువత ఆకాంక్షలను అణచివేసి, విద్యా రంగంలో 9 నుండి 10 తరగతులలో డ్రాపౌట్ రేటు పరంగా బిహార్ 29 రాష్ట్రాలలో 27వ స్థానంలో ఉందని; 11, 12 తరగతులలో నమోదు రేటులో 29 రాష్ట్రాలలో 28వ స్థానంలో ఉందని; మహిళా అక్షరాస్యతలో 28వ స్థానంలో ఉందని రాహుల్‌గాంధీ విమర్శించారు. ఉద్యోగ రంగంలో, సేవా రంగంలో ఉపాధి పరంగా బిహార్ 21వ స్థానంలో ఉండగా, పరిశ్రమ/తయారీ రంగంలో 23వ స్థానంలో ఉందన్నారు. శిశు మరణాల రేటు పరంగా, భీమా పథకాల ద్వారా ఆరోగ్య కవరేజీలో 27వ స్థానంలో ఉందని; గృహాలలో మరుగుదొడ్ల అందుబాటులో ఉండటంలో 29వ స్థానంలో ఉందని మాజీ కాంగ్రెస్ చీఫ్ కూడా చెప్పారు. మానవ అభివృద్ధి రంగంలో, మానవ అభివృద్ధి సూచిక (హెచ్‌డిఐ) పరంగా బిహార్ 27వ స్థానంలో ఉందని, తలసరి ఆదాయం పరంగా 25వ స్థానంలో ఉందని ఆయన ఎత్తి చూపారు. నేను కలిసిన బిహారీ యువకులందరూ చాలా ప్రతిభావంతులు, తెలివైనవారు. వారి సామర్థ్యాలు , కృషితో, వారు ఎక్కడైనా ప్రకాశించగలరు, కానీ ప్రభుత్వం వారికి అవకాశాలకు బదులుగా నిరుద్యోగం, నిరాశను ఇచ్చింది. ఇప్పుడు మార్పు కోసం సమయం, బిహార్ గర్వాన్ని తిరిగి రగిలించాలి.

## ప్రశాంత్‌కిషోర్‌కు రెండు రాష్ట్రాల్లో ఓటు

మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని

ఎన్నికల అధికారి లేఖ



**పాట్నా :** ఎన్నికల వ్యూహకర్త నుంచి రాజకీయ నాయకుడిగా మారిన ప్రశాంత్ కిషోర్ బిహార్ అసెంబ్లీ ఎన్నికల ముందు చిక్కుల్లో పడ్డారు. జన్ సురాజ్ పార్టీని స్థాపించి ఏ పొత్తూ లేకుండా ఒంటిరిగా బరిలో నిలిచిన కిషోర్‌కు రెండు రాష్ట్రాల్లో ఓటు ఉందని ఎన్నికల అధికారులు వెల్లడించారు. బిహార్‌లోని కర్గహర్ అసెంబ్లీ నియోజకవర్గంలో, పశ్చిమబెంగాల్‌లోని భవానీనగర్ అసెంబ్లీ స్థానంలో ఆయన ఓటరుగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కర్గహర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రశాంత్ కిషోర్‌కు లేఖ రాశారు. ఒకటి కంటే ఎక్కువ నియోజకవర్గాల్లో మీరు ఓటరుగా ఎందుకు పేరు నమోదు చేసుకున్నారో మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆ లేఖలో ఆదేశించారు. ఆయన నేరుగాగానీ, ఆయన తరపున ఎవరైనాగానీ హాజరై వివరణ ఇవ్వవచ్చని పేర్కొన్నారు. '2025 అక్టోబర్ 28న ప్రచురితమైన వార్త ప్రకారం.. మీ పేరు బిహార్, పశ్చిమబెంగాల్ రెండు రాష్ట్రాల్లో ఓటరుగా ఉన్నది. కాబట్టి మీరు తప్పనిసరిగా మీ తరపున మూడు రోజుల్లో మా ముందు హాజరు కావాలి. ఒకటి కంటే ఎక్కువ నియోజకవర్గాల్లో ఎందుకు ఓటరుగా పేరు నమోదు చేసుకున్నారో వివరణ ఇవ్వాలి' అని ఎన్నికల రిటర్నింగ్ అధికారి తన లేఖలో ఆదేశించారు.

# కృత్రిమ వర్షానికి ఢిల్లీ సిద్ధం

క్లౌడ్ సీడింగ్ ప్రక్రియ పూర్తి



**న్యూఢిల్లీ :** కాలుష్య భూతంతో ఢిల్లీ యుద్ధం చేస్తోంది. శీతాకాల ప్రభావంతో పాటు బాణాసంచా కారణంగా తీవ్రమవుతున్న కాలుష్యాన్ని తగ్గించేందుకు కృత్రిమ వర్షం కురిపించేందుకు ఢిల్లీ ప్రభుత్వం సిద్ధమైంది. ఢిల్లీ ప్రభుత్వం, ఐఐటి కాన్పూర్ సహకారంతో మంగళవారం ఢిల్లీలోని కొన్ని ప్రాంతాల్లో క్లౌడ్‌సీడింగ్ ట్రయల్స్ నిర్వహించిందని, రానున్న కొద్ది రోజుల్లో ఇలాంటి మరిన్ని ప్రక్రియలు చేపట్టాలని ప్రణాళికలు వేస్తున్నట్లు పర్యావరణ మంత్రి మంజీందర్ సింగ్ సిర్సా తెలిపారు. అయితే, పర్యావరణవేత్తలు ఢిల్లీ ప్రభుత్వం చేపట్టిన క్లౌడ్‌సీడింగ్ ట్రయల్‌ను స్వల్పకాలిక చర్యగా అభివర్ణించారు. ఇది తాత్కాలికంగా కాలుష్యాన్ని తగ్గించవచ్చు కానీ రాజధానిలో క్షీణిస్తున్న గాలి నాణ్యతకు మూల కారణాలను పరిష్కరించడంలో విఫలమైందని అన్నారు. కాగా, విమానం కాన్పూర్ నుండి ఢిల్లీకి బయలుదేరి, మీరట్ ఎయిర్‌ఫీల్డ్ ల్యాండ్ అయ్యే ముందు బురారి, ఉత్తర కరోల్ బాగ్, మయూర్ విహార్ వంటి ప్రాంతాలను కవర్ చేసింది. 'సెస్నా విమానం కాన్పూర్ నుండి బయలుదేరింది. ఇది 2 నుండి 2.5 కిలోగ్రాముల బరువున్న ఎనిమిది అగ్ని జ్వాలలను విడుదల చేసింది. ట్రయల్ అర గంట పాటు కొనసాగింది. ప్రతి అగ్ని జ్వాల రెండు నుండి రెండున్నర నిమిషాల పాటు కొనసాగింది. మేఘాలు 15 నుండి 20 శాతం తేమను కలిగి ఉన్నాయి. 17 నుండి 18 నిమిషాల వరకు మంటలు విడుదలయ్యాయి' అని సిర్సా ఒక వీడియో ప్రకటనలో తెలిపారు. ట్రయల్ తర్వాత 15 నిమిషాల నుండి 4 గంటలలోపు వర్షం పడే అవకాశం ఉందని ఐఐటి కాన్పూర్ అభిప్రాయపడిందని ఆయన అన్నారు. అయితే, తేమ స్థాయిలు 15 నుండి 20 శాతం మాత్రమే ఉన్నందున వర్షపాతం భారీగా ఉండదని మంత్రి చెప్పారు. రెండవ ట్రయల్ కూడా ఆలస్యంగా ఢిల్లీ వెలుపల నిర్వహించారు. కొద్ది రోజుల్లో తొమ్మిది నుండి 10 ట్రయల్స్‌కు ప్లాన్ చేస్తామని, గాలి దిశ ఉత్తరం వైపు ఉందని ఐఎండి తెలియజేసినందున, ఆ ప్రాంతంలోని ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుంటున్నామని సిర్సా చెప్పారు. ఐఐటి కాన్పూర్ ఢిల్లీ మీదుగా ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించినట్లు వర్గాలు తెలిపాయి. మొదటి రౌండ్‌లో భూమి మట్టానికి దాదాపు 4,000 అడుగుల ఎత్తులో ఆరు ఫ్లేర్‌లను విడుదల చేశారు, దీని కాల వ్యవధి పద్దెనిమిదిన్నర నిమిషాలు. రెండవ విమానం మధ్యాహ్నం 3:55 గంటలకు బయలుదేరగా, ఎనిమిది ఫ్లేర్‌లను దాదాపు 5,000–6,000 అడుగుల ఎత్తులో మోహరించింది.

## సముద్ర భద్రతను ఇకపై ఇరుకైన పట్టకం ద్వారా చూడలేం

**న్యూఢిల్లీ :** ద్రవ అమరికలు, సంలీన సవాళ్లతో కూడిన ఈ అల్లకల్లోల యుగంలో ముప్పు నియంత్రణ యొక్క ఇరుకైన పట్టకం (ప్రిజమ్) ద్వారా సముద్ర భద్రతను ఇక చూడలేమని భారత నావికాదళ ప్రధాన అధికారి అడ్మిరల్ దినేష్ కె.త్రిపాఠి అన్నారు. సోమవారం నాడు ఇక్కడ జరిగిన ఇండోపసిఫిక్ రీజనల్ డైలాగ్2025 సదస్సులో నేవీ చీఫ్ అడ్మిరల్ దినేష్ కె.త్రిపాఠి ప్రసంగించారు. ప్రొఫెసర్ రిక్‌మాన్ 'డైనాక్లిక్ చాలెంజ్' అని పిలిచేదానిని డైనమిక్ సవాల్‌గా, సంక్లిష్ట సవాల్‌గా రెండు విధాలుగా అర్థం చేసుకోవాలని నేవీ చీఫ్ చెప్పారు. అక్టోబరు 28 నుండి **30**వరకు మూడు రోజులపాటు మానెక్‌షా సెంటర్‌లో జరుగుతున్న ఈ సదస్సుకు నావికాదళం ఆతిథ్యం ఇస్తోంది. వివిధ దేశాల నుండి అనేకమంది నావికాదళ అధికారులు, నిపుణులు ఈ సదస్సులో పాల్గొంటున్నారు. 'శతాబ్దాలుగా సముద్రాలు మానవాళికి అత్యంత పురాతనమైన రహదారులుగా ఉన్నాయి. వాణిజ్యం మరియు సంస్కృతినే కాకుండా ఉత్సుకత, ధైర్యాన్ని కూడా కలిగి ఉన్నాయి అని' అడ్మిరల్ దినేష్ కె.త్రిపాఠి వివరించారు. దేశాల అదృష్టాన్ని రూపొందించడం మొదలు భవిష్యత్తు మానవాళిని రూపొందించడం వరకూ సముద్రాలు ఎల్లవేళలా 'మన ఉమ్మడి నిధి'కి నిజమైన కొలమానాలుగా ఉన్నాయని త్రిపాఠి చెప్పారు. ఫ్లూయిడ్ అలైన్‌మెంట్స్, ఫ్యూజ్డ్ సవాళ్లతో కూడిన ఈ అల్లకల్లోల యుగంలో, సముద్ర భద్రతను ఇకపై ముప్పు నియంత్రణ యొక్క ఇరుకైన పట్టకం ద్వారా చూడలేమని తెలియజేశారు. 'గురుగ్రామ్‌లో ఉన్న ఇన్‌ఫర్మేషన్ ఫ్యూజన్ సెంటర్ ఇండియన్ ఓషన్ రీజియన్ ( ఐఎఫ్‌సిఐఓఆర్)లో 15 మంది అంతర్జాతీయ లైజన్ ఆఫీసర్లు (ఐఎల్‌ఒ)లు పనిచేస్తున్నారని 2028 నాటికి ఐఎఫ్‌సిఐఒఆర్ సామర్థ్యాన్ని 50 మంది ఐఎల్‌ఓలకు పెంచడమే మా లక్ష్యం' అని త్రిపాఠి వివరించారు.


**FORMAT – C1**
**(CHAPTER-3 PARA-3.5)**

**Declaration about Criminal Cases**

**(As per the judgment dated 25th September, 2018, of Hon'ble Supreme Court in WP (Civil) No. 536 of 2011 (Public Interest Foundation &Ors. Vs. Union of India & Anr.)**

Name and address of candidate: **ANAND RAO JOLLU,**
**H.No.8-4-369, B23, FF4, Aditya Nagar, Hyderabad-500018.**

Name of political party : **INDEPENDENT**

*Name of Election : **Assembly BYE-Election 2025**

*Name of Constituency : **61-Jubilee Hills**

I **ANAND RAO JOLLU** (name of candidate), a candidate for the abovementioned election, declare for public information the following details about my criminal antecedents:

| (A) Pending criminal cases | | | | |
|---|---|---|---|---|
| Sl. No. | Name of Court | Case No. and dated | Status of Case(s) | Section(s) of Acts concerned and brief description of offence(s) |
| 1 | **JMFC (Mobile), Sangareddy** | **CC No. 1873/20204 Dt: 07-12-2024** | **386, 447, 427, 504, 34 of IPC** | **Criminal Intimidation (extortion), unlawful trespass, property damage and provocation to breach peace.** |

| (B) Details about cases of conviction for criminal offences | | | |
|---|---|---|---|
| Sl. No. | Name of Court & date(s) of order(s) | Description of offence(s) & punishment imposed | **Maximum Punishment Imposed** |
| **N/A** | **Not Applicable** | **Not Applicable** | **Not Applicable** |



**FORMAT C-1**
*(for candidate to publish in Newspapers, TV)*

**Declaration about criminal cases**

*(As per the judgment dated 25th September, 2018, of Hon'ble Supreme Court in WP (Civil) No. 536 of 2011 (Public Interest Foundation &Ors. Vs. Union of India & Anr.)*

**Name and address of candidate : NAVEEN YADAV. V**
H.No.8-3-229/S/3/5, Rahmath Nagar,
Yousufguda Check post, Yousufguda,
Hyderabad – 500045.

**Name of Political Party : INDIAN NATIONAL CONGRESS**

**Name of Election : BYE ELECTION TO THE TELANGANA STATE LEGISLATIVE ASSEMBLY**

**Name of Constituency : 61-JUBILEE HILLS**

I, **NAVEEN YADAV. V**, a candidate for the above-mentioned election, declare for public information the following details about my criminal antecedents:

| **(A) Pending criminal cases** | | | | |
|---|---|---|---|---|
| **Sl. No.** | **Name of Court** | **Case No. and dated** | **Status Ofcase(s)** | **Section(s) of Acts concerned and brief description of offence(s)** |
| 1 | XVII ACMM, Nampally, Hyderabad | FIR No. 575/2021 C.C No. 12608/2021 dt: 26-11-2021 | Examination of accused | U/S. 109, 505(2) & 506 of IPC. Abatement of any Offence, Conducting to public mischief and criminal intimidation |
| 2 | XVII ACMM, Nampally, Hyderabad | FIR No. 95/2021 CC No. 11727/2021 dt: 27-10-2021 | Examination of accused | U/S. 506 of IPC. Criminal Intimidation |
| 3 | XVII ACMM, Nampally, Hyderabad | FIR No. 93/2021 C.C No. 10432/2021 dt: 01-09-2021 | Examination of accused | U/S. 420 & 506 of IPC Cheating and Criminal Intimidation |
| 4 | XVII ACMM, Nampally, Hyderabad | FIR No. 55/2021 C.C No. 8134/2021 dt: 30-06-2021 | Examination of accused | U/S. 341, 506, 509 r/w 143 of IPC Wrongful Restraint, Criminal Intimidation |
| 5 | III ACMM, Nampally, Hyderabad | FIR No. 395/2006, Jubilee Hills PS, Jubilee Hills, Hyderabad dt: 01-11-2006 | Summons to accused | Under section. 406, 420 & 506 of IPC. Criminal Breach of Trust, Cheating & Criminal Intimidation |
| 6 | XVII ACMM, Nampally, Hyderabad | FIR No. 340/2021, Jubilee Hills PS, Jubilee Hills, Hyderabad Dt: 2-7-2021 | Under investigation | Under Section. 188, 419, 420, 427, 447, 467, 468 & 471 of IPC and under Section 3 of PDPP Act. Trespass and deliberate disobedience of Order. |
| 7 | XIV ACMM, Nampally, Hyderabad | FIR No. 655/2025, Madhura Nagar Police Station, Hyderabad Dt: 06-10-2025 | Under investigation | 123(1), 123(2) Representation of People Act, 1951, 170,171,174 of BNS. Bribery, undue influence, or illegal inducements during elections |

| **(B) Details about cases of conviction for criminal offences** | | | |
|---|---|---|---|
| Sl. No. | Name of Court & date(s) of order(s) | Description ofoffence(s) & punishment imposed | **MaximumPunishment Imposed** |
| 1 | NA | NA | NA |

ప్రజాపక్షం
బుధవారం, 29 అక్టోబరు

# లెఫ్ట్‌కు ఎదురుదెబ్బలు

ప్రపంచ రాజకీయాల్లో మితవాదం ప్రాబల్యం వహిస్తున్న ఈ కాలంలో వామపక్షాలకి ఎదురీతే. ఇది రాజకీయ యవనికపై భావజాల పోరాటం కూడాను. అమెరికా అధ్యక్షునిగా రిపబ్లికన్ డోనాల్డ్ ట్రంప్ రెండవసారి ఎన్నికకావటం ప్రపంచవ్యాప్తంగా మితవాదులకు పెద్ద ప్రోత్సాహమిచ్చింది. అందుకు తగినట్లే అతడు 'మేక్ అమెరికా బిగ్ ఎగైన్' అంటూ మిత్రరాజ్యాలను సైతం సుంకాల పెంపుదలతో అదరగొడుతూనే, మరోవైపు తమ పక్కనే ఉన్న దక్షిణ (లాటిన్) అమెరికాలో వామపక్ష ప్రభావాన్ని అరికట్టేందుకు ఆర్థిక ఆక్రమణలను, సైనిక బెదిరింపులను ప్రయోగిస్తున్నారు. పర్యవసానంగా 2025వ సంవత్సరం వామపక్షాలకు ఎదురుదెబ్బలు, పరాజయాల సంవత్సరమవుతున్నది. అర్జెంటీనాలో ఆదివారం జరిగిన మధ్యంతర పార్లమెంటరీ ఎన్నికల్లో అధ్యక్షుడు జేవియర్ మిలీకి చెందిన పచ్చిమితవాద పార్టీ – ల లిబర్టాడ్ అవాంజా – పెద్ద విజయాలు సాధించటం తాజా ఎదురుదెబ్బ. 2023 అధ్యక్ష ఎన్నికల్లో మిలీ అధ్యక్షునిగా ఎన్నికైనప్పటికీ దిగువసభ, సెనేట్‌లలో వామపక్ష పెరోనిస్ట్‌పార్టీ పూర్తి మెజారిటీతో ఉంది. అయితే తాజా ఎన్నికల్లో అధ్యక్షుని పార్టీకి 40.84శాతం ఓట్లు, పెరోనిస్టులకు 31.67శాతం ఓట్లుతో వామపక్షాలకు వ్యతిరేక ఫలితాలొచ్చాయి. దీంతో అధ్యక్షుని పార్టీ బలం దిగువసభలో 37 నుంచి 101కి, సెనేట్‌లో 6 నుంచి 20కి పెరుగుతుంది. ఆర్థిక వ్యవస్థను కాపాడే పేరుతో కఠినమైన పొదుపు చర్యలు, ప్రైవేటీకరణ ఎజెండా అమలు జరుపుతున్న అధ్యక్షుడు మిలీకి పెద్ద ప్రోత్సాహం లభించింది. బ్యూనోస్ ఎయిర్స్ రాష్ట్రంలో గత నెలలో జరిగిన ఎన్నికల్లో వామపక్ష పెరోనిస్టులను ఓడించిన ఓటర్లు ఈ ఎన్నికల్లో మితవాద అధ్యక్షుని గెలిపించి వామపక్షాన్ని దిగ్భ్రాంతి పరిచారు. అర్జెంటీనా ఎన్నికల ఫలితాలు వాస్తవానికి అమెరికా ప్రభుత్వానికి, ప్రత్యేకించి ట్రంప్‌కు విజయం. ఎందుకంటే ట్రంప్ కరేబియన్‌పై పెద్దగా దృష్టికేంద్రీకరించారు. వామపక్ష అధ్యక్షులున్న వెనిజులా, కొలంబియా రెండింటిపై కక్షగట్టి వేధింపుచర్యలు అమలు చేస్తున్నారు. నావికా దళాన్ని మోహరించి వెనిజులాను బెదిరిస్తున్నారు. ట్రంప్‌ను ఆరాధించే అర్జెంటీనా అధ్యక్షుడు, జేవియర్ మిలీకి ప్రజాభిమానాన్ని కూడగట్టేందుకు 40 బిలియన్ అమెరికన్ డాలర్ల సహాయం ప్రకటించటమేగాక, మిలీపార్టీని గెలిపిస్తేనే సహాయం కొనసాగుతుందని హెచ్చరిక చేశారు. పెరోనిస్టులకు వ్యతిరేక ఓటర్లను పెంచటానికి ఇది సహాయపడింది. పెరోనిస్టులు గెలిస్తే తమ ఆర్థిక స్థితిగతులు మరింత దెబ్బతింటాయని భావించినవారు పెద్దసంఖ్యలో మిలీ పార్టీకి ఓటు వేశారు.

2025లో ఇంతకుముందు జరిగిన ఈక్వెడార్ అధ్యక్ష ఎన్నికల్లో వామపక్షం విజయం తథ్యమన్న అంచనాలు తలక్రిందులైనాయి. బొలీవియాలో అక్టోబర్ 19న జరిగిన ఎన్నికల్లో మధ్యేమార్గ – మితవాద అభ్యర్థి దేశాధ్యక్షునిగా ఎన్నికకావడం – రెండు దశాబ్దాల వామపక్ష పాలన ముగిసింది. నవంబర్ 16న చిలీ అధ్యక్ష ఎన్నికలు జరుగుతాయి. అవసరమైతే, డిసెంబర్ 14న రన్–ఆఫ్ పోలింగ్ జరుగుతుంది. వామపక్ష ఉమ్మడి అభ్యర్థిగా సీనియర్ కమ్యూనిస్టు పోటీ చేస్తున్నారు. హోండూరాస్‌లో ప్రస్తుతం వామపక్షవాది అధ్యక్షునిగా ఉన్నారు. నవంబర్ 30న ఎన్నికలు జరుగుతాయి. చిలీ, హోండూరాస్‌లో ట్రంప్ ప్రభుత్వం మితవాదులకు పూర్తి సహాయం చేస్తోంది.

బలమైన వామపక్ష అధ్యక్షులున్న బ్రెజిల్, మెక్సికోల్లో సమస్యలు సృష్టించటానికి ట్రంప్ వాణిజ్య సుంకాలను ఉపయోగిస్తున్నారు. ఆ ఇరువురు అధ్యక్షులూ అమెరికా సవాళ్లను దృఢంగా ఎదుర్కొంటున్నారు.

అర్జెంటీనా లాటిన్ అమెరికాలో జనాభారీత్యా, బలమైన ఆర్థిక వ్యవస్థ రీత్యా ముఖ్యమైన దేశం. గత పెరోనిస్ట్ ప్రభుత్వ ఆర్థిక సంక్షోభకాలంలో పేద ప్రజల అనుకూల కార్యక్రమాలు చేబట్టింది, వేతనాలు పెంచింది. దాంతో ద్రవ్యోల్బణం 200 శాతం వరకు పెరిగింది. ఆర్థిక వ్యవస్థ ఒడిదొడుకుల్లో పడింది. మితవాదులు దాన్ని ఉపయోగించుకున్నారు. పార్లమెంటులో వామపక్షానికి ఇప్పటికీ మెజారిటీ ఉంది. ట్రేడ్ యూనియన్‌లు, యువజన సంఘాలు బలంగా ఉన్నాయి. ఎదురుదాడి చేయగల సామర్థ్యం వామపక్షానికి ఉంది. అయితే లాటిన్ అమెరికా వామపక్షాలు ప్రస్తుతం తమ దేశాల్లోని మితవాదులపైనేగాక, వారికి అండగా ఉన్న అధ్యక్షుడు ట్రంప్‌పై కూడా పోరాటం చేయాల్సి ఉంది.

ప్రజాస్వామిక వ్యవస్థల్లో పనిచేసేటప్పుడు వామపక్షాలకూ ఎదురుదెబ్బలు తప్పవు. మళ్లీ కూడదీసుకుని మితవాదులపై భావజాల రీత్యా, విధానాల పరంగా పోరాడటం ద్వారానే పునరుద్ధానం సాధ్యం. ఆ విధంగా లాటిన్ అమెరికా వామపక్షాలు పుంజుకుని ఆదర్శవంతంగా, ఉత్తేజకారకంగా నిలుస్తాయనుటలో సందేహం లేదు.

## మళ్లీ పోరాటంలోకి

# కార్మికులు, రైతులు; ఎందుకు?

**డాక్టర్ గ్యాన్ పాథక్**

తమకు సంబంధించి కేంద్రప్రభుత్వం స్థూలంగా అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలకు నిరసనగా కార్మికులు, రైతులు మరోమారు పోరుబాట పట్టారు. ఆ విధానాలు తమపట్ల 'కక్షసాధింపు'గా 'అణచివేసేవి'గా ఉన్నాయని వారు భావిస్తున్నారు. 2025, నవంబర్ 26 పతాక ఘట్టానికి చేరే ఈ నెలరోజుల దేశవ్యాప్త ఆందోళన చేబట్టటానికి తక్షణ కారణాలు – కేంద్ర ప్రభుత్వం శ్రమశక్తి నీతి, 2025 పేరుతో విడుదలచేసిన జాతీయ కార్మిక మరియు ఉపాధి విధానం ముసాయిదా, విద్యుచ్ఛక్తి సవరణ బిల్లు, 2025, ముసాయిదా.

కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వశాఖ అక్టోబర్ 8, 2025 నాడు జాతీయ ఉపాధి విధానం, 2025 ప్రచురించింది. 20 రోజుల్లోపు – అక్టోబర్ 25 నాటికి ఆ విధానంపై తమ అభిప్రాయాలు, సూచనలు, వ్యాఖ్యలు పంపవలసిందిగా తత్సంబంధీకులను, సంస్థలను, ప్రజాసంఘాల సభ్యులను అది కోరింది. కేంద్ర విద్యుచ్ఛక్తి మంత్రిత్వశాఖ అక్టోబర్ 9, 2025నాడు విద్యుచ్ఛక్తి (సవరణ) బిల్లు ముసాయిదా ప్రచురించింది. ప్రజల నుంచి సూచనలు, సలహాలు, వ్యాఖ్యలను అక్టోబర్ 25లోగా కోరింది. 10 కేంద్ర ట్రేడ్ యూనియన్‌లతో కూడిన ఉమ్మడివేదిక (సిటియులు), రైతు సంఘాల ఐక్య సంస్థ – సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కెఎం) రెండూ పై రెండు ప్రచురణల్లోని వాస్తవిక ఉద్దేశాలను విమర్శించాయి.

అక్టోబరు 18న జరిగిన సిటియులు, ఎస్‌కెఎం సంయుక్త సమావేశం పై రెండు ముసాయిదాలకు వ్యతిరేకంగా, నిరసన తెలియజేయాలని నిర్ణయించటంతోపాటు, దేశంలోని కార్మికులు, రైతులకు సంబంధించి కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న వివాదాస్పద విధాన చట్రానికి వ్యతిరేకంగా దేశవ్యాప్త ఆందోళనను కూడా ప్రకటించింది. కేంద్రప్రభుత్వ విధానాలు రానురానూ సామాన్య ప్రజల పట్ల కక్షసాధింపుగా, అణచివేసేవిగా ఉంటున్నాయని వారొక పత్రికా ప్రకటనలో విమర్శించారు.

తమకు ప్రత్యేకించిన, అందరికీ సంబంధమున్న సమస్యలపై నెలరోజులపాటు దేశవ్యాప్త ప్రచారాందోళనను ఆ సంఘాలు తలపెట్టాయి. ఆ ప్రణాళిక ప్రకారం కేంద్రప్రభుత్వ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలు, తాజా ముసాయిదాల నిజ ఉద్దేశాలను నిరసిస్తూ దేశంలోని ప్రతి జిల్లానుండి కార్మికులు, కర్షకులు ప్రదర్శనలు, సభలు జరిపి చైతన్యపరిచే కృషి సాగిస్తారు. విద్యుచ్ఛక్తి ముసాయిదా బిల్లు, జాతీయ కార్మిక, ఉపాధి విధానం ముసాయిదాలకు వ్యతిరేకంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఉద్దేశించిన విజ్ఞాపన పత్రాలను నవంబర్ 26న జిల్లా కలెక్టర్లకు సమర్పిస్తారు.

''కేంద్రప్రభుత్వ కార్పొరేట్ అనుకూల, కార్మిక వ్యతిరేక, రైతు వ్యతిరేక విధానాలను సవాలు చేస్తూ సమన్వయ పూర్వకంగా, ఏకకాలంలో ఆందోళనోద్యమాలను కొనసాగించాలని సిటియులు, ఎస్‌కెఎం సమావేశం నిర్ణయించింది. ''ఈ సంఘాల నాయకులు తమకు సంబంధించిన కోర్కెలపై రాష్ట్రపతికి ఉద్దేశించి ప్రతి చోట విజ్ఞాపన పత్రాలు సమర్పిస్తారు. మోదీ ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల, కార్మిక వ్యతిరేక, రైతు వ్యతిరేక విధాన చట్రాన్ని వెనక్కి కొట్టటానికి, లౌకిక ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళన చేయటం అవసరం'' అని వారు ప్రకటించారు.

''ప్రభుత్వరంగ సంస్థలను, ప్రభుత్వ సేవలను ప్రైవేటీకరించటానికి కొత్త ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రతిపాదిత విద్యుచ్ఛక్తి సవరణ బిల్లు, కార్మిక–ఉపాధి మంత్రిత్వశాఖ ప్రచురించిన కార్మిక విధాన ముసాయిదా ఇందుకు తాజా ఉదాహరణ. రాష్ట్రప్రభుత్వాల ద్వారా నాలుగు లేబర్ కోడ్‌లు అమలు చేయించేందుకు, రాష్ట్ర



ప్రభుత్వ యంత్రాంగం ద్వారా రైతుల భూమి స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయి''అని వారి ప్రకటన పేర్కొన్నది. భారతప్రభుత్వం అంతర్జాతీయ ద్రవ్యపెట్టుబడి ప్రయోజనాలకు ఉపకరిస్తున్నదని, అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సుంకాల వ్యవస్థకు వ్యతిరేకంగా భారత రైతులు, కార్మికుల, చిన్న వ్యాపారాలు, వాణిజ్య ప్రయోజనాలు కాపాడటంలో మోదీ ప్రభుత్వం విఫలమైందని విమర్శించింది.

దేశంలో రైతు ఉద్యమంలో **నవంబరు 26**కు ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. 2020లో ఢిల్లీ సరిహద్దులో రైతులు సంవత్సరంపాటు సాగించిన బైఠాయింపు ఆందోళనను ఆరంభించింది ఆ రోజునే. చలికి, వానకు, ఎండకు వెరవని ఆ ఆందోళన మూడు రైతు వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల చట్టాలను ప్రధాని నరేంద్రమోదీ ఉపసంహరించుకునేటట్లు చేసింది. అయితే తమ పంటలకు ఎంఎస్‌పికి లీగల్ గ్యారంటీ కల్పించటం సహా రైతుల అనేక డిమాండ్లు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని పరిష్కరిస్తానని మోదీ ఇచ్చిన హామీని ఇంతవరకు నెరవేర్చలేదు. 10 సిటియుల ఉమ్మడి వేదిక రైతులకు తోడ్పాటిచ్చింది. ఇప్పుడు వారు కేంద్రప్రభుత్వ కార్మిక వ్యతిరేక, రైతు వ్యతిరేక నిరసనలో చేయిచేయి కలుపుతున్నారు.

జాతీయ ఉపాధి విధానం ముసాయిదా, 2025 ముఖ్య ఉద్దేశం కేంద్రం ఉపాధి కల్పన బాధ్యతను తొలగించుకుని రాష్ట్ర ప్రభుత్వాలకు, మార్కెట్ శక్తులకు బదలాయించటంగా విమర్శకులు ఆరోపిస్తున్నారు. కార్మిక చట్టాల ధోరణిని 'కార్మిక హక్కులు' నుంచి 'కార్మిక విధులు'కు మార్చటంగా కనిపిస్తున్నది.

జాతీయస్థాయి సమ్మెలు సహా సిటియుల తీవ్ర ప్రతిఘటన మూలంగా వివాదాస్పదమైన నాలుగు కార్మిక స్మృతిల అమలును కేంద్రం పెండింగ్‌లో ఉంచింది. జులై 9న నిర్వహించిన చరిత్రాత్మక సమ్మె వాటిలో తాజా ఆందోళన. ప్రభుత్వం ఇప్పుడు దొడ్డిత్రోవన అమలులోకి తెచ్చే ప్రయత్నం చేస్తోందని, జాతీయ, కార్మిక, ఉపాధి విధానం, 2025, ముసాయిదా అందుకు ఉద్దేశించిందిగా సిటియులు అనుమానిస్తున్నాయి.

విద్యుచ్ఛక్తి (సవరణ) బిల్లు, 2025, ముసాయిదా 2003 నాటి విద్యుత్ చట్టాన్ని సమూలంగా మార్పు చేయతలపెట్టింది. టారిఫ్‌లు ఖర్చులను ప్రతిబింబించాలని, క్రాస్ సబ్సిడీలకు ముగింపు పలకాలని, పారిశ్రామిక పోటీతత్వానికి ప్రోత్సాహమివ్వాలని, పునరుత్పాదక ఇంధన హామీలు నెరవేర్చటాన్ని, రెగ్యులేటరీ జవాబుదారీతనాన్ని పటిష్టం చేయాలని అది ప్రతిపాదించింది.

విద్యుచ్ఛక్తి టారిఫ్ లు విద్యుత్ ఉత్పత్తి – సరఫరా వ్యయాన్ని పూర్తిగా భర్తీచేసే విధంగా రెగ్యులేటరీ కమిషన్‌లు ఇకపై ఆదేశించవచ్చు. ఈ కార్మిక వ్యతిరేక చర్యను ఎస్‌కెఎం ఆమూలాగ్రం వ్యతిరేకిస్తున్నది.

# ఇంటర్నెట్ లేని సమాజాన్ని ఊహించగలమా!

నాటి పాతరాతి యుగం నుంచి నేటి డిజిటల్ ఎఐ యుగం వరకు మానవ జీవనశైలిలో పెనుమార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఈమెయిల్, ఫేస్‌బుక్, యూట్యూబ్, గూగుల్, ట్విట్టర్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ లాంటి పదాలు చిన్న పిల్లలకు సహితం కంఠస్థం అయ్యాయి. కంప్యూటర్ వ్యవస్థను రిమోట్ కంట్రోల్ ద్వారా అనుసంధానం చేస్తూ సమాచార వితరణ సుసాధ్యం చేయడాన్ని ఇంటర్నెట్‌గా చెప్పుకుంటున్నాం. 'ఇంటర్ కనెక్టెడ్ నెట్వర్క్'ను 'ఇంటర్నెట్' అంటున్నాం. ప్రపంచ మానవాళి అరచేతిలో స్మార్ట్‌ఫోన్ రూపంలో వైకుంఠం వెలిసింది. గూగులమ్మ పొట్టలో విశ్వ విజ్ఞానం అంతా దాగిపోయింది. అడిగిందే తడవుగా సమాచారాన్ని మనకు వడ్డిస్తోంది. నేటి 'వరల్డ్ వైడ్ వెబ్'ను 1989లో టిమ్ బెర్నర్ లీలు కనుగొన్నారు. పట్నం మేధావి నుంచి పల్లె నిరక్షరాస్యుడి వరకు అందరికీ ఇంటర్నెట్ ఆత్మీయ నేస్తం అయ్యింది. 29, అక్టోబర్ 1969 రోజు తొలిసారి కాలిఫోర్నియా యూనివర్సిటీలో 'చార్లీ క్లైన్'తో కలి సి 'లియొనార్డ్ క్లీన్రాక్' 'ఎల్', 'ఓ' (లాగిన్) అనే ఆంగ్ల అక్షరాలను ఎలక్ట్రానిక్ ఇంటర్నెట్ మెసేజ్ ద్వా రా విజయవంతంగా పంపించడం జరిగింది.




**అంతర్జాతీయ అంతర్జాల దినోత్సవం:**

ఆధునిక మానవుడు అంతర్జాల లేదా ఇంటర్నేట్ సంద్రంలో మునిగి తేలుతున్నాడు. ఇంటర్నేట్ వాడకుండా ఒక గంట గడవడం లేదు. స్మార్ట్ఫోన్ మానవ శరీరంలో మరో ఆధునిక అంగం అయ్యింది. స్మార్ట్ఫోన్ రాకతో అతి సామాన్యుల ముంగిట్లో కూడా ఇంటర్నెట్ ప్రవేశించింది. మితిమీరిన వాడకంతో ఇంటర్నెట్ దురలవాటు బారిన కూడా యువత, పిల్లలు పడ డం చూస్తున్నాం. అంతర్జాల రాకతో విశ్వ విజ్ఞానం మన అరచేతిలో ఇమిడి పోయింది. విశ్వాన్ని కుగ్రామంగా మార్చిన ఘనత ఇంటర్నెట్ టెక్నాలజీదే అని నమ్ముతున్నాం. అంతర్జాలంతో అసంఖ్యాక ప్రయోజనాలు ఉన్నప్పటికీ దానిపట్ల జాగ్రత్తగా ఉండని యెడల పలు ప్రమాదకర నష్టాలు కూడా మన అనుభవంలోకి వస్తున్నాయి. అంతర్జాలాన్ని వినియోగిస్తున్న నెటిజెన్లు అనేక ప్రయోజనాలను పొందుతున్నప్పటికీ పలు సందర్భాల్లో ప్రతికూల అనుభవాలు, సైబర్ బుల్లీయింగ్, తిట్ల దండకాలు, అక్రమ వినియోగాలు, అసభ్యకర అవమానకర మాటలను కూడా వినవలసి వస్తున్న వేళ సురక్షిత ఇంటర్నెట్ పట్ల అవగాహన కల్పించాల్సిన అగత్యం ఏర్పడింది. ఆ సృజనశీల ఆవిష్కరణకు గుర్తుగా ప్రతి ఏట 29 అక్టోబర్ రోజు ప్రపంచ దేశాలు అంతర్జాతీయ అంతర్జాల దినోత్సవం (ఇంటర్నేషనల్ ఇంటర్నెట్ డే)పాటించడం 2005 నుంచి ప్రారంభం అయ్యింది.

**జగమంతా అంతర్జాల మయం :**

నేటి 'ఇంటర్నెట్'ను ప్రారంభంలో 'ఆర్పినెట్' అని పిలిచేవారు. నేటి డిజిటల్ ఎఐ యుగంలో ఇంటర్నెట్‌ను ఇన్ఫర్మేషన్ సూపర్ హైవే అని పిలవాల్సిన స్థితి రావడం చూస్తున్నాం. ఇంటర్నెట్‌ను శోధించడాన్ని 'సర్ఫింగ్' అని, ఇంటర్నెట్ వినియోగదారులను 'నెటిజెన్' అని, వీడియో కాన్ఫరెన్స్‌ను 'వెబినార్' అని పిలుస్తున్నాం. గూగుల్ సహాయంతో ఒక ప్రశ్నకు 0.2 సెకన్లలో సమాధానాలు పొందుతున్నాం. 1971లో ఈ మెయిల్, 1994లో యాహూ, 1995లో ఇంటర్నెట్ ఎక్స్‌ప్లోరర్, 1998లో గూగుల్, 2004లో ఫేస్బుక్, 2006లో ట్విట్టర్ అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం గూగుల్‌ను కింగ్ ఆఫ్ ఆల్ ఇంటర్నెట్స్ అని పిలుస్తున్నాం. అంతర్జాల సంద్రంలో మునిగిన నేటి డిజిటల్ మానవుడు ఎలక్ట్రానిక్ మెయిల్స్, పరిశోధనలు, డౌన్‌లోడ్ ఫైల్స్, ఆన్లైన్ చర్చలు, ఈవిద్య, వీడియో గేమ్స్, స్నేహాలు, ఈలైబ్రరీ, కృత్రిమ మేధ, ఆర్థిక బ్యాంకింగ్ సేవలు, సమాచార వితరణ, వర్క్ ఫ్రం హోమ్, విజ్ఞాన బోధన, లాంటి అనేక ప్రయోజనాలను పొందుతున్నాడు. నేడు విశ్వవ్యాప్తంగా 5.56 బిలియన్ల అంతర్జాల వినియోగదారులు, 5.28 బిలియన్ల స్మార్ట్‌ఫోన్ వినియోగదారులు, ఇంటర్నెట్ వాడుకునే 68 శాతం ప్రపంచ ప్రజలు ఉన్నారు. నేడు అత్యధికంగా చైనాలో 975 మిలియన్లు, భారత్‌లో 806 మిలియన్లు, యూఎస్‌లో 322 మిలియన్ల అంతర్జాల వినియోగదారులు ఉన్నారు. ప్రతి ఏట ఒక మిలియన్ ఇంటర్నెట్ వినియోగదారులు కొత్తగా చేరుతున్నారు.

నేడు ఇంటర్నెట్ సగటు వినియోగం 6 గంటల 42 నిమిషాలు, సోషల్ మీడియా సగటు వినియోగం 2 గంటల 16 నిమిషాల సమయం పడుతున్నది. నిత్యం దాదాపు 350 బిలియన్ల ఈ మెయిల్స్ పంపడం జరుగుతున్నది.

**సురక్షితంగా అంతర్జాలాన్ని వాడుకుందాం:**

అంతర్జాలం వాడడం తప్పనిసరి అవుతున్న దానిపట్ల కనీస పరిజ్ఞా నం, తగు జాగ్రత్తలు తీసుకోవడం కనీస అవసరం అవుతున్న వేళ ఇంటర్నెట్‌ను సురక్షితంగా వినియోగించుకునే మార్గాలను అవగాహన పరచడానికి 2004 నుంచి ప్రతి ఏట 11 ఫిబ్రవరిన ప్రపంచ దేశాలు సురక్షిత అంతర్జాల దినం లేదా సేఫర్ ఇంటర్నెట్ డే పాటించడం కూడా ఆనవాయితీగా మారింది. నేటి సమాజంలో విద్యాలయాలు, కుటుంబాలు, బంధు మిత్రులు, సహచర వర్గాలు, పౌర సమాజాల్లో సురక్షితంగా అంతర్జాలాన్ని ఎలా వినియోగించాలో ప్రజలకు, విద్యార్థులకు తెలుపవలసిన అవసరం వచ్చింది. ఆన్లైన్‌లో గౌరవంగా మాట్లాడడం, సత్ప్రవర్తనతో వినియోగించడం, సహానుభూతి ప్రదర్శించడం, హానికరమైన చర్యలకు దూరంగా ఉండడంలాంటివి మనం ఆచరణలో పెట్టాలి.

**ప్రధాన ఇంటర్నెట్ ఆన్లైన్ మోసాలు:**

ఇంటర్నెట్‌తో ఎంతో ప్రయోజనం పొందుతున్నప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే అంతర్జాల వలలో చిక్కి జీవితాలు సర్వనాశనం కూడా కావచ్చని మన అనుభవం స్పష్టం చేస్తున్నది. అంతర్జాల వలయంలో అధిక సమయం మునిగితే ఓపిక నశించడం, ఒంటరితనం, నిద్రలేమి, అనారోగ్య సమస్యలు, కంటిచూపుపై దుష్ప్రభావం, ఏకాగ్రత లోపించడం, దుర్వార్తలను ప్రేరేపించడం, అశ్లీల సైట్స్‌తో భవిష్యత్తు సర్వనాశనం, పనిలో శ్రద్ధ తగ్గడం, సైబర్ నేరాలు లాంటివి కలుగుతున్నాయి. ప్రధాన దుర్వినియోగాల్లో సైబర్ బుల్లీయింగ్, ఫిషింగ్ స్కామ్, డాటా బ్రీచింగ్, అనధికారిక చొరబాట్లు, మాల్వేర్, ఆన్లైన్ గ్రూమింగ్, వ్యక్తిగత సమాచార దుర్వినియోగం, ఆన్లైన్ ప్రిడేటర్స్, సెక్సిటింగ్, రాన్సమ్వేర్, సైబర్ క్రైమ్స్, ఆన్లైన్ బెట్టింగ్ మోసాలు, ఆన్లైన్ అప్పుల వేధింపులు, వ్యక్తిగత సమాచారాన్ని దోచేసి వేధించడం లాంటి పలు అంశాల పట్ల తగు జాగ్రత్తగా ఉండడం అనివార్యం అయ్యింది. వీటి పట్ల అవగాహనలేని యెడల పలు చిక్కులను ఎదుర్కోవలసి వస్తుందని తెలుసుకోవాలి. తగు విధంగా ముందు జాగ్రత్తలు తీసుకుంటూ ఇంటర్నెట్‌ను సురక్షితంగా వాడడం నేర్చుకొని భద్రంగా అంతర్జాల వలలో ఆనంద తాండవం ఆడుదాం, విజ్ఞాన వివేకాలను పొందుదాం,ఆన్లైన్ మోసగాళ్లకు ముచ్చెమటలు పట్టిస్తూ వారి భరతం పడదాం. ఇంటర్నెట్‌ను విశ్వమానవాళి ప్రయోజనాలకు వినియోగిస్తూ, అన్ని రంగాల్లో ముందడుగు వేద్దాం.

*(29 అక్టోబర్ అంతర్జాతీయ అంతర్జాల దినం సందర్భంగా)*

**డా: బుర్ర మధుసూదన్ రెడ్డి, 9949700037**



కొండేటి ప్రకాష్

# పాలనాదక్షుడు, బహుముఖ సాహితీ వేత్త – తెలంగాణ అంతరంగ ఆవిష్కర్త

ఒక తరం నుండి ఎన్నో తరాల వరకు అందిన మౌఖిక సాహి త్యం అమూల్యమైనది. మాట్లాడటం నేర్చిన మనిషి భౌతిక అవసరాలకే కాక భావోద్వేగాలను కూడా మాటల ద్వారానే వెల్లడించాడు. ఈ ప్రక్రియలో మనిషి అంతర్గత భావాలన్నీ సాహిత్యంగా పరిణామం చెంది మౌఖిక సాహిత్యంగా ప్రశస్తి పొందింది. సాహిత్యంలేని సమాజాన్ని ఊహించలేని స్థితిలో మనం ఇప్పుడు ఉన్నాం. సమాజంలోని ఔన్నత్యాన్ని కొలవడానికి సాహిత్యం ఒక శక్తివంతమైన సాధనంగా ఉపకరిస్తుందన డానికి నూటికి నూరుపాళ్లు నిజమే అని చెప్పవచ్చు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పాలనలో భాగమైన ఉన్నతాధికారి డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి తన పదవీ బాధ్యతలను అత్యంత పారదర్శకంగా నిర్వర్తిస్తూనే, సమాజం పట్ల బాధ్యత కలిగిన పౌరుడిగా తన అంచంచలమైన సామాజిక బాధ్యతను కవిగా, రచయితగా, విమర్శకుడిగా, అనువాదకుడిగా తనదైన శైలిలో విభిన్న రూపాల్లో రచనలు చేస్తున్న వర్తమాన కవి ధురంధరుడు. సాహితీ ప్రపంచంలో ఆయన సుపరిచితుడు. సమాజాన్ని గట్టిగా తన రచనల ద్వారా మందలించకుండా వ్యంగ్యంగా చెప్పడం వారి ప్రత్యేకత అని చెప్పవచ్చు. సాహిత్యంలోకి రాబోతున్న యువ కవుల కు వారు దిక్సూచిగా ఉండటంతో పాటు తన కంటూ ప్రత్యేకమైన స్థానాన్ని సాహిత్యంలో పదిలం చేసుకున్నారు.


**వ్యక్తిగత నేపథ్యం, విద్యాభ్యాసం, వృత్తి:** భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, కల్లోనికుంట గ్రామానికి చెందిన ఏనుగు కృష్ణా రెడ్డి, లక్ష్మ మ్మ దంపతుల కుమారు డు ఏనుగు నరసింహారెడ్డి. పుట్టింది కల్లోనికుంట అయినప్పటికీ, తరువాత కాలంలో ఏనుగు కృష్ణారెడ్డి కుటుంబం చిట్యాల గ్రామంలో స్థిరపడింది. రైతు కుటుంబంలో పుట్టి పెరిగిన నరసింహారెడ్డి చిన్నప్పటి నుండే గ్రామీణ ప్రజల జీవన విధానంపై పూర్తి అవగాహన కలిగివున్నట్లు వారి రచన లు గమనిస్తే పాఠకులకు అవగతమవుతుంది. తెలుగు గ్రంథం మీద పరిశోధన చేసి ఉస్మానియా యూనివర్సిటీ నుండి డాక్టరేట్ పట్టా పొందారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ గ్రేడ్ ఆఫీసర్‌గా, డిప్యూటీ కలెక్టర్‌గా తెలంగాణ రాష్ట్రంలో పలు జిల్లాల్లో పనిచేశారు. తెలంగాణ రాష్ట్ర తెలుగు అకాడమీ తొలి కార్యదర్శిగా పనిచేశారు. డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి ప్రస్తుతం తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులుగా ఉన్నారు.

**సాహితీ సృజన– విమర్శ:** డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి పరిశీలన దృష్టి, అధ్యయనశీలత, లోతైన అనుభవాన్ని వారి రచనలలో ప్రకటిస్తా యి. కవిత్వం అనే ఒక రేఖమీద అనేక సృజన రూపాలు, వచన కవిత, గేయం, గజల్ లాంటి వైవిధ్య అంశాలపై చేసిన విశ్లేషణలు, కవిత్వంపై చేసిన విశ్లేషణాత్మకమైన వ్యాసాల సంపుటి 'అంతరంగం ఆధునిక కవిత్వ విమర్శ'. దాశరథి, అమ్మంగి, కాళోజీ, సినారె, శివారెడ్డిలు మొదలుకొని ఆశారాజు, విల్సన్ రావు, వడ్డె ఎల్లన్న, సుంకిరెడ్డి నారాయణ రెడ్డి వరకు ఇలా చెప్పుకుంటూ పోతే సాహితీ కవిత్వంలో ముందు వరుసలో ఉండే ప్రముఖ కవుల కవిత్వం గురించిన ఇరవై ఆరు విశ్లేషణాత్మక వ్యాసాలు ఇందులో ఉన్నాయి. సాహిత్యంలో డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డికి ఉన్న లోతైన అనుభవాలను ఈ 'అంతరంగం' ద్వారా పాఠకులు తెలుసుకోవచ్చు.

విమర్శ వారి రచనా వ్యాసంగంలో మేలిమి భాగం. తన దగ్గరకు వచ్చే కవిత్వ పుస్తకాలను శ్రద్ధగా చదువుతూ వాటిలోని సారాన్ని, సారాంశాన్ని వివరిస్తూ వ్యాసాలు రాశారు. వాటిలోంచి ఎంపిక చేసిన సుమారు 62 వ్యాసాల సమాహారం 'ఊహల వేదిక ఆధునిక కవిత్వ విమర్శ'. ఈ వ్యాసాలన్నీ చదువుతూపోతే వందలమంది కవులు తారసపడతారు. కవిత్వంపై ఇంతటి ఆసక్తి వారిలో ఉంద నే విషయం ఈ పుస్తకం చదివితే పాఠకులకు అర్థమవుతుంది.

**రచనా వైవిధ్యం – వస్తువు:** డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి రచనల్లో పల్లె జీవనం, సామాజిక సమస్యలు, రాజకీయ విమర్శ, తెలంగాణ పునర్నిర్మాణం వంటి అంశాలు ప్రధానంగా కనిపిస్తాయి.






**పల్లె జీవనం, సామాజిక సమస్యలు:** పల్లె ప్రజల జీవన విధానంతో పాటు పల్లెలు కూడా మారుతున్న తీరును, పేద ప్రజలు అప్పుల సముద్రంలో మునిగి తేలియాడుతుండటం, ఊరి ఊట బావులు ఎండిపోవడం వంటి పల్లె జీవన వైవిధ్యాన్ని రచయిత తన 'మట్టి పాట పల్లె జీవన శతకం' ద్వారా సమాజానికి విశదీకరించారు.

**రెవెన్యూ వ్యవస్థ – పాలన:** గ్రామ పంచాయతీలు అభివృద్ధి చెందాలన్నా, సంక్షే మ పథకాలు నిరుపేద ప్రజలకు సకాలంలో చేరాలన్నా, భూ వివాదాలు, కక్షలు, గొడవలు తొలగి ప్రజలు సురక్షితంగా జీవించాలన్నా భారత రాజ్యాంగం ద్వారా నిర్మించబడిన అన్ని రకాల ప్రభుత్వ వ్యవస్థలు సమన్వయంతో పనిచేయాలి. రెవెన్యూ వ్యవస్థ మెరుగైన సేవలు అందించినప్పుడు దాదాపు తొంభై శాతం గ్రామ సమస్యలు తొలగిపోతాయి అనే విషయాన్ని గుర్తించారు. ప్రజలపక్షంలో ప్రభుత్వం జవాబుదారీతనంతో ఎందుకు వ్యవహరించాలనే బాధ్యత ను ప్రభుత్వ అధికారులకు డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి 'తెలుగు రాష్ట్రాల రెవె న్యూ వ్యవస్థ నిన్న నేడు రేపు' పేరుతో రూపకల్పన చేసిన వచన సంపుటి పుస్తకం ద్వారా తెలియజేశారు.

**కొత్త పలక – కవితా సంపుటి:** 'పీఠభూమిలో/నాగలి కర్రు కింద/ నీటిమట్టం కూడా/నిర్దయగా జారుకుంది అం టూ తెలంగాణ వ్యవసాయ దైన్యాన్ని చెపుతారు. ప్రపంచీకరణలో భాగంగా వ్యవసాయం ప్రస్తుతం ఎలాంటి స్థితిలో కొనసాగుతోంది అనే విషయం ఇందులో ఉంది. తెలంగాణ ప్రాంత భూమి, సాంస్కృతిక పునరుజ్జీవన, పునర్నిర్మా ణ స్థితుల ప్రభావం ఈ కవితా సంపుటికి కారణం కావచ్చు.

రోడ్డు ప్రమాదాల తీవ్రతను, కారణమైన వేగాన్ని గురించి 'యముడు నడిచే దారి' శీర్షికలో 'నిర్లక్ష్యపు క్రాసింగువల్లనో/నిదురమత్తు డ్రైవింగువల్లనో/ మిన్నంటిన హాహాకారాల్ని/ యాక్సిడెంట్లుగా రికార్డు చేస్తుంది. ఆటో నుజ్జైపోవచ్చు, బైకురైడర్ బలైపోవ/అతివేగం పదునుకత్తి. రోడ్డుమీద స్మశానాల్ని సృష్టించే వేగం నిరంతరం యముడికి' అంటూ పదునైన కత్తిగా 'కొత్త పలక కవితా సంపుటి'లో చెపుతారు. ఈ సంపుటి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారి ఉత్తమ కవితా సంపుటి పురస్కారం పొందింది.

**ఏడుకోలల బాయి – ఎన్నికల శతకం:** 'కాటు వేయని నాగును కానగలమె/ దోచుకొనుటను మానిన దొరలు గలరె?' వంటి పంక్తులు రాజకీయాల్లోని లోపాలను సూటిగా ప్రశ్నించాయి. నీతి లేని రాజకీయం అవినీతి నిర్వచనం, రాజకీయ నాయకుల నైజాన్ని, నీతి లేని వైఖరిని నాగు పాము కాటుతో పోల్చి ప్రజలకు సులువుగా అర్థమయ్యే రీతిలో వివరించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో చోటు చేసుకుంటున్న లోపాలను, అపసవ్య పోకడలను నిశితంగా పరిశీలిస్తూ, వాస్తవాలను కవిత్వంలో నిక్షిప్తం చేసిన అద్భుత సృష్టి 'ఏడుకోలల బాయి ఎన్నికల శతకం'.

**తెలంగాణ రుబాయిలు:** దాశరథి, తిరుమల శ్రీనివాసాచార్య గార్ల తర్వాత ఆ సంఖ్యలో రుబాయిలు రాసినవారు డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి మాత్రమే అని చెప్పవచ్చు. ప్రధానంగా వచన కవి అయినప్పటికీ ఈ ప్రక్రియను చేపట్టా రు.

'చెరువు ఎండిపోయింది; జ్ఞప్తిలా అంతర్జలం!/వాగు వట్టిపోయింది; ఛాయ అంతర్జలం!/ పరమాత్ముని లీల లాగ ప్రవర్తిస్తది ప్రకృతి/ ఊరు వలసపోయి ఊహలా అంతర్జలం!' అంటూ గతంలో తెలంగాణను పీడించిన వలస సమస్యను ప్రస్తావించారు. కొత్త పోలికలతో చమత్కారకరంగా, సరికొత్తగా వ్యక్తీకరించడం వీరి రుబాయిలలోని ఒక ప్రత్యేకత. ప్రచ్ఛన్న హితబోధ, అదృశ్య ఆత్మబోధ, సున్నిత అధిక్షేపం ఈ రుబాయిలలోని అంతస్సారం. తెలంగాణ సురవరం ప్రతాప్ రెడ్డి విశ్వవిద్యాలయం 2023 సం.కి తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియల్లో ఉత్తమ గ్రంథాలకు సాహితీ పురస్కారాల ప్రదానోత్సవల్లో ఉత్తమ గేయ కవితా గ్రంథ సాహితీ పురస్కారాన్ని డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి 'తెలంగాణ రుబాయిలు' ఎంపిక అయ్యింది.

డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి ఉన్నతాధికారిగా తన వృత్తిని, కవిగా, విమర్శకుడిగా తన సాహితీ ప్రయాణాన్ని సమన్వయం చేసుకుంటూ సమాజానికి దిశానిర్దేశం చేస్తున్నారు. వారి రచన లు, వారి జీవితం వర్తమాన కవులకు, రచయితలకు ఆదర్శనీయం.

*(29/10/2025నాడు జరుగుతున్న తెలంగాణ సురవరం ప్రతాప్ రెడ్డి విశ్వవిద్యాలయం 2023 సంవత్సరానికి తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియల్లో ఉత్తమ గ్రంథాలకు సాహితీ పురస్కారాల ప్రదానోత్సవాల్లో ఉత్తమ గేయ కవితా గ్రంథ సాహితీ పురస్కారాన్ని డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి 'తెలంగాణ రుబాయిలు' అందుకుంటున్న సందర్భంగా )*

## హనుమంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన కావలి గణేష్



**ప్రజాపక్షం/దుండిగల్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కొలన్ హనుమంత్ రెడ్డిను జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో, ఉమ్మడి కుత్బుల్లాపూర్ మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ ప్రతినిధి, దుండిగల్ మాజీ సర్పంచ్ కావలి గణేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో అమరం ముత్యం రెడ్డి, మాజీ ఎంపిటిసి బండారి మహేష్, దొంతి మహేష్ ముదిరాజ్, ఆకుల మధు, తదితరులు పాల్గొన్నారు.

## వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకల్లో ఎంపి



**ప్రజాపక్షం/వికారాబాద్:** సర్దార్ వల్లబాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాల్లో చేవెళ్ల ఎంపి కొండవిశ్వేశ్వర్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషితో హైదరాబాద్ సంస్థానం భారత్‌తో విలీనం అయిందని అన్నారు. యువతను భాగస్వామ్యం చేసి భవిషత్తు తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచే విధంగా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ వికసిత్ భారత్‌లలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, క్రీడ, యువజన అధికారి సత్తర్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా యూత్ అపిసార్ ఐసయ్య అనంతరం పోస్టర్‌ను విడుదల చేశారు.



## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులకు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని మున్సిపల్ కార్యాలయంలో క్లబ్ ప్రెసిడెంట్ రేసు లక్ష్మారెడ్డి, మేడిపల్లి చార్టర్ ప్రెసిడెంట్ వేముల కేశవనాదం గౌడ్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళ్ళు చాలా సున్నితమైనవని వాటిని చాలా జాగ్రత్తగా కాపాడుకున్నట్లయితే ప్రపంచాన్ని చూడగలుగుతామని లేకపోతే జీవితం అంధకారం అవుతుందని, ఘట్‌కేసర్ మున్సిపల్ కార్మికులు ఉదయం లేవగానే ధూళిలో పనిచేస్తూ ఉంటారని అటువంటి వారికి మానవతా దృక్పథంతో ఒతమ ట్రస్ట్ ద్వారా సేవలు అందిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బేతల నర్సింగ్ రావు, సభ్యులు శారద గౌడ్, హిమబిందు, సారా శ్రీనివాస్ గౌడ్, సిరాజ్‌లు పాల్గొన్నారు.



## సమస్యలపై కమిషనర్‌కు మాజీ సర్పంచ్ వినతి

**ప్రజాపక్షం/దుండిగల్ :** దుండిగల్ డబుల్ బెడ్‌రూమ్ వాసులకు మౌలిక వసతులు కల్పించాలని దుండిగల్ మాజీ సర్పంచ్ కావలి గణేష్ ఆధ్వర్యంలో దుండిగల్ మున్సిపల్ కమిషనర్ ఎన్.వెంకటేశ్వర్ నాయక్ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎండి మహబూబ్, విష్ణువర్ధన్ రెడ్డి, శ్రీనివాస్, జనార్ధన్, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## హెడ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా జె.పద్మావతి




**ప్రజాపక్షం/ఉప్పల్:** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో విస్తృతంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న హెడ్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సంస్థకు తెలంగాణ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా జె. పద్మావతి నియమితులయ్యారు. ఈ విషయాన్ని సంస్థ చైర్మన్ మాధవ్ మీడియాకు వెల్లడించారు. ఈ సందర్భంగా జె.పద్మావతి మాట్లాడుతూ, నా మీద నమ్మకం ఉంచి నాకు ఈ బాధ్యతలను అప్పగించిన చైర్మన్ మాధవ్, జాతీయ ప్రధాన కార్యదర్శి సతీష్ దేవరకొండ లకు ధన్యవాదాలు అని తెలిపారు. అదే విధంగా బాధితులకు న్యాయం అందించేందుకు, మానవ హక్కుల పరిరక్షణ కోసం తన శక్తి మేరకు కృషి చేస్తానని తెలిపారు.

## ఐఎంఎస్ఐఎస్ నిర్లక్ష్యం అన్యాయం

### జెఎసి అధ్యక్షుడు పులి లక్ష్మయ్య

**ప్రజాపక్షం/ఉప్పల్ :** జలమండలి అధికారుల నిర్లక్ష్యం వల్ల ఔట్సోర్సింగ్ సిబ్బందికి తీవ్ర అన్యాయం జరుగుతోందని తెలంగాణ ఔట్సోర్సింగ్ జేఏసీ అధ్యక్షుడు పులి లక్ష్మయ్య,ప్రతినిధి సిద్ధి రాములు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఐఎంఎస్ఐఎస్ పోర్టల్‌లో ప్రతి ఒక్కరి డేటాను నమోదు చేయాలనే ఆదేశాలు ఇచ్చినప్పటికీ, జలమండలి అధికారులు ఔట్సోర్సింగ్ సిబ్బందిని విస్మరిస్తున్నారని వారు ఆరోపించారు. పర్మినెంట్ ఉద్యోగుల వివరాలు పూర్తి స్థాయిలో అప్డేట్ చేసినప్పటికీ, లైన్‌మెన్లు, మీటర్ రీడర్లు, బిల్లు కలెక్టర్లు, డబ్ల్యూటీపీ, ఎస్టీపీ, క్యూటీల సిబ్బంది, గార్డెన్ వర్కర్లు, డిపిఒలు, సేవరేజ్ వర్కర్లు, పంప్ ఆపరేటర్లు తదితర సుమారు ఐదు వేల మందికి పైగా ఔట్సోర్సింగ్ ఉద్యోగుల వివరాలు నమోదు కాలేదని వారు తెలియజేశారు. అక్టోబర్ 25లోపు పూర్తి చేయమన్న ప్రభుత్వ ఆదేశాలను పట్టించుకోలేదని పేర్కొన్నారు.కేవలం 55 శాతం సిబ్బంది వివరాలు మాత్రమే చేర్చడమేంటి, మిగతా 45 శాతం ఉద్యోగులు ఉన్నారా లేదా అన్నది సందేహంగా ఉందని పులి లక్ష్మయ్య ప్రశ్నించారు. వీరికి జీతాలు ఎలా జారుతున్నాయనే విషయమై కూడా ప్రభుత్వం వెంటనే దర్యాప్తు జరిపించి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.



## ఘనంగా చట్ వేడుకలు

**కుత్బుల్లాపూర్/ప్రజాపక్షం :** జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని రింగ్‌బస్తీ, మగ్దూమ్‌నగర్, బిహార్ బస్తీలో మంగళవారం యుపి బీహార్ సోదరులు ఘనంగా ఛట్‌ఘాట్ పూజా వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ యూపీ బీహార్ సోదరులకు ఆ భగవంతుడి ఆశీస్సులు ఎల్లప్పుడు ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పాపుల్‌గౌడ్, సాయిలు యాదవ్, శ్రీధర్, మహంకాళి, సాంబయ్య, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనం నడిపితే జైలు శిక్ష

**ప్రజాపక్షం/బంట్వారం:** మద్యం సేవించి వాహనం నడిపితే జైలు శిక్ష తప్పదని స్థానిక ఎస్ఐ విమల మంగళవారం అన్నారు. మండల కేంద్రంలో డ్రంకన్ డ్రైవ్ నిర్వహిస్తుండగా మండల కేంద్రానికి చెందిన వ్యక్తి పాలెపల్లి ఈసామోద్దిన్ తండ్రి హైమద్ మియా వయస్సు (40) బైక్ పై వస్తుండగా ఆ వ్యక్తి మద్యం సేవించినట్లు గుర్తించి అతనికి రెండు రోజులు పాటు జైలు శిక్ష, 4 వేల రూపాయలు జరిమానా విధించి పరిగి సబ్ జైలుకు పంపినట్లు ఎస్ఐ విమల పేర్కొన్నారు. డ్రంకన్ డ్రైవ్ చేసి వాహనం నడపడం వల్ల ప్రాణాలకు ఎంతో ముప్పుని, ఇంటి దగ్గర కుటుంబ సభ్యులు ఎదురుచుస్తూ ఉంటారని ప్రతి ఒక్కరు గుర్తించుకోవాలని పేర్కొన్నారు. ఇక మీదట ఎవరైన మద్యం సేవించి వాహనం నడిపితే జరిమానా విధించడంతో పాటు జైలు తప్పని సరని తెలిపారు.

### తుపాను మార్గాన్ని నిశితంగా పరిశీలిస్తూ

# అవసరమైన చర్యలు తీసుకోవాలి

### 'మోంతా'పై సమీక్షాసమావేశంలో రైల్వే జిఎం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'మోంతా' తుఫాను పరిస్థితిని ఎదుర్కోవడానికి ..రైలు కార్యకలాపాల భద్రత, కార్యాచరణ ప్రణాళికపై దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ మంగళవారం సికింద్రాబాద్ రైల్ నిలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షాసమావేశంలో అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాష్ , వివిధ శాఖలకు చెందిన ప్రధానాధిపతులతోపాటు మొత్తం సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్లు, గుంటూరు , నాందేడ్ డివిజనల్ రైల్వేమేనేజర్లు (డి.ఆర్.ఎంలు) వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. సంజయ్ కుమార్ శ్రీవాస్తవ రాబోయే 'మోంతా' తుఫాను, దృష్ట్యా అన్ని విభాగాల ప్రధానాధిపతులతోపాటు ముఖ్యంగా విజయవాడ, గుంటూరు డివిజన్లతో కూడా వివరణాత్మక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ తుఫానును ఎదుర్కోవడానికి రైల్వేలు తీసుకుంటున్న వివిధ చర్యలను సమీక్షించారు. వివిధ డిపోలలో రుతుపవనాల సంసిద్ధత కోసం చేసిన నిల్వల స్థితిని ఆయన సమీక్షించారు మరియు వివిధ ప్రదేశాలలో తగినంత నిల్వలను మోహరించాలని అధికారులను ఆదేశించారు. తుఫాను మార్గాన్ని నిశితంగా పరిశీలిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్‌డిఆర్ఎఫ్) బృందాలతో సన్నిహితంగా వ్యవహరించి, ట్రాక్, రైలు కార్యకలాపాల భద్రతను నిర్ధారించడానికి ఈ విభాగంలో రైల్వే ప్రభావిత ట్యాంకుల స్థానాన్ని పర్యవేక్షించాలని ఆయన అధికారులకు సూచించారు. ప్రభావితమయ్యే విభాగాలలో ట్రాక్‌లపై పెట్రోలింగ్ ఉండేలా చూడాలని కూడా ఆయన ఆదేశించారు. వాస్తవ సమయ సమాచారాన్ని పొందడానికి అన్ని వంతెనలు మరియు ప్రదేశాలలో స్టేషనరీ వాచ్‌మెన్‌లను కూడా నియమించాలని తెలిపారు. ముందుగా, జనరల్ మేనేజర్ సిబ్బందికి 'ఎంప్లాయీ ఆఫ్ ది మంత్' భద్రతా అవార్డులను ప్రదానం చేశారు. ఈ అవార్డు గ్రహీతలలో స్టేషన్ మాస్టర్స్, లోకో పైలట్లు, పాయింట్స్ మ్యాన్ మరియు కీ మ్యాన్ వంటి వంటి వివిధ కేటగిరిలకు చెందినవారు ఉన్నారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ అవార్డు గ్రహీతలను అభినందించారు మరియు వారి విధులను అత్యంత అంకిత భావంతో నిర్వర్తించడంలో వారి నిబద్ధతను అభినందించారు. ఈ అవార్డులు ఇతర ఉద్యోగులను మరింత అప్రమత్తంగా ఉండటానికి మరియు రైలు కార్యకలాపాలలో సురక్షితంగా ఉండేలా నిజాయితీగా పనిచేయడానికి ప్రేరేపిస్తాయని ఆయన పేర్కొన్నారు.

## పెద్ద చెరువులో చట్ పూజల్లో ఎంపి ఈటల



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** శామీర్‌పేట పెద్ద చెరువులో ఉత్తర భారతీయులు చట్ పూజలను అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. మంగళవారం చట్ పూజలు ముగింపు కార్యక్రమానికి మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ పాల్గొన్నారు. ఉత్తర భారతీయులు తమ ఆచారం ప్రకారం సూర్య నమస్కారాలు చేసుకుని ఉపవాస దీక్షలతో చట్ పూజలను అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ మాట్లాడుతూ హైద్రాబాద్ నగరం నుంచే కాకుండా బిహార్, యుపి, బెంగాల్ రాష్ట్రాల్లో ఉన్న ఉత్తర భారతీయులు చట్ పూజలను ఘనంగా జరుపుకుంటారని చెప్పారు. సూర్య భగవానుడి ఆశీర్వాదం పొందేందుకు వీరంతా పూజలు చేస్తారని అన్నారు.

ఈ కార్యక్రమంలో బిజెపి మాజీ అధ్యక్షులు విక్రమ్‌రెడ్డి, శామీర్‌పేట మాజీ ఎంపిపి చంద్రశేఖర్‌యాదవ్, మేడ్చల్ మున్సిపల్ బిజెపి అధ్యక్షురాలు శైలజ, బిజెపి నాయకులు నందారెడ్డి, రాజేశ్వర్‌గుప్త, మల్లిఖార్జున్, బీహారి సమాజం ప్రతినిధులు ప్రమోద్ శర్మ, తికదర్‌యాదవ్, బావేష్‌యాదవ్, మునిలాల్‌శర్మ, జనసేనా సమితి ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## 2028 నాటికి టిపిఆర్‌పి బలోపేతం : జిలుకర



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** రాష్ట్రంలో 2028 నాటికి తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ(టిపిఆర్‌పి)ని బలోపేతం చేస్తూనే అవినీతి లేని తెలంగాణ నిర్మాణమే లక్ష్యంగా ముందుకు సాగుతామని పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు జిలుకర రవికుమార్ అన్నారు. ఇందులోభాగంగా అన్ని జిల్లాల్లో చైతన్య రథయాత్రలు నిర్వహిస్తామని తెలిపారు. మంగళవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో టిపిఆర్‌పి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ నేత ఐఏఎస్ అధికారి కూనపరెడ్డి హరిప్రసాద్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి కల్పించడమే తమ పార్టీ ధ్యేయమన్నారు. ఇళ్లు లేని నిరుపేదలకు మాడల్ కాలనీలు నిర్మిస్తామన్నారు. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ల అమలుకు కృషిచేస్తామన్నారు. తమ పార్టీ సిద్ధాంతాలు నచ్చి, చాలామంది పార్టీలో చేరుతున్నారని తెలిపారు. సమావేశంలో టిపిఆర్‌పి నేతలు డా. సింగం శ్రీనివాసరావు, పావిల్లా సురేశ్, ప్రొ.సయ్యద్ జలాలుద్దీన్, విజయరెడ్డి, ఉదయ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## 'ఎంబిల వాటా తేల్చాలి'

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** బిసిలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్ల సాధనకు బిసి, ఎంబిసి, డిఎన్‌టి సంఘాలు సంఘ టితంగా ఉద్యమించాలని పలువురు వక్తలు సూచించారు. మంగళవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఎంబిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో అధ్యక్షులు గోగికార్ సుధాకర్ మాట్లాడుతూ 42శాతం రిజర్వేషన్లలో ఎంబిసిలకు జనాభా దామాషా ప్రకారం వాటా తేల్చాలని కోరారు. సమావేశంలో వివిధ సంఘాల నేతలు మోహన్ బైరాగి, చింతస్వామి, మన్నారం, నాగరాజు, వేణుగోపాల్, సత్తార్, జావీద్, ప్రఫుల్ రాంరెడ్డి, వీరాచారి, వేణుగోపాల్‌చారి తదితరులు పాల్గొన్నారు.

# అమరుల త్యాగాలు వెలకట్టలేనివి

### ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవీందర్



**ప్రజాపక్షం/ఘట్‌కేసర్:** పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఘట్‌కేసర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవీందర్, ఎస్సై విజయ్ కృష్ణమూర్తి, మహిపాల్ రెడ్డి, ఏఎస్ఐ తిరుపతి రెడ్డిలు అమరవీరుల ఫోటోలకు పుష్పగుచ్ఛాలు సమర్పించి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ వై రవీందర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని పోలీసులు ప్రజల రక్షణకోసం తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి సేవలందిస్తున్నారని అన్నా రు. బైపాస్‌దగ్గర ట్రాఫిక్ సిఐ రవీందర్ గట్టు మైసమ్మ ఆటో యూనియన్ డ్రైవర్లతో వారు పాటించవలసిన జాగ్రత్తల పట్ల అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపా రు. ఆటోలలో ప్యాసింజర్ ఎక్కేటప్పుడు తగ్గు జాగ్రత్త లు పాటించాలని ఓవర్ స్పీడ్ పోకుండా నెమ్మది గా నడపాలని ఆటో డ్రైవర్లకు కోరారు. ఈ కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ సీతారాం నాయక్, రవీందర్ రెడ్డి, సయ్యద్ ఇబ్రహీం, కానిస్టేబుల్ మల్లేష్, రవితేజ పాల్గొన్నారు.




**చర్లపల్లిలో :** పోలీసుల అమరవీరుల స్మారక వారోత్సవాల్లో భాగంగా కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో పలు విద్యా సంస్థల విద్యార్థులు పోలీస్ స్టేషన్ నుండి బయలుదేరి రాధిక ఎక్స్ రోడ్ వరకు ర్యాలీ నిర్వహించి పోలీసుల అమర వీరుల త్యాగాలకు సంఘీభావంగా విద్యార్థులతో మానవహారంగా ఏర్పడి అమరులకు నివాళుల ర్పించారు. కుషాయిగూడ డివిజన్లలో ఉన్న మిగతా పోలీస్ స్టేషన్ పోలీసులు, పలు స్కూల్ విద్యార్థులు పాల్గొని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపి వెంకటరమణ, కుషాయిగూడ ఏసిపి నర్సింహ రెడ్డి,సిఐ భాస్కర్‌రెడ్డి, ఎస్ఐలు సుధాకర్ రెడ్డి, వెంకన్న, శ్రీనివాస్, సాయిలు, విజయ, సతీష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**ఉప్పల్ లో :** మంగళవారం ఉప్పల్ ట్రాఫిక్ పోలీసు అధ్వర్యంలో ట్రాఫిక్ డిసిపి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఉప్పల్ చౌరస్తాలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఆటో డ్రైవర్లు, ప్రయాణికుల సమక్షంలో విధి నిర్వర్తనలో ప్రాణాలు అర్పించిన పోలీస్ అమరవీరులను స్మరించి వారికి నివాళులు అర్పించారు. ఇలాం టి మహనీయుల ఆశయాలను మనమందరం చట్టాలను గౌరవించడం ద్వారా, రోడ్డు నియమాలను కచ్చితంగా పాటించడం ద్వారా నెరవేర్చగలమని అన్నారు. ఈ సందర్భంలో అక్కడ ఉన్న వారందరినీ రోడ్డు భద్రత ప్రమాణాలపై ప్రమా ణం చేయించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ అదనపు డిసిపి లక్ష్మీ, ట్రాఫిక్ ఎసిపి శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్ జి.నాగరాజు,ఆర్ఐ జి. మల్లేష్ ఉప్పల్ ట్రాఫిక్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా రాచకొండ కమిషనర్ ఆదేశాలపై మల్కాజిగిరి డివిజన్ ఏసీపీ ఎస్.చక్రపాణి ఆధ్వర్యంలో ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధి రామంతపూర్ లో గల ఆరోరా పీజీ కాలేజీ, జవహర్ లాల్ నెహ్రూ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో సభ నిర్వహించారు.

ఈ సందర్భంగా మాట్లాడిన ఎసిపి చక్రపాణి మాట్లాడుతూ, దేశసేవ కోసం ప్రాణలు వదిలేసిన పోలీస్ అమరవీరులను స్మరించుకోవాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. ప్రజల రక్షణ కోసం పోలీసులు అనితరసాధ్యమైన సేవ చేస్తున్నారని వారి త్యాగాలను గుర్తుంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఇన్స్పెక్టర్ కె.భాస్కర్, మేడిపల్లి ఇన్స్పెక్టర్ ఆర్. గోవిందా రెడ్డి, మౌలాలి ఇన్స్పెక్టర్ సైదులు, ఉప్పల్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ వై. రామలింగారెడ్డి, ఎస్సైలు మాధవ రెడ్డి, మధు, హనుమ నాయక్, వినయ్, మహిళా ఎస్సై సమంత, ఉప్పల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.





## నష్ట పరిహారం కోసం రైల్వే ట్రిబ్యునల్‌ను ఆశ్రయించండి

### సిపిఆర్ఓ ఎ.శ్రీధర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రైల్వేలలో ప్రమాదాలకు సంబంధించి క్లెయిమ్‌ల కోసం ట్రిబ్యునల్ బెంచ్‌లలో మాత్రమే కేసులు దాఖలు చేసుకోవాలని దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఎ.శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. భారతీయ రైల్వే చట్టం, 1989 లోని సెక్షన్లు 124, 124ఎ క్రింద ప్రమాదాలు , అవాంఛనీయ సంఘటనలు, నష్టం మొదలైన వాటి వలన ప్రభావితమైన బాధితులకు త్వరగా న్యాయం అందించే లక్ష్యంతో రైల్వే క్లెయిమ్స్ ట్రిబ్యునల్ స్థాపించబడిందని ఆయన తెలిపారు.

ప్రస్తుతం, దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిమేరకు , రైల్వే క్లెయిమ్స్ ట్రిబ్యునల్ మొదటిది తెలంగాణ రాష్ట్ర ప్రాంతం కిందకు వచ్చే కేసులకు సికింద్రాబాద్‌లో ఉండగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రాంతం కిందకు వచ్చే కేసులకు రెండో ట్రిబ్యునల్ అమరావతిలో ఉంది. మహారాష్ట్ర ప్రాంతం కిందకు వచ్చే కేసులకు నాగ్‌పూర్ , ముంబైలో, కర్ణాటక రాష్ట్ర ప్రాంతం కిందకు వచ్చే కేసులకు బెంగళూరులో తన బెంచ్‌లు ఏర్పాటు చేసిందని ఆయన తెలిపారు. ఇవి ప్రజలు దాఖలు చేసిన కేసులు, వివిధ క్లెయిమ్‌లను త్వరగా పరిష్కరించడం లక్ష్యంతో పనిచేస్తున్నాయన్నారు. రైల్వే చట్టంలోని సెక్షన్ 124, 124ఎ కింద పరిహారం కోసం దరఖాస్తుదారులు సంఘటన జరిగిన తేదీ నుండి ఒక సంవత్సరం లోపు రైల్వే క్లెయిమ్స్ ట్రిబ్యునల్ ముందు సంఘటన జరిగిన సంబంధిత రైల్వేలో, రైల్వే యంత్రాంగానికి వ్యతిరేకంగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

ఆదేశాలకు వ్యతిరేకంగా అప్పీళ్లు చేయదలసిన వారు బెంచ్ ఉన్న స్థలంపై అధికార పరిధి కలిగిన హైకోర్టుకు చేయవలసి ఉంటుంది.తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక మహారాష్ట్రలలో నివసించే రైలు ప్రయాణికుల కోసం, సికింద్రాబాద్, అమరావతి (గుంటూరు), బెంగళూరు, బొంబాయి,నాగ్‌పూర్‌లలో రైల్వే క్లెయిమ్స్ ట్రిబ్యునల్ బెంచ్‌లు ఉన్నాయి. కేసులను సకాలంలో పరిష్కరించడానికి, క్లెయిమ్ కేసులను త్వరగా పరిష్కరించడానికి తగిన అధికార పరిధి కలిగిన రైల్వే క్లెయిమ్స్ ట్రిబ్యునల్ బెంచ్‌లలో మాత్రమే కేసులు దాఖలు చేయాలని దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఎ.శ్రీధర్ బాధిత వ్యక్తులకు విజ్ఞప్తి చేశారు.

**రైల్వేట్రిబ్యునల్‌లో ఈ క్రింది క్లెయిమ్స్‌లు పరిష్కరిస్తారు..**

* రైల్వే ద్వారా రవాణా కోసం రైల్వేలకు అప్పగించబడిన జంతువులు లేదా వస్తువుల నష్టం, విధ్వంసం, చెడిపోవడం లేదా డెలివరీ కాకపోవడం, తక్కువ డెలివరీకి పరిహారం చెల్లించడం.
* ఛార్జీల వాపసు, సరుకు రవాణా కోసం చెల్లించిన రుసుం లేదా దానిలో కొంత భాగాన్ని తిరిగి చెల్లించడానికి సంబంధించిన క్లెయిమ్‌లు.
* సెక్షన్ 124 మరియు 124A కింద రైలు ప్రమాదాలు, ఏవైనా అవాంఛనీయ సంఘటనలలో ప్రయాణికుల మరణం, గాయాలకు పరిహారం.
* రైల్వేల కార్యనిర్వహణలో, రైలుకు లేదా ప్రయాణికులను తీసుకెళ్తున్న రైలులోని ఏదైనా భాగానికి ప్రమాదం సంభవించినప్పుడు, ఆ మేరకు అటువంటి ప్రమాదం ఫలితంగా మరణం, గాయాల వల్ల కలిగే నష్టానికి మాత్రమే రైల్వే పరిపాలన నిర్దేశించిన మేరకు పరిహారం చెల్లించడానికి బాధ్యత వహిస్తుంది.




## విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు

**ప్రజాపక్షం/వికారాబాద్ :** వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో కలెక్టర్ ప్రతీక్‌జైన్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి నిజాయితీగా ఉండాలని ప్రభుత్వ శాఖల ద్వారా చేపట్టే ప్రతి కార్యక్రమం ఎటువంటి లోపం లేకుండా బాధ్యతతో, అవినీతి రహితంగా, పారదర్శకంగా ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. అక్టోబర్ 27నుండి నవంబర్ 2వరకు విజిలెన్స్ వారోత్సవాలు నిర్వహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు ఉద్యోగంలో చేరినప్పుడు కోడ్ ఆఫ్ కండక్ట్ ప్రకారం పనిచేయాల్సి ఉంటుందన్నారు. ప్రతి శాఖ ఉద్యోగి తన పరిధిలో చేయాల్సిన సేవలు అందించాలని అన్నారు. ప్రజలకు సేవలు పొందే హక్కు ఉందని ఆయా శాఖల అధికారుల, ఉద్యోగులు అవినీతి లేకుండా ఎటువంటి ప్రతిఫలం అశించకుండా సుపరిపాలన అధించాలని అన్నారు. విజిలెన్స్‌పై అధికారులు ప్రజలకు తెలియజేయాలని అన్నారు. విధి నిర్వహణలో నిజాయితితో కూడిన సేవలను అందించడం, పారదర్శకతను పాటించడం, బాధ్యతాయుతంగా వ్యవహరించడం, ప్రభుత్వ సహాయం కోసం వచ్చే వారి హక్కులను కాపాడుతూ న్యాయసూత్రాలకు అనుగుణంగా సేవలను అందించడానికి కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ఆర్డిఓ మంగిలాల్ విజిలెన్స్ అధికారులు రఘురామ్, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## నాలుగు నెలలు దాటినా అందని బోనస్

**ప్రజాపక్షం/వికారాబాద్ :** జిల్లాలో గత యాసంగిలో పండించిన సన్నవడ్లను రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించారు. ప్రభుత్వ ప్రకటించిన మద్దతు ధరకు సంబంధించిన డబ్బులు ఖాతాలో జమ అయ్యాయి. ధాన్యం అమ్మి నాలుగు నెలలు కావస్తున్నా బోనస్ డబ్బులు మాత్రం రాలేదు, బోనస్ వస్తుందన్న ఆశతో అన్నదాతలు రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల్లో కాపాలా ఉన్నాయి. అయితే ధాన్యం విక్రయించి నాలుగు నెలలు కావస్తున్న బోనస్ జాడలేదు, వికారాబాద్ జిల్లాలో గత యాసంగి సీజన్‌లో రైతులు వరి సాగు చేశారు. వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా 8వేల పైగా మెట్రిక్ టన్నుల సన్న వడ్లు ప్రభుత్వం విక్రయించారు. రైతులు బోనస్ డబ్బుల కోసం ఎదురుచూస్తునే ఉన్నారు. ధాన్యం సేకరించి నాలుగు నెలలు దాటిన ప్రభుత్వం నుండి భోనస్‌పై ఎలాంటి ప్రకటనా లేదు , సన్న రకాల సాగును ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇస్తామన్నా బోనస్ ఒక్క సీజన్‌కే పరిమితమైంది. రబీలో సన్నవడ్లు పండించి విక్రయించిన రైతులకు ఇప్పటికే ప్రోత్సాహకం అందలేదు, అన్నదాతలు నిరాశ చెందుతున్నారు. జిల్లా రైతులు గతంలో రైతులు దొడ్డు రకాలనే ఎక్కువగా సాగు చేసేవారు. ప్రభుత్వం సన్నాలకు బోనస్ ఇస్తామనడంతో ఈ మధ్య సన్నాలవైపు మళ్లారు. సహజంగా సన్నాల కంటే దొడ్డు రకాలకే దిగుబడి ఎక్కువగా వస్తుంది. యాసంగిలో సన్నాల దిగుబడి తక్కువగా ఉంటుంది అయితే, ప్రభుత్వం బోనస్ ఇస్తామనడంతో రైతులు ఆశతో సన్నాల సాగుపై దృష్టి పెట్టారు. గత ఖరీఫ్ సీజనల్‌లో ప్రభుత్వం ఎకరాకు రూ.500 చొప్పున బోనస్ అందించింది. రబీకి సంబంధించి ఇప్పటివరకు విడుదల చేయలేదు. ఈ నేపథ్యంలో రైతులకు అందోళన చెందుతున్నారు. రబీలో నే బోనస్ ఇవ్వని సర్కార్ , 202526 ఖరీప్‌కు సంబంధించిన నిధులు విడుదల చేసినట్లు తెలుస్తుంది. వికారాబాద్ జిల్లా రైతులు రబీకి సంబంధించిన బోనస్ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరుచున్నారు. లేదు అంటే మళ్లీ దొడ్డు రకాల సాగుకు మళ్లే అవకాశాలున్నాయి. ప్రభుత్వం ప్రకటించిన బోనస్ వెంటనే విడుదల చేయాలని రైతులు,రైతుసంఘ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

## బిటి రోడ్ల నిర్మాణాలకు రూ.1.47 కోట్ల నిధులు మంజూరు

**ప్రజాపక్షం/కేశంపేట:** బిటి రోడ్ల నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1.47 కోట్ల నిధులు మంజూరు చేయడం ఎంతో అభినందనీయమని కేశంపేట మాజీ సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని నాగులగడ్డ తండాకు బిటి రోడ్డు సౌకర్యం లేక గిరిజనులు ఎన్నో అవస్థలు ఎదుర్కొంటున్నారని, వారి కల నేరవేరడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. మండల కేంద్రం నుండి షాద్‌నగర్‌కు వెళ్ళె పిడబ్ల్యు రోడ్డు నుండి నాగులగడ్డ తండా వరకు బిటిరోడ్డు నిర్మాణానికి ఎస్‌డిఎఫ్ నిధులు రూ.1.47లక్షల మంజూరు చేయించినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. మాజీ సర్పంచ్ శ్రీధర్‌రెడ్డితోపాటు బీస కరుణాకర్‌రెడ్డి, తండావాసులు ధన్యవాదాలు తెలిపారు

## పోలీసు అమరవీరులు సేవలు చిరస్మరణీయం

**ప్రజాపక్షం/హయత్ నగర్:** పోలీసు అమరవీరులు సేవలు చిరస్మరణీయం అని హయత్ నగర్ సిఐ పల్స నాగరాజ్ గౌడ్ అన్నారు. పోలీస్ స్మారక దినోత్సవం సందర్భంగా మంగళవారం హయత్‌నగర్ బస్టాండ్ నుండి పాత హ యత్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల వరకు విద్యార్థులతో కలిసి పోలీస్ సి బ్బంది సైకిల్ ర్యాలీ నిర్వహిచారు.ఈ కార్యాక్రమాన్ని ముఖ్య అతిధిగా హయత్ నగర్ సిఐ పల్స నాగరాజ్ గౌడ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా సిఐ పల్స నాగరాజ్ గౌడ్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసులకు నివాళులు అరిపంచినారు.పోలీసు అమరవీరుల స్ఫూర్తి నేటి సమాజానికి ఎంతో ఆదర్శం అని కొనియాడారు ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఎస్ఐలు,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## హైడ్రాతోనే ప్రభుత్వ ఆస్తులకు రక్షణ

హస్తినాపురం డివిజన కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్‌ఫైల్



**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకోచ్చిన హైడ్రాను ప్రభుత్వ ఆస్తులకు రక్షణ కవచంగా మారిందని హస్తినాపురం డివిజన కార్పొరేటర్, జిహెచ్‌ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యులు బానోతు సుజాత నాయక్ పేర్కొన్నారు. మంగళవారం డివిజన్‌లోని హస్తినాపురం నార్త్ ఎక్స్‌టెన్షన్ కాలనీలో సుమారు 100 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని రక్షించడంతో కాలనీ వాసులతో కలిసి ఆ స్థలంను పరిశీలించారు. గత 30 సంవత్సరాల క్రితం నాడు ప్లాట్లు చేసిన సమయంలో పార్కు కోసం కేటాయించిన 1.27 గుంటల భూమిని భూయజమానులు మాది అని కోర్టుకు వెళ్లగా, హైడ్రా అధికారులు ప్రభుత్వ భూమిని ఫెన్సింగ్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎల్‌బినగర్ నియోజకవర్గంలో ఎక్కడ లేని విధంగా పార్కును నిర్మించనున్నట్లు ఆమె తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైడ్రా తేవడం వల్ల ప్రతిపక్ష నాయకులు చేసిన కుట్రలు కుతంత్రాలు బట్టబయలు చేసి ప్రభుత్వ భూములను కాపాడుతున్నట్లు తెలిపారు. రూ.100 కోట విలువగల భూమిని స్వాధీనం చేసుకోవడంతో ఈ ప్రాంత వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. ఎల్‌బి నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మధుయాష్కీ గౌడ్‌తో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పార్కు నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, యాదయ్య గౌడ్, కొండల్‌రెడ్డి, బాలాజీ, శ్రీనివాస్ గౌడ్, రామ్‌చందర్, కాంగ్రెస్ నాయకులు దేరంగుల కృష్ణ, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, సతీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం



**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** దేశ రక్షణ కోసం, శాంతి భద్రత పరిరక్షణలో ప్రాణాలను లేక్కచేయకుండా అశువులు బాసిన అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయంగా నిలిచిపోతుందని వనస్థలిపురం ఏసిపి పి.కాశిరెడ్డి అన్నారు. మంగళవారం రాచకొండ కమిషనర్ పరిధిలో పోలీసుల వారోత్సవాలు భాగంగా వనస్థలిపురం పోలీస్ స్టేషన్ నుంచి గురుద్వార్ రోడ్డు, రైతుబజార్, గణేష్ టెంపుల్ మీదుగా సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసిపి పి. కాశిరెడ్డి మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసులను స్మరించుకోవాల్ని బాధ్యత ప్రతి పోలీసులకు ఉంటుందని ఆయన తెలిపారు. అమరవీరుల కుటుంబాలను ఆదుకోవాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందన్నారు. అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు అక్టోబర్ 21 నుంచి 31 వరకు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ టి. మహేష్ కుమార్, మీర్పేట్ ఇన్‌స్పెక్టర్ శంకర్ నాయక్, హయత్ నగర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు గౌడ్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సొంత ఖర్చులతో రోడ్డుకు మరమ్మతులు



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్ :** రోడ్డు దుస్థితిని గమనించిన యువకుడు సొంత ఖర్చులు వెచ్చించి మరమ్మతులు చేయడంతో గ్రామస్తులు అభినంధించారు. మంగళవారం ఫరూఖ్‌నగర్ మండలం కిషన్‌నగర్ గ్రామంలో గ్రామ పంచాయతీ సిసి రోడ్డు నుండి 100మీటర్లకు పైగా ఉన్న మట్టి రోడ్డుకు టిప్పర్ల ద్వారా మట్టిని పోయించి చదును చేయించారు. రోడ్డు గుంతలమయంగా కావడంతో పాటు గ్రామస్తులు, వ్యవసాయ పోలాలకు వెళ్ళె దీంతో సొంత ఖర్చులతో బిజెపి గ్రామ కమిటీ అధ్యక్షుడు, ఎస్‌సి మోర్చ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు విత్యాల నరసింహ రోడ్డుకు మరమ్మత్తులు చేశారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు నరసింహను ప్రత్యేకంగా అభినంధించారు. అదే విధంగా మహబూబ్‌నగర్ ఎంపి డికె అరుణ నిధుల నుండి రూ.2.50లక్షల నూతనంగా ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేసి ప్రారంభించిన నేపథ్యంలో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. యువ నాయకుడు గ్రామాభివృద్ధికి ఇలాంటి పనులు చేస్తుంటే ముమ్ముందు మరెన్నో పనులు చేసే అవకాశం ఉంటుందని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అవకాశం ఇచ్చేందుకు కృషి చేయాలని గ్రామస్తులు పేర్కొంటున్నారు. గ్రామాభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లప్పుడు ముందుంటానని విఠాల నరసింహ తెలిపారు.

## వీధి కుక్కల బెడద నుండి రక్షించండి

**ప్రజాపక్షం/కొందుర్గు:** వీధి కుక్కల బెడద నుండి రక్షించండి మహాప్రభో అంటూ ప్రజలు వేడుకుంటున్నారు. కొందుర్గు మండల కేంద్రంలో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రజలు, చిన్నారులు బయటకు వెళ్ళేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చికెన్, మటన్ షాపుల వద్ద వ్యర్థ పదార్థాలు ఇష్టారాజ్యంగా వేస్తుండటంతో వీధి కుక్కలు ఎక్కువగా పెరిగిపోయాయి. వీటిని నియంత్రించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని పలుమార్లు ఫిర్యాదులు చేసినా ఫలితం లేకుండా పోయిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం సమయాల్లో చిన్నారులను పాఠశాలలకు ఒంటరిగా పంపిస్తే ఏమి జరుగుతుందోననే భయంతోనే తాము వెంబడి పెట్టుకొని తీసుకువెళ్ళాల్సి వస్తుందని తల్లిదండ్రులు వాపోయారు. ఇదిలా ఉంటే రోడ్డుపై వచ్చే వాహనాలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయని, వీటితో ప్రమాదాలు చోటు చేసుకోవడమే కాకుండా ప్రాణాలు సైతం గాలిలోకి వెళ్తున్నాయని వారు వాపోతున్నారు. చీకటి పడితే చాలు వాహనాల వెంబడి, మనుషుల వెంబడి పడుతున్నాయని, ఒక్కరు షాపులకు వెళ్ళాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వెళ్ళాల్సి వస్తుందని అంటున్నారు. వీధి కుక్కల వల్ల చిన్నారులకు, పెద్దకు రేబిస్ లాంటి వ్యాధులు సోకుతాయని, వీటిని నియంత్రించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. సుప్రీంకోర్టు నిబంధనల మేరకు అధికార యంత్రాంగం వీధి కుక్కలను నియంత్రించేందుకు కృషి చేయాలని ప్రజలు పేర్కొంటున్నారు.



# ఆస్తిపన్ను సమస్యలకు ఆన్‌లైన్‌లో పరిష్కారం

- సరికొత్త సంస్కరణలకు శ్రీకారం చుట్టిన బల్దియా
- గృహాల నుంచి వాణిజ్య భవనాలుగా మారిన వాటి గుర్తింపు
- విద్యుత్ కనెక్షన్‌ల పరిశీలనలో వెలుగులోకి వాణిజ్య భవనాలు
- కేటగిరి మారడంతో జిహెచ్‌ఎంసికి పెరగనున్న ఆస్తిపన్ను ఆదాయం




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆస్తి పన్ను ద్వారా ఆదాయం మెరుగు పరుచుకునేందుకు మహానగర పాలక సంస్థ(జిహెచ్‌ఎంసి) ప్రారంభించిన పలు సంస్కరణలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. ఆస్తు పన్ను చెల్లింపులో అనేక కేటగిరులలో చెల్లింపు ఉంటాయి. వాటిలో అనేక సాంకేతిక పరమైన సమస్యలతో పాటు ఇతరాత్ర ఇబ్బందులను తొలగించేందుకు జిహెచ్‌ఎంసి ఉన్నతాధికారులు పలు కీలక అంశాలపై సంస్కరనలు తీసుకొచ్చారు. అందులో భాగంగా ఆస్తి పన్ను సమస్యలను ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే పరిష్కారించే విధానాన్ని జిహెచ్‌ఎంసి అమల్లోకి తీసుకొచ్చింది. అలాగే రికార్డుల మాపింగ్ కసరత్తు కూడా మంచి ఫలితాలను ఇస్తోంది. నివాస ఆస్తుల ను వాణిజ్య వినియోగానికి మార్చుకున్న వారిని గుర్తించే ఈ ప్రక్రియలో, ఇప్పటివరకు నుంచే సవరణల ద్వారా రూ.1.3 కోట్లు వసూలు చేసినట్లు అధికారులు తెలిపారు. జిహెచ్‌ఎంసి రెవెన్యూ విభాగం వార్షిక ఆదాయం పెంపు లక్ష్యంగా, విద్యుత్ సేవా కనెక్షన్‌ల (యుఎస్‌సి) వివరాలను తెలంగాణ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ (టిఎస్‌ఎస్‌పిడిసిఎల్) రికార్డులతో సరిపోల్చి, వాణిజ్య సంస్థలు నివాస ఆస్తి పన్ను ఐడిలతో (పిటిఐఎన్)ల పన్నులు చెల్లిస్తున్నాయా అనే అంశాన్ని పరిశీలిస్తోంది. ఈ ప్రాజెక్టు తొలి దశలో జిహెచ్‌ఎంసి పరిధిలోని ఆరు జోన్‌లలో మొత్తం 97,000 నివాస పిటిఐఎన్‌లలో, వాణిజ్య విద్యుత్ కనెక్షన్లు ఉన్నట్లు గుర్తించారు. వీటిలో 88,000 మందికి ఇప్పటికే నోటీసులు జారీ చేసినట్లు అదనపు కమిషనర్ (రెవెన్యూ) అనురాగ్ జయంతి తెలిపారు. ప్రస్తుతం 100 శాతం సరిపోలిన రికార్డుల ప్రక్రియను మాత్రమే చేస్తున్నామని చెప్పారు. తర్వాతి దశలో 100 శాతం కంటే తక్కువగా సరిపోలిన రికార్డులను పరిశీలిస్తామన్నారు. క్షేత్ర స్థాయి పరిశీలనల ద్వారా ఇప్పటివరకు 1,387 ఆస్తులు వాణిజ్య వినియోగంలో ఉన్నట్లు తేలిందన్నారు. వీటిని నివాసం నుంచి వాణిజ్యంగా మార్చడం ద్వారా రూ.1.3 కోట్లు ఆదాయం వచ్చింది. ఈ ప్రక్రియను డిప్యూటీ కమిషనర్లు, సర్కిల్ స్థాయి రెవెన్యూ బృందాలు కొనసాగిస్తున్నాయని, అన్ని 97,000 ఆస్తుల పరిశీలన పూర్తయ్యాక రెండో దశకు వెళ్తామని అనురాగ్ జయంతి తెలిపారు.

## ఇండ్ల నిర్మాణంలో పురోగతికి చిత్తశుద్ధితో పనిచేయాలి

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలలో స్పష్టమైన పురోగతిని సాధించేందుకు, క్షేత్ర స్థాయిలో చిత్తశుద్ధితో పని చేయాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరం నుండి ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై, డబుల్ బెడ్రూంల పంపిణీ ప్రక్రియపై,వన మహోత్సవం ఎన్ఆర్‌ఇజిఎస్,పారిశుద్ధం, తదితర అంశాలపై కలెక్టర్ నారాయణ రెడ్డి, ఆర్‌డిఒలు, ఎంపిడిఓలు, ఎంపిఒలు, హౌసింగ్ ఎఇలు, మున్సిపల్ కమిషనర్లు,ఎపిఎమ్ లతో వివిధ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఒక్కోక్క మండలం వారీగా మంజూరైన ఇందిరమ్మ ఇండ్లు ఎన్ని,వాటిలో ఎన్ని గ్రౌండింగ్ అయ్యాయి, ఎన్ని ఇండ్లు ఏఏ దశలో నిర్మాణంలో ఉన్నాయి, ఇప్పటి వరకు గ్రౌండింగ్ జరగని ఇండ్లకు సంబంధించి లబ్ధిదారులచే పనులు ప్రారంభించేలా చేపట్టిన చర్యలు ఏమిటి తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇండ్ల నిర్మాణం ఇంకా ప్రారంభం చేయని వాటిని వెంటనే ప్రారంభించాలని, మార్క్ అవుట్ చేసిన ఇండ్లను బేస్మెంట్ లెవల్ కు తెచ్చేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు తెలిపారు. నిజమైన పేద లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్లను నిర్మాణం చేపట్టేలా చూడాలని సూచించారు. ఇండ్ల నిర్మాణాలలో వెనుకంజలో ఉన్న వివిధ మండలాల అధికారులు పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. మంజూరీలు పొందిన వారందరూ తక్షణమే ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా లబ్ధిదారులను ప్రోత్సహిస్తూ, క్షేత్రస్థాయిలో పక్కాగా పర్యవేక్షణ చేయాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఇంటి నిర్మాణం పనులు చేపట్టేలా చూడాలని, అవసరమైతే ఇందిరమ్మ కమిటీల సహకారం తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. డబుల్ బెడ్రూం ఇండ్ల కేటాయింపు ప్రక్రియను కూడా వేగవంతం చేయాలని తెలిపారు. వనమహోత్సవంపై సమీక్షిస్తూ ప్రతి గ్రామ, మునిసిపాలిటీ పరిధిలో అంగన్వాడి కేంద్రాలలో పాఠశాలల్లో ఇన్స్టిట్యూట్ లలో, వైకుంఠ ధామాలలో, పల్లె ప్రగతి పార్కుల్లో నిర్దేశించిన లక్ష్యాలను 100 శాతం పూర్తి అయ్యేలా మొక్కలు నాటాలని సూచించారు.నాటిన మొక్కలను పరిశీలించుటకు టీంలు ఏర్పాటు చేసి నవంబర్ 1వ తేది నుండి పరిశీలించడం జరుగుతుందన్నారు. నిర్దేశించిన లక్ష్యాలను 100 శాతం పూర్తి చేయని వారిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు. అదేవిధంగా ప్రధాన మంత్రి ఆవాస్ యోజనా గ్రామీణ పథకం ద్వారా చేపట్టిన ఇండ్ల నిర్మాణాలపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని పాఠశాలలో గురుకులాలలో,అంగన్వాడీ కేంద్రాల్లో త్రాగునీటి సమస్య లేకుండా చూడాలని ప్రతిరోజు పారిశుద్ధ్యం చేపట్టాలని కలెక్టర్ నారాయణ రెడ్డి సూచించారు. పాఠశాలల్లో గురుకులాలలో మరమ్మతులు చేపట్టవలసిన మరుగుదొడ్లకు మరమ్మతులు చేపట్టాలని కొత్తగా నిర్మించే దగ్గర మరుగుదొడ్లను నిర్మించాలని అందుకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమీక్షలో అదనపు కె కలెక్టర్ శ్రీనివాస్, జెడ్‌పి సిఇఒ సిహెచ్ కృష్ణారెడ్డి,జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ పిడి ఎల్. శ్రీలత,డిపిఒ వి సురేష్ మోహన్,సివిల్ సప్లై అధికారి వనజాత,విద్యా శాఖ అధికారి సుశిందర్ రావు,ఉద్యానవన శాఖ అధికారి కె సురేష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మైనారిటీ యువతకు స్వల్పకాలిక శిక్షణ

రంగారెడ్డి జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖా అధికారి కె నవీన్ కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** విద్యావంతులై నిరుద్యోగులైన మైనారిటీ యువతకు స్వల్పకాలిక శిక్షణతో పాటు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలలో అభ్యర్థులకు ఉపాధి కల్పించే అవకాశాన్ని ఉపయోగించుకోవాలని రంగారెడ్డి జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖా అధికారి కె నవీన్ కుమార్ రెడ్డి తెలిపారు. తెలంగాణ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ వైస్‌చాన్సలర్, మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు,ట్రైనింగ్,ఎంప్లాయిమెంట్ అండ్ ప్లేస్ మెంట్ ప్రోగ్రామ్'పథకంలో భాగంగా,స్వల్పకాలిక నైపుణ్యాభివృద్ధి శిక్షణలు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్రంలోని నేషనల్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎస్‌డిసి),ప్రభుత్వ అనుబంధిత, ప్రసిద్ధ శిక్షణ సంస్థల నుండి ప్రతిపాదనలు ఆహ్వానిస్తోందని ఆయన పేర్కొన్నారు. శిక్షణ సంస్థలు తమ ప్రతిపాదనలను రంగారెడ్డి జిల్లా అల్పసంఖ్యాక సంక్షేమ అధికారి,మైనారిటీ సంక్షేమ శాఖ,కార్యాలయం,కొంగరకాలన్,జిల్లా ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ కాంప్లెక్స్‌లో15 రోజుల్లోపు అంటే నవంబరు 06 లోపు సమర్పించవలసిందిగా రంగారెడ్డి జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖా అధికారి కె.నవీన్ కుమార్ రెడి పేర్కొన్నారు.

## మార్కెట్ సమస్యలు పరిష్కరించండి



**ప్రజాపక్షం/గండిపేట:** మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మంగళవారం గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్ మర్యాదపూర్వకంగా కలిసి గుడిమల్కాపూర్ మార్కెట్ సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందజేశామని ఆయన అన్నారు. ఈ సందర్భంగా స్పందించిన మంత్రి తుమ్మల నాగేశ్వరావు వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి పూర్తిగా సహకరిస్తానని అలాగే త్వరలో మార్కెట్‌ని అజీజ్ నగర్‌కి మార్చడానికి కావాల్సిన ఏర్పాట్లు చేసుకోమని భవిష్యత్తులో మంచి మార్కెట్ నిర్మించి రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూస్తానని ఆయన తెలియజేశారు . కార్యక్రమంలో వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్ , మార్కెట్ కమిటీ డైరెక్టర్ మునీర్ , శంకర్ , మధుసూదన్ రెడ్డి , తదితరులు పాల్గొన్నారు

## గ్రామీణ ప్రాంత రోడ్ల అభివృద్ధికి రూ.105కోట్లు

మున్సిపాలిటీకి రూ.18.70కోట్ల నిధులు

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** గ్రామీణ ప్రాంతాల రోడ్లను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం రూ.105కోట్ల నిధులు మంజూరు చేసిందని షాద్‌నగర్ శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్ వివరించారు. మంగళవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ షాద్‌నగర్ డివిజన్‌లోని వివిధ గ్రామాలను, మండలాలను కలుపుతూ సుమారు 140కిలో మీటర్ల మేరకు రోడ్లు వేసేందుకు ప్రభుత్వం రూ.105కోట్ల నిధులు మంజూరు చేయడం జరిగిందని వివరించారు. స్థానిక మున్సిపాలిటిని అభివృద్ధి చేసేందుకు మరో రూ.18.70కోట్ల నిధులు మంజూరు చేశారని, ఈ నిధుల ద్వారా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాష్ట్ర రాజధానికి సమీపంలో ఉన్న షాద్‌నగర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఇందుకు ప్రజలందరు సహకరించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. కొత్తూరు, షాద్‌నగర్ రెండు మున్సిపాలిటీలను ఆదర్శవంతంగా అభివృద్ధి చేసి చూపిస్తామని, మూడు ప్యాకేజీల ద్వారా సుమారు 34పనులు చేపడుతున్నట్లు వివరించారు. సిసి రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పార్కులను అభివృద్ధి చేసేందుకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. పార్కుల అభివృద్ధికి స్థలాలు ఉన్నా గత పాలకులు పూర్తిగా నిర్లక్ష్యం చేశారని, దాంతో ఎక్కడ అభివృద్ధి అక్కడే నిలిచిపోయిందని వివరించారు. పార్కుల్లో పిల్లల కోసం క్రీడా పరికరాలు, ఉదయం నడక కోసం వాకర్లను ఏర్పాటు చేయడంతోపాటు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. ఒక్కో కిలోమీటర్‌కు రూ.75లక్షల చొప్పున రహదారుల నిర్మాణాలు చేపడుతున్నామని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నప్పటికి అభివృద్ధి విషయంలో వెనక్కి తగ్గడం లేదని వివరించారు. ఫరూక్‌నగర్ మండలంలో 12రహదారులు, కేశంపేట మండలంలో ఏడు రహదారులు, కొందుర్గు మండలంలో మూడు రహదారులు, కొత్తూరు, నందిగామ మండలాలకు ఒకొక్క రహదారి చొప్పున నిర్మాణాలు చేపట్టనున్నట్లు తెలిపారు. రహదారుల నిర్మాణాలు బాగుంటేనే ప్రాంతాలు అభివృద్ధి సాధించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, వివిధ మండలాల అధ్యక్షులు చలివేంద్రంపల్లి రాజు, జంగ నరసింహ యాదవ్, నేతలు రఘునాయక్, అగ్గనూరి బస్వం, గంగనమోని సత్తయ్యలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రజలకు పనిచేసే ప్రభుత్వం

ఎల్‌బి నగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మధుయాష్కీ గౌడ్



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే ప్రజలకు పనులు చేసే ప్రభుత్వం అని టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపి, ఎల్‌బి నగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మధుయాష్కీ గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం బిఎన్ రెడ్డి నగర్ డివిజన్‌లోని సౌబాగ్య నగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన సిసి కెమెరాల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాలు ఎంఎల్‌ఏ అని చెప్పుకుని తిరిగే వ్యక్తికి ఈ శివారు 21 కాలనీల సమస్యలు కనిపించలేదని సుధీర్‌రెడ్డికి సూటిగా ప్రశ్నించారు. ఎన్నికల్లో పెద్దపెద్ద పోస్టర్‌లు వేసుకుని బిఎన్‌రెడ్డి నగర్‌లో సమస్యలు లేవని చూపించిన ఎంఎల్‌ఏ సుధీర్‌రెడ్డి, ఇన్ని సమస్యలు ఎందుకు ఉన్నాయని ప్రశ్నించారు. వర్షాలు వస్తే కాలనీలు నీటిలో మునిగిపోతున్నాయని కాలనీ వాసులు ఆందోళన చేందుతుంటే ఎంఎల్‌ఏకు కనిపిస్తలేదని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం రేవంత్‌రెడ్డి సహకారంతో ప్రతి కాలనీలకు సౌకర్యాలు కల్పించే బాధ్యత నేను తీసుకుంటంన్నానని శివారు కాలనీ ప్రజలకు బరోసా ఇచ్చారు. వరద ప్రభావం ఉన్న కాలనీలకు త్వరలోనే స్ట్రామ్ వాటర్ డ్రైన్ ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. ప్రతి కాలనీ వాసులు సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. కొంత మంది రాచకాలువను కబ్జాచేసి అక్రమించే ప్రయత్నం చేసే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చారించ్చారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం, హస్తినాపురం కార్పొరేటర్లు రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, బానోతు సుజాత నాయక్, మాజీ కార్పొరేటర్ ముద్దగోని లక్ష్మి ప్రసన్న రామ్మోహన్ గౌడ్, వనస్థలిపురం సిఐ మహేష్ కుమార్, ఎస్ఐ రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా : అరికపుడి గాంధీ



**ప్రజాపక్షం/మియాపూర్:** ప్రజా సమస్యల పరిష్కరమే ధ్యేయంగా అధికారులు పనిచేయాలని పిఏసి చైర్మన్,శేరిలింగంపల్లి ఎంఎల్ఏ అరికపుడి గాంధీ జలమండలి అధికారులకు సూచించారు. మంగళవారం హైదర్ నగర్ జలమండలి కార్యాలయంలో అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జలమండలి ఎంపి అశోక్ రెడ్డి, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ డైరెక్టర్ ఆపరేషన్స్ పి వి శ్రీధర్,సి జి ఎం నారాయణ , జనరల్ మేనేజర్లు కృష్ణ ,శ్రీనివాస్ రెడ్డి , హరిశంకర్, కార్పొరేటర్లు నార్నె శ్రీనివాసరావు,రాగం నాగేందర్ యాదవ్ ,హమీద్ పటేల్ ,దొడ్ల వెంకటేష్ గౌడ్,జగదీశ్వర్ గౌడ్,ఉప్పలపాటి శ్రీకాంత్,సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డిలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరక్కపుడి గాంధీ మాట్లాడుతూ పలు కాలనీ వాసుల నుండి వచ్చిన వినతి పత్రాలు పరిగణలోకి తీసుకొని అత్యవసర పనులపై తక్షణమే స్పందించి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని, ప్రతి ఫిర్యాదుపై స్పందించాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సూచించారు.అంతే కాకుండా పనులు చేపడుతున్న సమయంలో ప్రజలకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇక భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా డ్రైనేజీ, మంచినీటి పైపులైన్ల వ్యవస్థను ఆధునీకరించాలని అన్నారు. ప్రస్తుతం మంచినీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. సమస్యల పరిష్కారానికి శాశ్వత పరిష్కారం చేయాలని ఎమ్మెల్యే సూచించారు. కలుషిత జలాల సరఫరా లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డిజిఎంలు నారాయణ,నాగ ప్రియ,శరత్ రెడ్డి,రేందర్,మేనేజర్లు నాయకులు సంజీవరెడ్డి,నాయి నేనీ చంద్రకాంత్ రావు తదితరులు పాల్గొన్నారు.

## పాలకుల నిర్లక్ష్యంతోనే పెండింగ్‌లో ప్రాజెక్టు నిర్మాణం పనులు : కవిత

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** పాలకుల నిర్లక్ష్యంతోనే పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణం పనుల్లో తీవ్ర జాప్యం చోటు చేసుకుంటుందని తెలంగాణ రాష్ట్ర జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. మంగళవారం షాద్‌నగర్ మీదుగా మహబూబ్‌నగర్ వెళ్తున్న నేపథ్యంలో స్థానిక జాగృతి నియోజకవర్గ ఇన్‌చార్జి చీమల రమేష్ కురుమ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోట శ్రీనివాస్, మైనార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ముస్తాపాలు కలిసి ఘనంగా స్వాగతం ఫలికారు. ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణాలు చేపట్టకుండా కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వాపోయారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు సాగునీరు, తాగునీరు అందిస్తామని చెప్పి నాన్చుడు దోరణి అవలంభించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించారని, మహిళలకు ఆర్టీసి బస్సు సేవలు మినహా మిగ తా ఏ ఒక్క హామీ కూడా అమలు చేయడం లేదని పేర్కొన్నారు. జూబ్లిహిల్స్ ఎన్నికలతో ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదని, రాజకీయ పార్టీల స్వార్థం కోసమే ఎన్నికలు నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. ప్రజా సమస్యల పరిష్కా రం కోసమే జాగృతి పోరాటాలు చేయడంతోపాటు ప్రభుత్వాన్ని నిలదీయ డం జరుగుతుందని వివరించారు. ప్రజల సమస్యలను తెలుసుకునేందుకే ఈ యాత్రను ప్రారంభిస్తున్నట్లు పే ర్కొన్నారు. పాలమూరు–రంగారెడ్డి ప్రా జెక్టులను త్వరగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో జాగృతి ఆధ్వర్యంలో పోరాటాలు చేసేందుకు కార్యచరణ మొదలు పెట్టనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిసి విభాగం ప్రధాన కార్యదర్శి రాంకోటి, రాష్ట్ర అధ్యక్షుడు బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



## నవీన్ యాదవ్‌కు టిఎంపిఎస్ మద్దతు




**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపే లక్ష్యంగా ఆయనకు పూర్తి మద్దతు ఇస్తున్నట్టు తెలంగాణ ముదిరాజ్ పోరాట సమితి (టిఎంపిఎస్) రాష్ట్ర అధ్యక్షులు సుంకరబోయిన మహేశ్ ముదిరాజ్ తెలిపారు. మంగళవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో టిఎంపిఎస్ నేతలతో కలిసి ఆయన మాట్లాడుతూ బిసిల రాజ్యాధికారం కోసం పోరాడుతామన్నారు. ముదిరాజ్‌లను బిసి 'ఎ'లో కలుపాలని, ముదిరాజ్ కార్పొరేషన్‌కు రూ.1000 కోట్లు నిధులివ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. బిసి జనాభాలో అత్యధికంగా ఉన్న ముదిరాజ్‌లకు ఐదు నామినేటె పదవులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అంతకుముందు, బిసి సంక్షేమ సమితి నూతన లోగోను ఆవిష్కరించారు. సమావేశంలో టిఎంఆర్‌పిఎస్ నేతలు చిన్న రాములు, వర్కింగ్ ప్రెసిడెంట్ శేఖర్, ప్రధానకార్యదర్శి రంజిత్, మహిళా అధ్యక్షురాలు సీతామహలక్ష్మి , చెన్న రాములు, బూరం గణేశ్ యాదవ్, జోగిని రవి తదితరులు పాల్గొన్నారు.

# క్రీడ

## వెటరన్ పేసర్‌కు అత్యున్నత గౌరవం..

### 'నైట్‌హుడ్' స్వీకరించిన అండర్సన్



ఇంగ్లాండ్ వెటరన్ పేసర్ జేమ్స్ అండర్సన్‌కు అరుదైన గౌరవం లభించింది. ఫాస్ట్ బౌలర్‌గా జాతీయ జట్టుకు 21 ఏళ్ల విశేష సేవలందించిందుకు 'నైట్‌హుడ్' బిరుదును స్వీకరించాడీ లెజెండ్ విండ్సర్ క్యాస్లేలో మంగళవారం కన్నులపండువగా జరిగిన కార్యక్రమంలో బ్రిటన్ రాణి అన్నె చేతుల మీదుగా మంగళవారం అండరన్సన్ నైట్ హుడ్ మెడల్‌ను అందుకున్నాడు. భార్య, పిల్లలతో కలిసి ఈ వేడుకకు హాజరైన అతడు.. అనంతరం తాను సాధించిన 'నైట్ హుడ్' పతకాన్ని చూపిస్తూ సంబురపడిపోయాడు. ఇక నుంచి అండర్సన్ పేరు ముందు సర్ అనే పదం చేరనుంది. బ్రిటన్ మాజీ ప్రధాని రిషి సునాక్ 'నైట్‌హుడ్' అవార్డు కోసం జిమ్మీ పేరును సిఫారసు చేశారు. ఈ అవార్డుకు కన్జర్వేటివ్ పార్టీ ప్రధాని నామినేట్ చేసిన రెండో మాజీ ఆటగాడిగా అండర్సన్ గుర్తింపు సాధించాడు. 2019లో థెరిసా మే.. జెఫ్రీ బాయ్‌కాట్‌ను నైట్‌హుడ్ అవార్డుకు ఎంపిక చేసింది. ఈ అత్యున్నత గౌరవంతో తన సహచరులు ఆండ్రూ స్ట్రాస్, అలెస్టర్ కుక్‌ల సరసన చేరనున్నాడీ లెజెండ్ ఇప్పటివరకు 12 మంది ఇంగ్లాండ్ మాజీలు మాత్రమే ఈ అవార్డు అందుకున్నారు. ఇంగ్లాండ్ గొప్ప బౌలర్లలో ఒకడైన అండర్సన్ సుదీర్ఘ కెరియర్‌లో సంచలన బౌలింగ్‌తో జట్టును గెలిపించాడు. అయితే.. టెస్టు బౌలర్‌గానే ఎక్కువ ప్రభావం చూపించాడీ పొడగరి పేసర్. బాల్ క్రికెట్‌లో 704 వికెట్లతో రికార్డు సృష్టించాడు. 2015 నుంచి వన్డేలు, టీ20లు ఆడకున్నా సరే అండర్సన్ అత్యధిక వికెట్ల వీరుడిగా నిలిచాడు. వన్డేల్లో 269.. పొట్టి క్రికెట్‌లో 18 వికెట్లు పడగొట్టాడీ మాజీ పేసర్.

## నకమురాపై ప్రతీకార విజయం



చదరంగంలో అద్భుత విజయాలతో అదరగొడుతున్న దొమ్మరాజు గుకేశ్ తన వ్యక్తిత్వంతో మనసులు గెలుచుకుంటున్నాడు. 'చెస్ ఛాంపియన్స్ షోడౌన్ 2025'లో గొప్పగా రాణిస్తున్న అతడు.. ఇటీవల తనపై విజయం సాధించి అతి చేసిన అమెరికా గ్రాండ్‌మాస్టర్ హికరు నకమురాపై ప్రతీకారం తీర్చుకున్నాడు. సెయింట్ లూయిస్‌లో జరిగిన మ్యాచ్‌లో నకమురా వ్యూహాలను చిత్తు చేసిన గుకేశ్ నాలుగు పాయింట్లు సాధించాడు. మ్యాచ్ గెలుపొందిన తర్వాత.. గుకేశ్ హుందాగా ప్రవర్తించాడు. నకమురా మాదిరిగా అతడి రాజును ప్రేక్షకుల మీదకు విసరలేదతడు. సింపుల్‌గా షేక్ హ్యాండ్ ఇచ్చి.. విజేత లక్షణం ఇది అని చాటాడు గుకేశ్. ప్రస్తుతం ఆ వీడియో నెట్టింట వైరలవుతోంది.

నార్వే దిగ్గజం మాగ్నస్ కార్ల్‌సన్‌తో మ్యాచ్‌లో ఓడిన గుకేశ్ తర్వాతి పోరులో నకమురాకు చెక్ పెట్టాడు. దుందుడుకు స్వభావి అయిన అమెరికా గ్రాండ్‌మాస్టర్‌ను ఓడించి తగిన బుద్ధి చెప్పాడు. అక్టోబర్ తొలి వారంలో చెక్‌మేట్ టోర్నమెంట్‌లో తనను ఓడించిన తర్వాత కింగ్‌ను జనాల్లోకి విసిరి హద్దుమీరిన నకమురాకు ప్రశాంత వదనంతో బదులిచ్చాడు. హైలెట్ ఏంటంటే.. మ్యాచ్ పూర్తయ్యాక గుకేశ్ ఏకొంచెం కూడా హంగామా చేయలేదు.

కూల్‌గా ఉండి నకమురాకు షేక్‌హ్యాండ్ ఇచ్చాడు. జయాపజయాలతో సంబంధం లేకుండా ధ్రుఢ చిత్తంతో వ్యవహరించే గుకేశ్‌పై మాజీ గ్రాండ్‌మాస్టర్లు, అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు. గోవా వేదికగా అక్టోబర్ 30 నుంచి ప్రారంభం కానున్న చెస్ వరల్డ్ కప్‌లో గుకేశ్ భారత బృందానికి నేతృత్వం వహించనున్న విషయం తెలిసిందే. 'చదరంగం ప్రపంచకప్ పోటీల కోసం ఆతృతగా చూస్తున్నా. భారత దేశంలో ఎక్కడ చెస్ ఆడినా గొప్పగా అనిపిస్తుంది. గోవాతో అయితే నాకు ఎన్నో మధుర జ్ఞాపకాలు ఉన్నాయి. ఇక్కడ నేను కొన్ని జూనియర్ ఈవెంట్స్‌లో కూడా పాల్గొన్నాను. ఈసారి వరల్డ్ ఛాంపియన్ హోదాలో బరిలోకి దిగుతుండడం గొప్ప అనుభూతి ఇవ్వనుంది. అందుకే.. చాలా ఉత్సాహంగా ఎదురుచూస్తున్నా' అని గుకేశ్ వెల్లడించాడు. చివరిసారిగా గోవాలో అతడు 2019లో కేటగిరీ 'ఏ' చెస్ పోటీల్లో పాల్గొన్నాడు. కానీ,10వ స్థానంతో నిరాశపరిచాడు.

## పట్నా పైరేట్స్ జైత్రయాత్రకు బ్రేక్..

### క్వాలిఫయర్ 2కు దూసుకెళ్లిన తెలుగు టైటాన్స్!

ప్రో కబడ్డీ లీగ్ పన్నెండో సీజన్‌లో జోరు చూపిస్తున్న తెలుగు టైటాన్స్ క్వాలిఫయర్ 2కు దూసుకెళ్లింది. స్టార్ రైడర్ భరత్ హుడా సూపర్ 10తో రెచ్చిపోగా పటిష్టమైన పట్నా పైరేట్స్‌ను 7 పాయింట్ల తేడాతో ఓడించింది. వరుసగా ఎనిమిది విజయాలతో చెలరేగిపోతున్న పైరేట్స్ జట్టును ఢిల్లీలోని త్యాగరాజ ఇండోర్ స్టేడియంలో భరత్ చెడుగుడు ఆడుకున్నాడు. తొలి అర్ధ భాగంలోనే ఆలౌట్ అయిన టైటాన్స్ జట్టు అనూహ్యంగా పుంజుకుంది. అయితే.. పొడగరి రైడర్ అయిన అతడు ఏకంగా 23 పాయింట్లు సాధించి ఒంటిచేత్తో జట్టును గెలిపించాడు. ప్రత్యర్థి జట్టులో అయాన్ (22 పాయింట్లు) గొప్పగా పోరాడాడు. కానీ, డిఫెండర్లు రాణించకపోవడంతో నిష్క్రమించింది. ఫుల్ టైమ్‌లో పూర్తయ్యే సరికి టైటాన్స్, పైరేట్స్ 46–39తో నిలిచాయి. ఫైనల్ బెర్తు కోసం జరిగే మ్యాచ్‌లో బుధవారం పుణేరి పల్టన్‌తో టైటాన్స్ తలపడనుంది. ఈ సీజన్‌లో ఆది నుంచి అదరగొట్టిన దబాంగ్ ఢిల్లీ కేసీ ఫైనల్ చేరింది. క్వాలిఫయర్ 1 పోరులో స్కోర్లు సమం కాగా.. టై బ్రేకర్‌లో 6–4తో పుణేరి పల్టన్‌ను ఓడించి ఫైనల్ బెర్తు కైవసం చేసుకుంది.



అక్టోబర్ 31 శుక్రవారం టైటిల్ పోరు జరగనుంది. 2022లో పట్నా పైరేట్స్‌ను ఓడించి విజేతగా నిలిచిన ఢిల్లీ రెండో ట్రోఫీపై కన్నేసింది. అయితే.. ఢిల్లీకి చెక్ పెట్టే జట్టేదే క్వాలిఫయర్ 2 మ్యాచ్ ఫలితంతో తేలిపోనుంది.

### ఐదో రైడర్‌గా అయాన్

ఈ సీజన్‌లో అద్భుతంగా రాణించిన పట్నా పైరేట్స్ రైడర్ అయాన్ 300 పాయింట్ల క్లబ్‌లో చేరాడు. పీకేఎల్ వెటరన్ పర్దీప్ నర్వాల్(పీకేఎల్ 5, పీకేఎల్ 7), పవన్ షెహ్రావత్(పీకేఎల్ 7, పీకేఎల్ 8), నవీన్ కుమార్(పీకేఎల్ 7), దేవాంక్ (పీకేఎల్11) ఒకే సీజన్‌లో ఈ ఘనత సాధించిన ఐదో రైడర్‌గా గుర్తింపు సాధించాడు అయాన్.

# మహిళ

## పరిశోధనల్లో మేటి సంధ్య షెనాయ్



విజ్ఞానాన్ని, దృఢ సంకల్పాన్ని, సామాజిక బాధ్యతను ఒకటిగా చేసి, పరిశోధనలు సాగిస్తున్న సంధ్య షెనాయ్ ప్రపంచంలోనే మేటి ఆవిష్కర్తల్లో ఒకరుగా నిలుస్తున్నారు. వృథా అవుతున్న ఉష్ణం నుంచి విద్యుత్ శక్తిని తయారు చేసే ప్రక్రియను అభివృద్ధి చేసినప్పుడు, ఆమె ప్రపంచవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించారు. మంగళరూరులోని శ్రీనివాస్ విశ్వవిద్యాలయం, ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ విభాగంలో అధ్యాపకురాలిగా, పరిశోధకురాలిగా విశిష్ట సేవలు అందిస్తున్న సంధ్యకు ఇటీవలే సిఆర్‌ఎస్ పురస్కారం లభించింది. రసాయన శాస్త్రంలో అత్యుత్తమ ప్రతిభాపాటవాలు ప్రదర్శించి, విలక్షణమైన ఆవిష్కరణలు చేసిన వారి కి ఈ ప్రతిష్టాత్మక అవార్డులు అందచేస్తారు. సంధ్య ఒకవైపు వృథా అవుతున్న ఉష్ణాన్ని విద్యుత్‌గా మారుస్తూనే, మరోవైపు పర్యావరణ పరిరక్షణకు తనవింతు కృషి చేస్తున్నారు. వృథా అవుతున్న ఉష్ణాన్ని ఆమె థర్మోయులెక్ట్రిక్ పదార్థాలతో విద్యుత్తును సృష్టించడం రసాయన రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతున్నది. ఈ ఆవిష్కరణతోనే, ప్రపంచవ్యాప్తంగా ఉన్న శాస్త్రవేత్తల్లో, మొదటి రెండు శాతం మందిలో ఆమె పేరు చేరింది. థర్మోఎలక్ట్రికల్ మెటీరియల్, ఫొటోకెటాలిసిస్, నానో మెటీరియర్ సిస్టమ్స్‌పై ఆమె విస్తృత పరిశోధనలు చేస్తున్నారు. మహిళా లోకానికి మార్గదర్శకురాలిగా నిలుస్తున్నారు. భవిష్యత్తులో ఆమె మరిన్ని పరిశోధనలు, ఆవిష్కరణలతో భారత కీర్తి పతకాన్ని రెపరెపలాడిస్తారని ఆశిద్దాం.

## షోకేస్

### ఆక్రిలిక్ గోళ్లతో ప్రమాదం!

గోళ్లను అందంగా తీర్చిదిద్దేందుకు నెయిల్ పాలిష్ వేసుకోవడం పాత విధానం. ఆక్రిలిక్ (కృత్రిమ) గోళ్లు ధరించడం నేటి కొత్త ఫ్యాషన్. అయితే, వీటిని ఉపయోగించడం వల్ల దీర్ఘకాల అనారోగ్యం తప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇందుకు ఉదాహరణగా బ్రిటన్‌కు చెందిన 35 ఏళ్ల మహిళకు కేన్సర్ నిర్ధారణ కావడాన్ని పేర్కొంటున్నారు. తాజా నివేదికను అనుసరించి, గోళ్ల సుందరీకరణలో వినియోగించే రసాయనాలపై చాలా మంది మహిళలకు సరైన అవగాహన లేదు. గోళ్ల రంగుతో ఆరోగ్య సమస్యలు వస్తాయని వైద్య నిపుణులు పేర్కొంటుండగా, ఆక్రిలిక్ గోళ్లు మరింత సమస్యాత్మకంగా మారుతున్నాయి. వీటిలో ఉపయోగించిన మెథాక్రిలేట్స్ అనే రసాయన పదార్థాలు చర్మంపై దురద, అలర్జీ వంటి సమస్యలను కలిగించవచ్చు. చాలా అరుదుగా ఇవి మరింత తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీయవచ్చు. ఇది నేరుగా కేన్సర్‌కు దారితీస్తుందని చెప్పలేకపోయినా, బ్రిటిష్ మహిళ ఉదంతం కొత్త అనుమానాలకు తావిస్తున్నది. యువి క్యూరింగ్ లాంప్‌లు, గోళ్లను అతికించుకోవడానికి ఉపయోగించిన జిగురు పదార్థాలు తరచు ఉపయోగించడం వల్ల చర్మం దెబ్బతినే అవకాశం ఉంది. ఆక్రిలిక్ గోళ్ల వల్ల చర్మ కేన్సర్ వస్తుందని శాస్త్రీయంగా నిరూపించలేకపోయినప్పటికీ, జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. గోళ్ల సంరక్షణలో శుభ్రతను కాపాడడం, గోళ్లను కొంతకాలం సహజస్థితిలో ఉంచడం వంటి చర్యలను సిఫారసు చేస్తున్నారు. జెల్‌ఫ్రీ మానిక్యూర్‌లు లేదా వృక్ష ఆధారిత ఉత్పత్తులు వంటి విషరహిత (నాన్ టాక్సిక్) ప్రత్యామ్నాయాలను ఎంచుకోవచ్చని అంటున్నారు. తరచు చర్మ పరీక్షలు చేయించుకోవడం, ఏవైనా అసాధారణ మార్పులు కనిపించినప్పుడు వెంటనే చర్మ వైద్యుడు (డెర్మిటాలజిస్ట్)ను సంప్రదించడం అత్యవసరం. బ్రిటిష్ మహిళ ఘటన సౌందర్య పరిరక్షణలో ఆరోగ్యాన్ని ప్రాధాన్యంగా పరిగణించాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తోంది. అందం, ఆరోగ్యం రెండింటినీ సమతుల్యంగా ఉంచే జాగ్రత్తపూర్వక నిర్ణయాలను తీసుకోవడం అత్యంత అవసరం.



## రోజుకు ఆరు ఖర్జూరాలు

గర్భిణులు ప్రసవానికి ముందు కనీసం నాలుగు వారాల పాటు, రోజుకు ఆరు చొప్పున ఖర్జూరాలు తినడం వల్ల ఎంతో ప్రయోజనం ఉంటుంటది. తాజా పరిశోధనలను అనుసరించి, ఈ విధంగా చేసిన మహిళలు ఆసుపత్రిలో చేరినప్పుడు, ప్రసవ సంబంధమైన సమస్యలు 77 శాతం తగ్గాయి. సిజేరియన్ అవసరం 42 శాతం తగ్గింది. ఖర్జూరాల్లో సహజంగా ఉండే రసాయనాలు గర్భాశయ పనితీరును మెరుగుపరచడం, గర్భద్వారాన్ని సిద్ధం చేయడం ద్వారా ప్రసవాన్ని సులభతరంగా, తక్కువ నొప్పితో జరగించడంలో సహాయపడతాయి. ఈ సహజ పద్ధతి గర్భిణి శరీరానికి ప్రసవానికి తగిన విధంగా సిద్ధంగా ఉండేందుకు సహకరిస్తుంది. అలాగే, ఖర్జూరాలు ఫైబర్, కాల్షియం, యాంటీఆక్సిడెంట్స్ వంటి ముఖ్య పోషకాలు సమృద్ధిగా కలిగి ఉండటం ద్వారా తల్లి ఆరోగ్యానికి మేలు చేస్తాయి. గర్భధారణ చివరి కొన్ని వారాల్లో వాటిని ఆహారంలో చేర్చడం ఒక చిన్న, సహజమైన, రుచికరమైన చర్యగా పరిగణించవచ్చు. అయితే, ప్రతి గర్భధారణ వేరువేరు తీరుల్లో ఉంటుంది కాబట్టి, ఆయా శరీర తత్వాన్ని బట్టి ఆహారపు అలవాట్లు మార్చుకోవాలి. ఇందుకు వైద్యులను సంప్రదించడం అత్యవసరం. తల్లీ శిశువు ఆరోగ్యంగా ఉండాలంటే, వైద్యుల సూచనలను తప్పక పాటించాలి. ఖర్జూరాలను తినడం వంటి ప్రక్రియలు ఈ సాధారణ సహజ పద్ధతి గర్భిణులు ఆరోగ్యవంతమైన, సులభమైన ప్రసవ అనుభవం కోరుకునే వారికి ఎంతో ఉపయోగకరం కావచ్చు. ఈ విధంగా ఖర్జూరాలు ప్రసవ సహాయకంగా కాకుండా, తల్లి శక్తిని పెంచే ఆహారంగా కూడా కీలక పాత్ర పోషిస్తాయి. ఒకవేళ వీటి వల్ల లాభం కనిపించకపోయినా, నష్టం మాత్రం ఉండదని నిపుణులు అంటున్నారు.



## రాజ్యాంగం కల్పించిన ఉపాధి హక్కును కాలరాస్తున్న పాలకులు

### కార్పొరేట్‌లకు దేశ సంపదను దోచి పెట్టిన మోదీ

### ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** భారత రాజ్యాంగం కల్పించిన ఉద్యోగ, ఉపాధి హక్కును కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర పాలకులపై ఉద్యమించాలని అఖిల భారత యువజన సమాఖ్య(ఎఐవైఎఫ్) రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర అన్నారు. ఎఐవైఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా కౌన్సిల్ సమావేశం భువనగిరిలోని కార్యాలయంలో ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎల్లంకి మహేష్ అధ్యక్షతన జరిగింది. ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ కార్పొరేట్‌లకు దేశ సంపదను దోచి పెట్టిన చరిత్ర మోదీ ప్రభుత్వానిదేనన్నారు. ఎల్ఐసి సొమ్మును ఆదానికి ధారాదత్తం చేసిన బీజేపీ విధానాలు దేశానికి ప్రమాదకరమని వారు ఆరోపించారు. పేద ప్రజలు ఎల్ఐసికి రూ.33 వేల కోట్లు డిపాజిట్ చేస్తే అదానీ కంపెనీ సంక్షోభంలో ఉన్నదని వారిని ఆదుకోవడం కోసం ఎల్ఐసి వద్ద వేల కోట్ల పేద ప్రజల డబ్బులు అదానీ కంపెనీకి ఇవ్వడం మోదీ ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానం అర్థం అవుతుందని అన్నారు. మోదీ ప్రభుత్వానికి ప్రజలపై చిత్తశుద్ధి ఉంటే దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలను మూస్తూ, కార్పొరేట్‌లకు రెడ్ కార్పెట్ ఎందుకు వేస్తున్నాడో స్పష్టం చేయాలన్నారు. అందుకే ఎఐవైఎఫ్ జాతీయ స్థాయిలో యువజనులు, పౌరుల పక్షాన నిలబడి పోరాటాలు చేస్తున్నదని తెలిపారు. అలాగే సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి మా ట్లాడుతూ అవినీతి, అక్రమాలపై యువత నిరంతరం పోరాటాలు చేయా లని కోరారు. 100 సంవత్సరాల సిపిఐ త్యాగాలను యువతలోకి తీసుకెళ్లి, సమ సమాజ స్థాపనే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎఐవైఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి ఎల్లంకి మహేష్, పేరబోయిన మహేందర్ మాట్లాడారు. జిల్లాలో ఉపాధి కల్పన కేంద్రాలు నామమాత్రంగా వ్యవహరిస్తోందని చెప్పారు. ఉపాధికి అవసరమయ్యే నైపుణ్య శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి ఆయా రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల సమస్యలపై సర్వేలు నిర్వహిస్తామని తెలిపారు. ఎఐవైఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొండూరి వెంకటేష్, జిల్లా సమితి సభ్యులు ఎండీ.నయీమ్, బద్దుల శ్రీనివాస్, సుద్దాల సాయికుమార్, బెల్లి శ్రీకాంత్, నర్సింహాచారి, అలంశెట్టి వెంకటేష్, విజయ్, భాను కృష్ణ, కంబాల వెంకటేష్, తోటకూరిశ్రీకాంత్, అనంతుల నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

## 31న డిఇఒ కార్యాలయం ముట్టడి

**ప్రజాపక్షం/ములుగు:** ఈ నెల 31వ తేదీన జరిగే డిఈఓ కార్యాలయాన్ని ముట్టడిని జయప్రదం చేయాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ పిలుపునిచ్చారు. మధ్యాహ్నభోజనవంట కార్మికుల సమస్యలపై 31న జరిగే ధర్నాకు సంబంధించిన వినతిపత్రాన్ని జిల్లా ఇన్‌చార్జి విద్యాశాఖాధికారి సిద్దార్థరెడ్డికి మంగళవారం అందించారు.మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ మాట్లాడారు. వంట బిల్లులు, కోడిగుడ్ల బిల్లులు, వేతనాలు, అల్పాహారం బిల్లులు, తొమ్మిది నెలలుగా పెండింగ్‌లో ఉంటే వంటలు ఎలా చేస్తారన్నారు.పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలన్నారు.సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గున్నాల రాజకుమారి, మాలగాని కమలక్క, పొరరాధ, రేపూరి రాజేందర్‌ఉన్నారు.

## కార్పొరేట్ శక్తుల నుండి చేతివృత్తులను కాపాడాలి

### ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు

**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం:** నాయి బ్రాహ్మణ సంక్షేమ భవన నిర్మాణం కోసం కృషి చేయనున్నట్లుఎంఎల్‌ఏకూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో శేషగిరి భవన్‌లో నాయిబ్రాహ్మణ సేవా సంఘం జిల్లా మహాసభ ఉత్సాహంగా జరిగింది.ముఖ్య అతిథిగా కూనంనేని మాట్లాడారు. ఎంఎల్‌ఎ అభివృద్ధి నిధుల్లో నుండి రూ.25 లక్షలు నాయిబ్రాహ్మణ సేవా సంఘం భవనం కోసం కేటాయించినట్లు చెప్పారు. తరతరాలుగా చేతి వృత్తులను నమ్ముకుని జీవనం సాగిస్తున్న వారి బ్రతుకులపై కార్పొరేట్ కత్తి నాట్యం చేస్తుందన్నారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా మాట్లాడుతూ కార్పొరేట్ కంపెనీలు చేతి వృత్తుల్లోనికి ప్రవేశించి వివరీతమైన హంగులతో మార్కెట్లోకి వచ్చి వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్నాయని మండిపడ్డారు. సామాన్య వృత్తిదారుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు.



అదాని, అంబానీ వంటి బడా వ్యాపార వేత్తలు మంగళి వృత్తిని హైజాగ్ చేస్తూ నాయి బ్రాహ్మణులను రోజువారీ కూలీలుగా వారి సెలూన్లలో పనికిపెట్టుకుంటున్నారనిఆవేదన వ్యక్తం చేశారు. దీనిని తిప్పికొట్టేందుకు నాయిబ్రాహ్మణులంతా ఐఖ్యంగా పోరాటాలు చేయాలన్నారు. మరో ప్రక్క నాయిబ్రాహ్మణ కార్పొరేషన్ కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేలా పోరాటాలు నిర్వహించాలన్నారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తూముల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే కార్పొరేషన్ ఏర్పాటు చేసి చైర్మన్‌ను ఎంపిక చేయడంతో పాటు జిల్లాకు ఒక డైరెక్టర్‌చొప్పున నియమించాలని, రూ.200 కోట్ల నిధిని ప్రకటించాలని, విద్యుత్ బిల్లుల వేదింపులు ఆగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొమరవెల్లి రవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సంఘం నాయకులు సదానందం, నాగేశ్వరరావు, లక్ష్మణ్, రవీంధర్, నర్సింహారావు,దుర్గయ్య, వెంకటేశ్వరరావు, మణికుమార్, వెంకన్న శంకర్, శాంతారావు, వినోద్, వెంకట్రావు, శ్రీరాములు, ఉదయ్ పాల్గొన్నారు.

## వృత్తి నైపుణ్యాన్ని పెంచుకుని ఉపాధిని మెరుగు పరుచుకోవాలి

### సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్‌పాషా



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** మోటారు రంగ మెకానికులు వృత్తి నైపుణ్యాన్ని పెంచుకుని ఉపాధిని మెరుగు పరుచుకోవాలని ఎఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షులు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. స్థానిక శేషగిరి భవన్‌లో మంగళవారం జరిగిన ఎఐటియుసి అనుబంధ మోటార్ మెకానిక్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ మెకానిక్ వృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న పేద కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. మెకానిక్ రంగానికి చెందిన వారికి ప్రాధాన్యత ఇవ్వాలని, పనిముట్లు కొనుగోలు చేసుకునేందుకు వంద శాతం సబ్సిడీతో రుణాలు మంజూరు చేయాలని కోరారు. అనంతరం ఎఐటియుసి గుర్తింపు కార్డులను అందజేశారు.సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళీ, జిల్లా సమితి సభ్యులు గెద్దాడు నగేష్, యూనియన్ నాయకులు ఎండి గౌస్, ఎస్‌కే అక్బర్, అన్వర్, కృష్ణ,, శ్రీనివాస రెడ్డి, రాజ్, తాజ్, రాము తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై సిపిఐది నిరంతర పోరాటం

### సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ఈనెల 30న హుజూర్‌నగర్‌లో జరిగే జిల్లా విస్తృత కౌన్సిల్ సమావేశానికి అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ధర్మబిక్షం భవన్‌లో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో అగ్రభాగాన పోరాడి ప్రాణత్యాగాలు చేసి అనేక ప్రజా సంఘాలు నిర్మించి వారి సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు చేసిన పార్టీ సిపిఐ అని కొనియాడారు. తెలంగాణ సాయుధ పోరాటంలో పోరాడి త్యాగాలు చేసిన పార్టీ ఈ దేశంలో వంద సంవత్సరాలు పూర్తి చేసుకుని ముగింపు సభ ఖమ్మంలో డిసెంబర్ 26న ఐదు లక్షల మందితో




ఈ సభ నిర్వహించబోతుందని ఇది చరిత్రలో నిలిచిపోయే విధంగా జరపనున్నట్లు తెలిపారు. అకాల వర్షాల కారణంగా పంటలు దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ వర్షాలతో వరి పంట పడిపోవడంతోపాటు రైతులు నష్టపోయారని రైతులలో సన్న, చిన్న కారు రైతులు, కౌలు రైతులు ఎక్కువగా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.20వేలు నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాం డ్ చేశారు. హుజూర్‌నగర్ పట్టణంలో జరగబోవు జిల్లా స్థాయి మండల, పట్టణ కౌన్సిల్ సమావేశానికి సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు, శాసన మండలి సభ్యులు నెల్లికంటి సత్యం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, గన్నా చంద్రశేఖర్ పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు బూర వెంకటేశ్వర్లు, మండవ వెంకటేశ్వర్లు, ఎఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షులు దంతాల రాంబాబు, పట్టణ కమిటి సభ్యులు దంతాల పద్మరేఖ, దేశగాని హేమలత, గాలి కృష్ణ, చిట్టిప్రోలు కోటయ్య పాల్గొన్నారు.

## మొంథా తుపాన్ కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కొమ్ముభరత్



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** మొంథా తుఫాన్‌కారణంగా నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.20వేల నష్టపరిహారం చెల్లించాలని సిపిఐజిల్లాకార్యవర్గ సభ్యులు కొమ్ముభరత్ డిమాండ్‌చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలోని కామ్రేడ్ లక్ష్మణాచారిభవనంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లావ్యాప్తంగా అకాలవర్షాలకారణంగా రైతులు ఆరుగాలం పండించిన పంటచేతికొచ్చేదశలో అతివృష్టి అనావృష్టితో నష్టపోవాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. ఇటీవలకాలంలో అకాలవర్షాలు కురుస్తుండటంతో అనేకమంది రైతులు పంటపొలాలు నేలకు పడిపోవడం, పత్తిచేనుమీదనే మొలకలు మొలవడం జరిగిందన్నారు. వడ్డీలకు తెచ్చి పెట్టుబడిపెట్టి కౌలుతీసుకున్న రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వంద్వారా పత్తిని కొనుగోలుచేసి తేమశాతాన్ని 20శాతానికి పెంచాల్సిందిగా, అదేవిధంగా పత్తి క్వింటాల్‌కు రూ.15వేలు ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. అగ్రికల్చర్ ఆఫీసర్స్‌ద్వారా సర్వేచేయించి కచ్చితంగా రైతులను ఆదుకునేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిపిఐజిల్లా కౌన్సిల్‌సభ్యులు పి.కృష్ణాజి, ఎఐటియూసి జిల్లా ప్రధానకార్యదర్శి శివశంకర్, సిపిఐపార్టీ జిల్లాకౌన్సిల్ సభ్యులు పెరుమాలగోపాల్, ఎస్‌కె.ఖాజామైనోద్దీన్ పాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లులు చెల్లించరూ..

### భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గాజంగుల రాజు



**ప్రజాపక్షం/ ఆదిలాబాద్:** పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్స్‌లు త్వరితగతంగా పూర్తి చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గాజంగుల రాజు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని డిసిఎల్ కార్మి క శాఖ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గాజంగుల రాజు మాట్లాడుతూ 60 సంవత్సరాలు దాటిన కార్మికుడికి శాఖ ఆధ్వర్యంలో సంక్షేమ ఫలాలు అందజేయాలన్నారు. అడ్డాల వద్ద షెల్టర్లు నిర్మించాలని అన్నారు. సాధారణ మరణానికి ఐదు లక్షలు, యాక్సిడెంట్‌కు పది లక్షల ఇవ్వాలన్నారు. సిఎస్‌సి సెంటర్లను రద్దు చేయలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కీర్తి రమణ, జిల్లా సహాయ కార్యదర్శి బదర్ చౌష్, ఉపాధ్యక్షులు మహేందర్, నాగోరావు పాల్గొన్నారు.



# స్థానికం REGIONAL NEWS
మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## రైతు పండించిన ప్రతి గింజనూ కొంటాం



ప్రజాపక్షం/మాగనూర్ : రైతు పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేసేందుకే కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని పిఏసిఎస్ అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆనంద్ గౌడ్ అన్నారు. మండల పరిధిలోని గురురావ్ లింగం పల్లి లో ఐకేపి ఆధ్వర్యంలో మంగళవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకట్ రెడ్డి, ఆనంద్ గౌడ్ మాట్లాడుతూ సన్న వడ్లకు రూ. 500 బోనస్ ప్రభుత్వం కల్పిస్తుందని రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ హనుమంతు, ఐకెసి సిసి చన్ని కురుమన్న, వివో ఓబీలు అధ్యక్షురాలు లక్ష్మి, కార్యదర్శి కృష్ణమ్మ, కోశాధికారి రాధా, వివో ఎఎస్. రామలింగమ్మ, బాబు విష్ణు గ్రామ రైతులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ : వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన మొక్కజొన్న (మక్కలు) కొనుగోలు కేంద్రంను జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి మంగళవారం సందర్శించారు. మక్కలు ఎండబెట్టుకుని శుభ్రంగా తీసుకువస్తే ప్రభుత్వ మద్దతు ధర లభించునని రైతులకు కలెక్టర్ సూచన చేశారు. అనంతరం అప్పాయిపల్లి గ్రామంలో మెసర్స్ బాలాజి ఇండస్ట్రీస్ కాటన్ జిన్నింగ్ మిల్లును ఆమె సందర్శించారు. పత్తి రైతులతో కలెక్టర్ మాట్లాడుతూ తమ పత్తిని కపాస్ కిసాన్ అప్లో స్లాట్ బుక్కింగ్ చేసుకుని వస్తే సిసిఐ పత్తి కొనుగోలు చేస్తుందని తెలిపారు. పత్తిని అరబెట్టుకుని తీసుకుని వస్తే, తేమ శాతం 8 నుండి 12 శాతం ఉన్నట్లైతే మద్దతు ధరలు లభించునని రైతులకు ఆమె తెలిపారు. రైతులు తెచ్చినటువంటి పత్తిని తేమ శాతం పరిశీలించెటప్పుడు ఒకటికి నాలుగు సార్లు పరిశీలించి రైతులకు ఏలాంటి ఇబ్బంది కలగకుండా పారదర్శకంగా సిసిఐ కొనుగొళ్లు జరగాలని సూచించారు. మొంథా తుఫాను కారణంగా రేపు, ఎల్లుండి వర్షం పడే అవకాశం ఉన్నందున రైతులు కొనుగోలు కేంద్రానికి వచ్చేటప్పుడు తమ సరుకులను అరబెట్టుకుని తీసుకురావలెనని లేనిచో మద్దతు ధర లభించదని సూచించారు.

## సమాచార హక్కుతో వెలుగులోకి, మహిళా సంఘాల లోన్లు, ఉపాధి హామీ వివరాలు

ప్రజాపక్షం/ నారాయణపేట్ : సమాచార హక్కు చట్టం 2005. పరిరక్షణ ఐక్య వేదిక. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షుడు కొనింటి, నర్సిములు 2022, సం॥ నుండి సమాచారం ఇచ్చే వరకు నారాయణపేట జిల్లాలో మహిళా సంఘాలకు ప్రత్యేకంగా గ్రామాల వారీగా వారికి సంఘం బలపేతం కావడానికి మండలంలో ఎన్ని లక్షలు కొత్తగా లోన్లు ఇచ్చారు. సంఘాల వివరాలు. అలాగే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న మండలలా వారిగా ఫీల్డ్ అసిస్టెంట్లును ప్రజా వేదికలో 2021 సంవత్సరం నుండి ఎంతమంది ఫీల్డ్ అసిస్టెంట్ ల ను సస్పెండ్ కావడం జరిగింది. వారి పై తీసుకున్న చర్యలు ఏమిటి ఉపాధి హామీలో చనిపోయిన కూలీలకు ఏఏ గ్రామంలో ఏ మండలంలో ఎంత నష్టపరిహారం ఇచ్చారు. రెండు శాఖల పీడీలకు వేరు వేరు సమస్యల పై సమాచారం హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేయడం జరిగింది. కానీ సమాచారం ఇవ్వలేదు ఇట్టి విషయం పై రాష్ట్ర సమాచార కమిషనర్‌కు. ఫిర్యాదు చేశారు.

## చెంచులకు వైద్యశిబిరం ఏర్పాటు

ప్రజాపక్షం/అచ్చంపేట : అమ్రాబాద్ మండలం లింగాల మండలాల్లోని పలు చెంచుపెంటలలో పిఎంజన్మాన్ బృందం ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఇందులోభాగంగా పెంటలలోని చెంచులకు బిపి, క్షయ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. ప్రత్యేకంగా మహిళలకు రక్తహీనతతో పాటు గర్భిణీస్త్రీలు, బాలింతలకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించారు. చిన్నపిల్లలకు అలర్జీ, జ్వరపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ మోహన్‌పాల్‌నాయక్, ప్యారావైద్యసిబ్బంది, ల్యాబ్‌టెక్నిషియన్లు, హెల్త్ అసిస్టెంట్లు ఆంజనేయులు, అనంతస్వామి పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలలో కదిలే బొమ్మలతో విద్య ప్రారంభం

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ : మహబూబ్‌నగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో అంగన్వాడి కేంద్రాల్లో చిన్నారులకు కదిలే బొమ్మల (పొజెక్టర్) ద్వారా బోధన అందించే కొత్త విధానానికి శ్రీకారం చుట్టారు. విద్యా నిధి నిధులతో ఈ ప్రాజెక్టును ప్రారంభించిన ఎమ్మెల్యే మొదటగా మహబూబ్‌నగర్ నగర పాలక సంస్థ పరిధిలోని బోయపల్లి అంగన్‌వాడి సెంటర్ కు ప్రొజెక్టర్ ను అందించి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, చిన్నారులు కదిలే బొమ్మలతో చదువుకుంటూ ఆనందంగా సమయాన్ని గడుపుతున్నారని, ఈ కొత్త పద్ధతి ద్వారా అంగన్‌వాడీలలో డ్రాపౌట్స్ తగ్గే అవకాశం ఉందని తెలిపారు. ప్రొజెక్టర్ ఆధారిత బోధన వల్ల పిల్లలు ఆడుతూ పాడుతూ విద్యను గ్రహించగలరని, టీచర్లకు కూడా బోధన సులభతరం అవుతుందని చెప్పారు. ప్రస్తుతం ఈ కార్యక్రమాన్ని కొన్ని అంగన్‌వాడి కేంద్రాల్లో ప్రయోగాత్మకంగా ప్రారంభించామని, వీటి ఫలితాలను పరిశీలించిన తర్వాత మరిన్ని కేంద్రాలకు విస్తరించే ప్రణాళిక ఉందని ఎమ్మెల్యే వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రి, నాయకులు దేవేందర్ నాయక్, చర్ల శ్రీనివాసులు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు జాజిమోగ్గ నర్సింహులు, మోతిలాల్, శరత్ తదితరులు పాల్గొన్నారు.





## ఓపెన్ హౌస్ విద్యార్థుల్లో చట్టపరమైన అవగాహన వేదిక

వనపర్తి డిఎస్పీ వెంకటేశ్వరరావు

ప్రజాపక్షం / వనపర్తి : మంగళవారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ (ఫ్లాగ్ డే ) కార్యక్రమాల్లో భాగంగా వనపర్తి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమానికి వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై, వనపర్తి సీఐ కృష్ణయ్యతో కలిసి ప్రారంభించారు. వనపర్తి పట్టణంలోని వివిధ విద్యాసంస్థల నుండి దాదాపు వెయ్యిమంది విద్యార్థులు పాల్గొని పోలీసు వ్యవస్థ, చట్టపరమైన విధులు, సాంకేతిక పద్ధతులపై ప్రత్యక్ష అవగాహన పొందారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పోలీసులు కేవలం నేరస్థులను పట్టుకోవడమే కాదు సమాజంలో చట్టపరమైన అవగాహన పెంపు, భద్రతా వాతావరణం నిర్మాణంలోనూ కీలక పాత్ర పోషిస్తున్నారు. విద్యార్థులు పోలీస్ వ్యవస్థ ఎలా పనిచేస్తుందో, ప్రజల రక్షణలో పోలీసుల పాత్ర ఏంటో తెలుసుకోవాలి. సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలి అని సూచించారు. అలాగే సైబర్ మోసాల నివారణకు 1930 టోల్‌ఫ్రీ నంబర్ వినియోగం, ట్రాఫిక్ నిబంధనల పాటింపు, మహిళల భద్రత కోసం భరోసా కేంద్రం, షీ టీమ్స్, డ్రగ్స్ నియంత్రణ వంటి అంశాలపై విద్యార్థులకు సమగ్ర అవగాహన కల్పించారు. పోలీసు సిబ్బంది షీ టీమ్, భరోసా, యాంటి హ్యూమన్ ట్రాఫికింగ్, నార్కొటిక్ డ్రగ్స్, కమ్యూనికేషన్, యూనిట్లకు సంబంధించిన స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఫింగర్ ప్రింట్ పరికరాల వినియోగం, డయల్ 100 సేవలు, ప్రదర్శనలు, ప్రదర్శన విద్యార్థుల ఆసక్తిని రేపాయి. విద్యార్థుల్లో చట్టపరమైన అవగాహన పెంపు, పోలీస్ వ్యవస్థపై సానుకూల దృక్పథం కల్పించడమే లక్ష్యంగా నిర్వహించిన ఈ ఓపెన్ హౌస్ విద్యార్థుల్లో ఉత్సహాన్ని నింపగా, పోలీసు ప్రజల మధ్య అవగాహన వంతెనగా నిలిచింది. ఈ కార్యక్రమంలో వనపర్తి సీఐ కృష్ణయ్య, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి, రాంబాబు, రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ చైర్మన్, చెన్నామ్మ తామస్ షీ టీమ్ ఎస్సై అంజద్, ట్రాఫిక్ ఎస్సై సురేందర్, పట్టణ ఎస్సైలు హరిప్రసాద్, శశిధర్, షీ టీం, భరోసా, నార్కోటిక్ డ్రగ్స్, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్ అధికారులు, సిబ్బంది వివిధ కళాశాల, పాఠశాల విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పూలే అంబేద్కర్ విజ్ఞాన కేంద్రానికి శంకుస్థాపన

ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ : మహబూబ్‌నగర్ నగర్‌లోని ఆర్‌అండ్‌బి అతిథి గృహం ప్రాంగణంలో సిడిఎంఎ నిధులు 10 కోట్ల రూపాయలతో నూతనంగా నిర్మిస్తున్న పూలే అంబేద్కర్ విజ్ఞాన కేంద్రానికి మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరం నడిబొడ్డున ఉన్న ఈ ప్రాంతంలో వెజ్ నాన్ వెజ్ మార్కెట్ నిర్మించేందుకు గత ప్రభుత్వం ప్రయత్నించారని, ఇలాంటి మంచి వాతావరణంలో అత్యున్నతమైన ప్రదేశంలో అందరికి ఉపయోగపడే విధంగా ఒక నాలెడ్జ్ సెంటర్ పెట్టాలని నిర్ణయం తీసుకోవడం జరిగిందని, అందుకు ఎంతో శ్రమించామని ఆయన తెలిపారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఇప్పటివరకు ఎన్నో శంకుస్థాపనలు చేయడం జరిగిందని, కానీ ఈరోజు శంకుస్థాపన చేసినంత ఆనందం ఇప్పటి వరకు తనకు ఎప్పుడు కలగలేదని అన్నారు. అన్ని వయస్సుల వారికి ఉపయోగపడే విధంగా విజ్ఞాన కేంద్రం తీర్చిదిద్దుతామని ఆయన తెలిపారు. పూలే ఆదర్శ దంపతులను, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ను స్ఫూర్తిగా తీసుకుని పూలే అంబేద్కర్ విజ్ఞాన కేంద్రంగా నామకరణం చేయడం జరిగిందని తెలిపారు. ప్రత్యేక తరగతులు నిర్వహించుట కోసం హాల్స్ నిర్మాణం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కెరి అనిత, మధుసూదన్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు వసంత, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అమరెందర్ రాజు, సిజే బెనహర్, శ్రీనివాస్ యాదవ్, నవనీత, ఫయాజ్, పీర్ మహ్మద్ సాదిక్, చర్ల శ్రీనివాసులు, జహీర్ ఇమ్రాన్ పాల్గొన్నారు.

## 'పిఎం ధన్ ధాన్య కృషి యోజన' పథకం వార్షిక ప్రణాళిక




జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

ప్రజాపక్షం/ నారాయణపేట్ : పిఎం ధన్ ధాన్య కృషి యోజన పథకం అమలుకు వార్షిక ప్రణాళికను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో పీఎం ధన్ ధాన్య కృషి యోజన కమిటీ సభ్యుల తొలి సమావేశం నిర్వహించగా జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సహజ, సేంద్రీయ వ్యవసాయాన్ని విస్తరించడం, రైతుల ఆదాయం, గ్రామీణ జీవనోపాధికి మద్దతు ఇస్తూ స్థిరమైన వాతావరణ స్థితి స్థాపక వ్యవసాయాన్ని స్వీకరించడమే పథకం ఉదేశ్యం అని ఆమె తెలిపారు. అయితే జిల్లాలోని ఆ పథకం అమలుకు సంబంధిత శాఖల అధికారులు తమ తమ శాఖలకు సంబంధించిన వార్షిక ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. ప్రణాళిక కంటే ముందుగా జిల్లాలో ప్రస్తుత స్థితిని నిర్ధారించడానికి ఒక బేస్ లైన్ సర్వే చేపట్టాలన్నారు. ఇందులో 9 అంశాలు ఉంటాయని ఆమె తెలిపారు.

సున్నితమైన ప్రాంతాల గుర్తింపు అంశాల వారీగా క్లుప్తంగా నివేదిక తయారు చేసి అందుకు తగిన యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని కలెక్టర్ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. బేస్ లైన్ సర్వే, డయాగ్నస్టిక్ విశ్లేషణ ఆధారంగా, జిల్లా వ్యవసాయ వాతావరణ ప్రాంతం వనరులకు అనుగుణంగా సమగ్రమైన స్థిరమైన వ్యవసాయం, అనుబంధ రంగ అభివృద్ధి ప్రణాళికను సిద్ధం చేయాలని ఆమె చెప్పారు.

ఐదు సంవత్సరాల ఫలితాన్ని సాధించడానికి అవసరమైన వివిధ పథకాల భౌతిక లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆ పథకం నోడల్ అధికారి సాయి బాబా, డిఆర్డిఓ మొగులప్ప, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్ సుధాకర్, జిల్లా మత్స్య శాఖ అధికారి రహమాన్, నాబార్డ్ జల్లా మేనేజర్ షణ్ముఖ చారి, ఎల్‌డి ఎం విజయ్ కుమార్, నీటిపారుదల శాక ఈ.ఈ. బ్రహ్మానంద రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్ రెడ్డి, జిల్లా కో ఆపరేటివ్ అధికారి రమణారావు, పశుసంవర్ధక శాఖ అధికారి అనిరుద్, కేవీకు శాస్త్రవేత్తలు రాజేంద్ర కుమార్ రెడ్డి, సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను దగా చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం



ప్రజాపక్షం/మక్తల్ : అధికారంలోకి వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం 100 రోజుల్లోనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పి మోసగించిన ప్రభుత్వం హామీలను అమలు చేయకుండా మరోకసారి కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లకు ఐదు లక్షల రూపాయలు సాయం చేస్తామని చెప్పి, ఇప్పుడు మాట మార్చి రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నిన్న ఒక ప్రకటన చేయడం జరిగింది. అదేమిటంటే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్నటువంటి ఉపాధి హామీ పథకం (ఎన్‌ఆర్‌ఈజీఎస్) లో 60 వేల రూపాయలు మరుగుదొడ్డి, గృహ నిర్మాణంలో పనిచేసే కూలీల పని దినాలకు కూలి వర్తింపచేసి వారికి ఇస్తామన్న అయిదు లక్షల రూపాయలను 60 వేల రూపాయలు తగ్గించి నాలుగు లక్షల 40 వేల రూపాయలు మాత్రమే ఇస్తామని మరొక్కసారి ఈ రాష్ట్ర ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని భారతీయ జనతా పార్టీ నారాయణపేట జిల్లా ప్రధాన కార్యదర్శి బలరాం రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఐదు సంవత్సరాలలో నియోజకవర్గానికి 3500 ఇళ్ల చొప్పున రాష్ట్రం లో మొత్తం 20 లక్షల గృహాలను నిర్మిస్తామని చెప్పి వచ్చే నేలాఖరుతో రెండు సంవత్సరాల పూర్తి చేసుకుంటున్న ఈ ప్రభుత్వం నియోజకవర్గానికి 3500 కూడా పూర్తి చేయలేకపోయింది. ఇంకా మూడు సంవత్సరాలలో 20 లక్షల గృహాలను నిర్మించి ఇస్తారన్న నమ్మకం ప్రజలకు లేకుండా పోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలలో మహాలక్ష్మి పథకం 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు 2500 రూపాయలు ఇస్తామని చెప్పి అదేవిధంగా వృద్ధాప్య పెన్షన్లు 2000 నుంచి 4000 రూపాయలు , వికలాంగుల పెన్షన్ 3000 నుండి 6000 రూపాయలకు, కాలేజీ స్టూడెంట్ కి స్కూటీ లు, నిరుద్యోగ భృతి 4000 రూపాయలు, దళిత బంధు 12 లక్షల రూపాయలు, బీసీ బందు, రైతు బంధు ఈ విధంగా ఎన్నో అలవి కానీ హామీలను ఇచ్చి గద్దె నెక్కిన కాంగ్రెస్ పార్టీ వాటిని తుంగలో తొక్కి ప్రజలను వంచిస్తూ పాలన కొన సాగిస్తున్నారని అన్నారు. మూలిగే నక్క పై తాటికాయ పడ్డట్టుగా వ్యయ ప్రయాసలకు ఓర్చి లబ్ధిదారులు ఇళ్ళ నిర్మాణం చేపడుతుంటే మధ్యలో ప్రభుత్వం ఈ విధంగా నిర్ణయించడం శోచనీయమని అన్నారు. ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పాలని ఆయన కోరారు.

## ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ఇసుక రవాణా

జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్



ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ : ఇసుకతవ్వకం, రవాణాపూర్తిగా ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా జరగాలి, ఎక్కడా అవతవకలు చోటుచేసుకోరాదని, జిల్లాలో ఎక్కడైనా అక్రమ ఇసుక రవాణా జరిగితే కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదుచేయాలని జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ అధికారులను ఆదేశించారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో స్థానిక అవసరాలమేరకు ఇసుక వినియోగం పారదర్శకంగా, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా జరగాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్‌చాంబర్‌లో అదనపు కలెక్టర్ పి.అమరేందర్‌తో కలిసి జిల్లాస్థాయి స్టాండ్‌కమిటి సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఉప్పునుంతల మండలం దాసర్లపల్లి గ్రామంలో ఉన్న రెండు ఇసుకరీచ్‌లకు సంబంధించి అధికారులు సమర్పించిన నివేదికలను కలెక్టర్ పరిశీలించారు. తాడూరు మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలో కొనసాగుతున్న రీచ్‌లను కొనసాగించాలన్న ప్రతిపాదనలను కూడా ఆయన పరిశీలించారు. ఇసు రవాణా, నిల్వవిషయంలో ఎలాంటి అవతవకలు చోటు చేసుకోకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఇసుకను చట్టవిరుద్ధంగా తవ్వడంలేదా రవాణా చేయడంలో పాల్గొనేవారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని పోలీసు మైనింగ్‌శాఖ అధికారులకు సూచించారు. ప్రభుత్వ ప్రాజెక్టులు, ఇందిరమ్మ ఇండ్లు , నిర్మాణపనులకు ఇసుక కొరతరాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లామైనింగ్ అధికారి వెంకటరమణ, జిల్లానీటిపారుదల శాఖ అధికారి మురళి, జిల్లాభూగర్భజలశాఖ అధికారిణి దివ్యజ్యోతి, టిజిఎండిసి మేనేజర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

## డయాలసిస్ విభాగం క్రిటికల్ కేర్ యూనిట్ భవనంలోకి

కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశాలు




ప్రజాపక్షం/వనపర్తి : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఉన్న దయాలసిస్ విభాగాన్ని ఎం సీ హెచ్ వెనక నూతనంగా నిర్మించిన క్రిటికల్ కేర్ యూనిట్ భవనంలోకి తరలించేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం జిల్లా కేంద్రం శివారులో ఉన్న మెటర్నటీ చైల్డ్ హాస్పిటల్ ను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రి ఆవరణలో వర్షపు నీటి నిల్వను పరిశీలించిన కలెక్టర్ నిల్వ లేకుండా చేసేందుకు డ్రైనేజ్ కాలువలను నిర్మించి నీరు బయటకు వెళ్ళే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా నూతనంగా నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ యూనిట్ భవనం వెనుక వైపున ఇంకుడు గుంతలను తవ్వించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎం సి హెచ్ వద్ద ఏర్పాటు చేసిన ప్రెజర్ ఆక్సిజన్ ప్లాంట్ విభాగాన్ని పరిశీలించి వేగంగా వాడుకలోకి తీసుకురావాలని సూచించారు. ఎం సి హెచ్ తో పాటు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రుల్లో త్వరితగతిన ఆక్సిజన్ వెంటిలేటర్ సదుపాయాన్ని వాడుకలోకి తీసుకురావాలని సూచించారు. అదేవిధంగా నూతనంగా నిర్మించిన క్రిటికల్ కేర్ యూనిట్ భవనంలోకి పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని టీజీఎంఎస్ ఐడీసీ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఉన్న దయాలసిస్ విభాగం మొదటి అంతస్తులో ఉన్నందున రోగులు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాబట్టి నవంబర్ 1 నాటికి జీజీహెచ్ లో ఉన్న దయాలసిస్ విభాగాన్ని నూతనంగా నిర్మించిన క్రిటికల్ కేర్ యూనిట్ భవనంలోకి తరలించేందుకు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. టీ హబ్ రిపేరుకు గురైన బయో కెమిస్ట్రీ యంత్రాన్ని వేగంగా మరమ్మత్తులు చేయించే దిశగా చర్యలు తీసుకోవాలని సూపరిండెంట్‌కు ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి శ్రీనివాసులు, సూపరిండెంట్ రంగారావు, ప్రోగ్రామ్ ఆఫీసర్లు సాయినాథ్ రెడ్డి, పరిమళ, టిజి ఎస్ ఎమ్ డి సి ఇంజనీరింగ్ అధికారులు, ఇతర అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## ఈత వనాలను నాశనం చేసిన గుర్తు తెలియని వ్యక్తులు

ప్రజాపక్షం / పెబ్బేరు : పెబ్బేరు మండలంలోని పాతపల్లి గ్రామంలో గీత కార్మికులు వృత్తి జీవనాధారంగా తమ జీవితాలను కొనసాగిస్తున్న తరుణంలో గ్రామానికి చెందిన కొందరు గౌడ కులస్తులపై పడి రాక ఈత వనంలో చెట్లపై, చెట్లకు కట్టిన కల్లులొట్లను సోమవారం అర్ధరాత్రి తర్వాత గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈ విధంగా చేసిన వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని గౌడ కుల వృత్తి దారులకు న్యాయం చేయాలని పాత పల్లి గ్రామ గౌడ కులస్తులు సంబంధిత పోలీసు, ఎక్సైజ్ శాఖ అధికారులను కోరారు. ఈ దాడికి పాల్పడిన వారిపై పోలీసు, ఎక్సైజ్ శాఖ చట్టపరంగా చర్యలు తీసుకోనట్లయితే రాష్ట్ర పరిధిలో, జిల్లా మండల, గ్రామాల పరిధిలలో గీత కార్మికులమెకమై మా నిరసనలు తెలుపుటకు వెనకాడబోమని ఈ సందర్భంగా హెచ్చరించారు. దాడికి పాల్పడిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోని తగిన శిక్ష విధించాలని పాతపల్లి గ్రామ గౌడ కులస్తులు డిమాండ్ చేశారు.

## ఓటర్ జాబితా సరిచేయాలి : ఎమ్మార్వో

ప్రజాపక్షం/ఆత్మకూరు : ఓటరు జాబితా సరి చేయాలని ఆత్మకూరు తహశీల్దార్ షేక్ చాంద్ పాషా తెలిపారు. గత రెండు రోజులుగా సోమ, మంగళవారం రోజులలో తహశీల్దార్ కార్యాలయంలో బూతు లెవెల్ అధికారులకు శిక్షణ కార్యక్రమం కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా 2002 నుండి 2022 లో కాలానికి సంబంధించి ఓటర్ జాబితా సరి చేయాలని ఆయన సూచించారు.ఓటర్లను గుర్తించి సరిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మండల పరిధిలోని వివిధ పోలింగ్ బూతుల అధికారులు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## గంజాయికి బానిస కావొద్దు

ప్రజాపక్షం/కల్వకుర్తి : ఎంజాయ్‌పేరుతో గంజాయికి బానిసకావొద్దని తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్రప్రధాన కార్యదర్శి పల్లెనర్సింహ్మా అన్నారు. తెలంగాణభాష సంస్కృతిశాఖ సౌజన్యంతో తెలంగాణ ప్రజానాట్యమండలి బస్సు కళాజాత మంగళవారం మండలకేంద్రానికి చేరుకుంది. గంజాయి, డ్రగ్స్, మత్తుపదార్థాలపై కళాజాతబృందం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణం, గ్రామాల్లో గంజాయి, డ్రగ్స్, మత్తుపదార్థాలకు అలవాటుపడి తమ ఆరోగ్యాలను నాశనం చేసుకొని తల్లిదండ్రులకు కన్నీటిని మిగిలిస్తూ కుటుంబాలను రోడ్డున పడేస్తున్నారని అన్నారు. యువత మత్తుకు బానిసలుకాకుండా మంచిగా చదువుకొని ఉన్నతశిఖరాలను అధిరోహించాలని అన్నారు. అనంతరం తెలంగాణభాషా సాంస్కృతికశాఖ సలహామండలి సభ్యులుగా ఎన్నికైన పల్లెనర్సింహ్మాను సిపిఐజిల్లా కౌన్సిల్‌మెంబర్ డాక్టర్ చిలువేరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు బలరాంగౌడ్, డిసిసి ప్రధానకార్యదర్శి మహేందర్, సిపిఐ మండల కార్యదర్శి సారపుఅశోక్‌గౌడ్, డాక్టర్ చిలువేరుసత్యం, భూత్పూర్ శంకరయ్య, వెంకటయ్యగౌడ్, ఎన్ఎస్‌యుఐ మండల అధ్యక్షుడు గోరేటిశివ, లక్ష్మ య్య, శివగౌడ్, చింతపల్లిఅశోక్‌గౌడ్, శ్రీను,వెంకట్‌రెడ్డి, కొండలుగౌడ్, కళాజాతబృందం సభ్యులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి కరాటే పోటీలలో బెస్ట్ గ్రామర్ స్కూల్ విజయకేతనం

ప్రజాపక్షం/కొత్తకోట : ఈనెల 19 న జడ్చర్ల పట్టణంలో నిర్వహించిన జాతీయస్థాయి ఓపెన్ కరాటే ఛాంపియన్షిప్ పోటీలు జరిగాయి. ఈ పోటీలకు మన కొత్తకోట పట్టణానికి చెందిన బెస్ట్ గ్రామర్ స్కూల్ కి చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ విద్యార్థులందరూ గాడ్స్ ఆన్ వారియర్స్ షోతో ఖాన్ కరాటే అకాడమీలో శిక్షణ తీసుకుంటున్నారు. ఈ గెలుపొందిన విద్యార్థులను ఈ రోజు స్కూల్ ఆవరణలో చైర్మన్ జావేద్, విజయ్ ఈ విద్యార్థులకు జూనియర్ బ్లాక్ బెల్ట్ కుమ్మితే విభాగంలో విజయ్ కుమార్ బంగారు పథకం అందించి వారిని అభినందించడం జరిగింది. విద్యార్థులకు పథకాన్ని అందించి వారికి అభినందించడం జరిగింది. జావేద్ సార్ మాట్లాడుతూ మా స్కూల్ విద్యార్థులు ఈ విజయం సాధించడం చాలా గర్వకారణం అని గతంలో కూడా మా స్కూల్ విద్యార్థులు అంతర్జాతీయ జాతీయ స్థాయిలో ఎన్నో పథకాలు సాధించాలని వారు తెలియజేశారు. వీరికి శిక్షణ ఇచ్చినటువంటి మాస్టర్ ఇంతియాజ్ కూడా ఆరు ప్రత్యేకంగా అభినందించడం జరిగింది అని ఇంతియాజ్ తెలిపారు. వీరిని క్లబ్ ఫౌండర్ అబ్దుల్ నబీ సీనియర్ కరాటే మాస్టర్స్ జి.హరీష్ యాదవ్, జాఫర్ సాదిక్ అభినందించడం జరిగింది.

## నూతన ఎంపిడిఒగా కిషోర్ కుమార్ బాధ్యతలు

ప్రజాపక్షం/కృష్ణ : కృష్ణ మండల నూతన ఎంపిడిఒగా కిషోర్ కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గ్రూప్ 1లో ప్రతిభతో ఎంపికై గవర్నమెంట్ ట్రైనింగ్ పూర్తి చేసి అనంతరం, ప్రభుత్వం తాజాగా మండలాల వారీగా పోస్టింగ్ లు జారీ చేస్తూ కృష్ణ మండలం కు నియమించింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉత్సహం, నిబద్ధత, సేవ దృక్పథంతో పని చేస్తానని, గ్రామీణ ప్రగతి, ప్రజల సంక్షేమ పట్ల ప్రత్యేక దృష్టి సారిస్తానని ఆయన స్పష్టం చేశారు. గతంలో ఎంపిడిఒగా పనిచేస్తున్న విజయలక్ష్మి బదిలీ పై ఉట్కూర్ మండలం కు నియమించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, పంచాయతీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

కోస్గి పట్టణ అభివృద్ధి పనుల పై కలెక్టర్ సమీక్ష

ప్రజాపక్షం/ నారాయణపేట్ : కోస్గి పట్టణ సమగ్ర అభివృద్ధి కోసం కడ, టీయూఎఫ్ ఐడీసీ నుంచి మంజూరైన రూ. 350 కోట్ల నిధులతో చేపట్టే వివిధ అభివృద్ధి పనులలో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కోస్గి మున్సిపాలిటీ కార్యాలయంలో పట్టణ అభివృద్ధి పనుల పై ప్రజా ఆరోగ్య శాఖ, మున్సిపల్, రెవెన్యూ శాఖ అధికారులతో సమీక్ష జరిపారు. పట్టణంలో నిర్మించే భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, తుఫాను నీటి కాలువలు, ప్రధాన లింక్ రోడ్లు, అంతర్గత సిసి రోడ్లు, నీటి సరఫరా పైపు లైన్ల పనుల పురోగతి పై చర్చించారు. ప్రస్తుతం వాటి నిర్మాణ పనుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాన్ని మూడు జోన్లుగా విభజించి చేపడుతున్నట్లు పబ్లిక్ హెల్త్ ఈఈ విజయ్ భాస్కర్ గూగల్ మ్యాప్ తో కోస్గి పట్టణ స్వరూపం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించే మూడు జోన్ల గురించి మ్యాప్ ద్వారా కలెక్టర్ కు క్లుప్తంగా వివరించారు. అనంతరం కలెక్టర్ పట్టణంలో యుజిడి లేయింగ్ ఏరియా, డంపింగ్ యార్డ్, ప్రధాన లింక్ రోడ్లు, సైన్స్ మ్యూజియం, బీసీ కాలనీలోని పార్కుల ప్రతిపాదిత స్థలాలను పరిశీలించారు. సంపల్లి శివాలయం ఆలయ ప్రాంతాన్ని సందర్శించారు. ఇప్పటికే ప్రారంభించిన అభివృద్ధి పనులను త్వరిత గతిన పూర్తి చేయలని, ఇంకా ప్రారంభం కాని పనులను వెంటనే ప్రారంభించాలని ఈ సందర్భంగా మున్సిపల్, ప్రజా ఆరోగ్య శాఖ అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగరాజు, తహసిల్దార్ బక్క శ్రీనివాస్, ఇంజినీర్ జ్ఞానేశ్వర్, వర్క్ ఇన్స్ పెక్టర్ బాల్ రామ్ పాల్గొన్నారు.



# స్థానికం

REGIONAL NEWS

నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల




ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : చండీగఢ్‌లో జరిగిన సిపిఐ జాతీయ మహాసభలో జాతీయ కార్యదర్శిగా ఎన్నికైన పల్లా వెంకటరెడ్డి తొలిసారి నల్లగొండ సిపిఐ జిల్లా కౌన్సిల్ సమావేశానికి వచ్చిన సందర్భంగా జిల్లా సమితి ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలు కప్పి ఘనంగా సన్మానం చేశారు. జిల్లా కార్యదర్శి, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహా రెడ్డి, సీనియర్ నాయకులు మల్లేపల్లి ఆదిరెడ్డి,జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్ రెడ్డి, శ్రవణ్ కుమార్ పాల్గొన్నారు.




## ప్రజలకు సుపరిపాలన అందించాలి

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు ప్రజలకు సుపరిపాలన అందించాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాల యాల సముదాయంలోని సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహిం చిన విజిలెన్స్ అవగాహన వారోత్సవంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సేవలు సరైన రీతిలో ప్రజలకు చేరేవిధంగా అధికారులు పారదర్శకతతో, బాధ్యతగా విధులు నిర్వహించి నియమ నిబంధనలు పాటిస్తూ అర్హులైన వారిని మాత్రమే గుర్తించాలని సూచించారు. విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ శాఖ క్షేత్రస్థాయిలో అధికారులు విధి నిర్వహణలో ఏమైనా తప్పు చేసిన, లబ్ధిదారుల ఎంపికలో ఏమైనా అవకత వకలు జరిగిన లోతుగా విచారించి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుం దని తెలిపారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవం ప్రతి సంవత్సరం అక్టోబర్ 27 నుండి నవంబర్ 2 వరకు నిర్వహించబడుతుందని తెలిపారు. విజిలెన్స్ ఎన్ఫోరెన్స్‌మెంట్ శాఖ టోల్ ఫ్రీ నంబర్ 14432 గురించి ప్రజలకు తెలియ జేయాలని సూచించారు. తదుపరి విజిలెన్స్ పోస్టర్‌ను ఆవిష్కరించి అధికారు లచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె సీతారామా రావు, విజిలెన్స్ అధికారులు దశరథ, రాంబాబు, అధికారులు పాల్గొన్నారు.

## ప్రతి గడుపకు సిపిఐ వందేళ్ల చరిత్ర

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాస్




ప్రజాపక్షం/హుజూర్‌నగర్ : భారత కమ్యూనిస్టు పార్టీ వంద సంవత్సరాల చరిత్రను గడపగడపకు తీసుకెళ్లాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాస్ పార్టీ నాయకులను, కార్యకర్తలను కోరారు. మంగళవా రం హుజూర్‌నగర్‌లోని సిపిఐ కార్యాలయంలో మడిపల్లి మనోజ్ అధ్యక్షతన జరిగిన సిపిఐ మండల కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. భారత కమ్యూనిస్టు పార్టీ భారతదేశంలో మొట్ట మొదటి రాజకీయ పార్టీ అన్నారు. పార్టీ లక్ష్యం పురాతన ఫ్యూడల్ సామా జిక వ్యవస్థను రూపుమాపి దాని స్థానంలో విప్లవాత్మక మార్పులు తెచ్చి నూతన సోషలిస్టు సామాజిక వ్యవస్థను నెలకొల్పటమే లక్ష్యమన్నారు. ఖమ్మంలో డిసెంబర్ 26న జరుగుతుందని దానిని జయప్రదం చేయాలని కోరారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కొప్పోజు సూర్యనారాయణ, ధూళి పాల ధనుంజయ నాయుడులు మాట్లాడుతూ ఖమ్మం బహిరంగ సభకు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు గుండు వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి కందుల వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి మూడం ధనరాజు రెడ్డి, రైతు సంఘం నాయకులు వాసుదేవరావు, మఠంపల్లి మండల కార్యదర్శి పున్నయ్య, పడిగ పాటి సైదిరెడ్డి, చింతకాయల కనకయ్య పాల్గొన్నారు.

## రూ.20వేలు నష్టపరిహారం చెల్లించాలి

తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షుడు ప్రసాద్



ప్రజాపక్షం / కోదాడ: మండల పరిధి గ్రామా లలో గత వారం రోజు లుగా కురుస్తున్నవా నలు, గాలి ధూమారా లకు వరి పంట నేల రాలి నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యాక్షులు బొల్ల ప్రసాద్ ప్రభుత్వని డిమాండ్ చేవారు. మంగళ వారం మండల వ్యవసాయాధికారి పాలెం రజనికి రైతు సమస్యలతో కూడిన వినతి పత్రం అందించి మాట్లాడారు. మండల వ్యాప్తం సుమారు ఐదువేల ఎకరాలలో పంట నష్టం వాటిల్లిందని, నష్టపోయినరైతుకు రూ.20వేలు అందించాలన్నారు. లేని పక్షంలో తమ సంఘం తరపున ఆందోళనలు చేప ట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

## సిసిఐ కేంద్రాలలో పత్తి కొనుగోలు చేయాలి

తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం డిమాండ్

ప్రజాపక్షం/చండూరు : రైతులు ఆరుకాలం కష్టపడి పండించిన పత్తి పంటను సిసిఐ కేంద్రాలలో విక్రయించుటకు తక్షణమే సిసిఐ కేంద్రాలను ప్రారంభించి పత్తిని కొనుగోలు చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం చండూరు మండల అధ్యక్ష కార్యదర్శులు బొడ్డు వెంకటేశ్వర్లు ,బండమీది వెంకన్న డిమాండ్ చేశారు. మంగళవారం చండూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రైతులు ఇప్పటికే పత్తి పంటను ప్రైవేట్ వ్యాపరస్తులకు అడ్డికి పావుసేరుకు అమ్ముకొని తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. రైతు చేతికి పత్తి పంటవచ్చి రెండు నెలలు అవుతున్న ఇప్పటి వరకు సిసిఐ కొనుగోలు కేంద్రాలను ప్రారంభిం చకపోవడంతో దళారులకు పత్తిని తక్కువ ధరకు విక్రయించవలసి వస్తుం దని అన్నారు. సిసిఐ మద్దతు ధర 8100 ఉంటే మధ్య దళారులకు 6వేల రూపాయలకు అమ్ముకోవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. క్వింటల్ పత్తిని 8100కు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశా రు. లేనిచో రైతు సంఘం ఆధ్వరంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడుతామని హెచ్చరించారు.

## డాక్టర్ చెరుకు సుధాకర్‌పై గృహ హింస కేసు నమోదు

ప్రజాపక్షం/సూర్యాపేట : గృహ హింస కేసులో నకిరేకల్ కు చెందిన ప్రముఖ వైద్యులు, చెరుకు సుధాకర్‌తో పాటు అతని భార్య చెరుకు లక్ష్మి, కుమారుడు చెరుకు సుహాస్, మరో ఇద్దరుపై సూర్యాపేట టౌన్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు అయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నకిరేకల్ కు చెందిన చెరుకు సుధాకర్ కుమారుడు డాక్టర్ చెరుకు సుహాస్ కు సూర్యాపేట పట్టణానికి చెందిన సింధూశ్రీతో 2012లో వివాహం జరిగింది. వీరికి ఒక కుమార్తె కూడా ఉంది. అయితే ఇటీవల హాస్పటల్ లో పని చేసే మరో మహిళను గుట్టు చప్పుడు కాకుండా వివాహం చేసుకున్నట్టు తెలి సింది. ఈ విషయం భార్యకు తెలియడంతో సుహాస్‌ను నిలదీయగా నిర్ల క్ష్యంగా సమాధానం చెప్తూ ఆమెను బెదిరింపులకు గురి చేస్తున్నాడు. దీనితో ఆమె సూర్యాపేట టౌన్ పోలీసులను ఆశ్రయించడంతో డాక్టర్ చెరుకు సుధా కర్, ఆయన భార్య లక్ష్మి, కుమారుడు సుహాస్ తో పాటు మరో ఇద్దరి పై గృహహింస చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ పోలీ సులు తెలిపారు.

# ధాన్యం తడవకుండా చర్యలు

ధాన్యం కుప్పల వైపు వర్షపు నీరు రాకుండా కాలువలు తీయాలి, టార్పలిన్లు కప్పాలి

నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచన



ప్రజాపక్షం/నల్లగొండ(కట్టంగూరు) : వర్షాల నేపథ్యంలో కొనుగోలు కేంద్రాలలో ఉన్న ధాన్యం తడవకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచిం చారు. ధాన్యం కుప్పల వైపు వర్షపు నీరు రాకుండా కాలువలు తీసి నీటిని మళ్లించాలని అన్నారు. ధాన్యం తడవకుండా టార్పాలిన్లు కప్పి ఉంచాలని తెలిపారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టు కొని నాణ్యత ప్రమాణాలతో కొనుగోలు కేంద్రా లకు తీసుకురావాలని చెప్పారు.మంగళ వారం ఆమె కట్టంగూరు మండలం, ఐటిపాముల, కట్టం గూరు, రెడ్డి కాలనీలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యం తేమశాతం సరిగా ఉంటే తాలు, తరుగు వంటివి లేకుండా ఉంటే తక్షణమే కొనుగోలు చేసి మిల్లు లకు పంపించాలని ఆదేశించారు. ఎక్కడైనా హమాలీల కొరత ఉంటే ఎక్కువ మందిని ఏర్పాటు చేసి వెంటనే ధాన్యం మిల్లులకు వెళ్లేలా చూడాలని ఆదేశించారు. మొంతా తుఫాన్ దృష్ట్యా రైతులు వర్షాలు తగ్గేవరకు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకురావద్దని విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్ ,డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, డి సి ఓ పత్యా నయ్క్, జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేష్, పౌరసరఫ రాల జిల్లా మేనేజర్ గోపికృష్ణ ,నల్లగొండ ఆర్‌డిఓ వై. అశోక్ రెడ్డి, కొనుగోలు కేంద్రాల నిర్వహా కులు తదితరులు ఉన్నారు.

### విడతలవారీగా కొనుగోలు కేంద్రాలకు ధాన్యం

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : రైతులు విడతలవారీగా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే విధంగా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం ఆమె కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ధాన్యం సేకరణ పై సంబంధిత శాఖల అధికారులు, మిల్లర్లతో సమావేశం నిర్వహించారు.గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం ఆకాల వర్షాలు సవాల్ గా మారాయని,ఒకేసారి రైతులు కొనుగోలు కేంద్రాలకు మిల్లులకు ధాన్యం తీసుకురావడం వల్ల ఇబ్బందులు ఏర్పడే ప్రమాదం ఉందని, అలా కాకుండా విడతల వారీగా ధాన్యాన్ని తీసుకు వచ్చినట్లయితే కొనుగోలు కేంద్రాలతో పాటు, మిల్లులలో ఇబ్బంది కలగకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయవచ్చని చెప్పారు. ప్రత్యేకించి సన్నధాన్యం కొనుగోలు విషయంలో తేమ, ఇతర అంశాలలో రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఈ విషయంపై రైతులకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్‌పి శరత్‌చంద్ర పవర్,రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, దేవరకొండ ఏసిపి మౌనిక, డిఆర్‌డిఓ శేఖర్ రెడ్డి ,ఆర్‌డిఓలు రమణారెడ్డి ,శ్రీదేవి, డిఎస్‌పి శివరాం రెడ్డి ,రాజశేఖర్ శర్మ, డిసిఓ పత్యా నాయక్, జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశం, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ గోపికృష్ణ,జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్,రైస్ మిల్లర్ల అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, భద్రాద్రి హాజరయ్యారు.



## అధికారి, అధ్యక్షుడు కలిసి సొసైటీ సొత్తు స్వాహా

రైతు ఉత్పత్తిదారుల ఆందోళన

ప్రజాపక్షం/మోతె : రైతు ఉత్పత్తిదారుల సొసైటీ ఆఫీస్ వద్ద రైతులు, సొసైటీ సభ్యులు ఆందోళన నిర్వహించిన సంఘటన మంగళవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వారు తెలిపిన వివరాల ప్రకారం గడిచిన రెండు సంవత్సరాల క్రితం పది మంది ఆఫీసుబేరర్లను ఎన్నుకొని అధ్యక్షు లుగా బోళ్ళ మధుసూదన్ రెడ్డి పనిచేస్తుండగా పది మందితో ఏర్పడ్డ కమిటికి ఒక్కొక్కరికి రూ.4వేలు కట్టి సుమారు రూ.40వేలతో రిజిష్టర్ చేసుకోవడం జరిగిందన్నారు. జాయింట్ అకౌంట్ ద్వారా అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, కోశాధికారిగా డి రాములు పవర్‌తో బ్యాంక్ అకౌంట్‌లో సుమారు రూ.3 లక్షల 50వేలు జమ అయినాయని చెప్పారు. అట్టి డబ్బులకు లెక్కలు చెప్ప కుండా సుమారుగా నేటి వరకు రూ. 9 లక్షల 50 వేల రూపాయలు యఫ్ ఏఓ శ్రీనివాస్ రావు, సిఇఓ సతీష్‌లు అధ్యక్షులు బొక్క ఉపేందర్ రెడ్డిలు సొసైటీ సొత్తు స్వాహా చేస్తున్నారని ఆరోపిస్తూ నిరసన చేపట్టినట్లు తెలిపారు. ఇది ఏమని అడిగితే వాస్తవాలను దాచిపెట్టి ప్రశ్నించిన డైరెక్టర్లను బెదిరించి పోలీసులతో కేసులు నమోదు చేయిస్తున్నారని రైతులు మండిపడ్డారు. అడ్డగో లుగా సొసైటీ సొమ్మును కాజేస్తున్న అధ్యక్షునిపై అధికారులపై చర్యలు తీసు కోవాలని రైతులు సొసైటీ డైరెక్టర్లు వేడుకున్నారు.

## పుస్తక పఠనంతో విజ్ఞానం

నవ చేతన సంచార పుస్తకాలయం ప్రారంభించిన సిపి



ప్రజాపక్షం/యాదగిరిగుట్ట : పుస్తకాలను చదవడం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని యాదగిరిగుట్ట అసిస్టెంట్ కమిషనర్ పోలీస్ (ఏసి పి)శ్రీనివాస్ నాయుడు అన్నారు. మంగళవారం యాదగిరిగుట్టలో నవ చేతన సంచార పుస్తకాలయంను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక, సామాజిక, శాస్త్రీయ అంశాలు పిల్లలకు, కుటుంబా నికి సంబంధించిన అనేక పుస్తకాలు సమాజంలోకి తీసుకురావడంలో భాగంగా నవ చేతన విజ్ఞాన కేంద్రం చేస్తున్న కృషి అభినందనీయం అన్నా రు. సంచార పుస్తకాలయం ను ఏర్పాటు చేసి గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థు లకు అనేక పుస్తకాలు ముఖ్యంగా ఉద్యోగాలకు సంబంధించిన కాంపిటేటివ్ పుస్తకాలు కూడా ఇందులో అందుబాటులో ఉంచారన్నారు. ఇలాంటి పుస్త కాలను ప్రజలందరూ కుటుంబ సమేతంగా సందర్శించి మంచి పుస్తకాలను కొనుగోలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ సిఐ భాస్కర్, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ గోద శ్రీరాములు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బండి జంగమ్మ, కళ్లెం కృష్ణ, పేరబోయిన మహేందర్, సిపిఐ మున్సి పల్ కార్యదర్శి బబ్బూరి శ్రీధర్, నాయకులు పేరబోయిన పెంటయ్య, పేరబో యిన బంగారి మాటూరి మల్లయ్య,అరె పుష్ప, గోపగాని రాజు, కోకల రవి, మునుకుంట్ల నరసమ్మ, గుండు వెంకటేష్ అనంతుల నరసింహ, వెంకటేష్, రాములు, సత్తిబాబు, చందు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# విధులకు హాజరు కాని వారిపై చర్యలు

యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు హెచ్చరిక

ఆయుర్వేదిక్ డాక్టర్ సయ్యద్ నుస్రత్ సస్పెన్షన్

డాక్టర్ రజిని కుమారి,డాక్టర్ వీరన్నకు షోకాజ్ నోటీసులు జారీ



ప్రజాపక్షం/యాదాద్రి : ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేషెంట్లకు వైద్యాధి కారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని, అనధికారికంగా విధులకు హాజరు కాని వారిపై కఠిన చర్యలు తప్పవని యాదాద్రి భువనగిరి జిల్లా కలె క్టర్ హనుమంతరావు హెచ్చరించారు. మంగళవారం రామన్నపేట ఏరియా ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేశారు. అటెండెన్స్ రిజిస్టర్ పరిశీలించారు. మంగళవారం ఎంత మంది సిబ్బంది విధులకు హాజరు అయ్యారని రిజిస్ట ర్‌ను పరిశీలించారు. అనధికారికం గైర్హాజరైన ఆయుర్వేద డాక్టర్ సయ్యద్ నుస్రత్‌ను కలెక్టర్ సస్పెండ్ చేస్తూ, డాక్టర్ రజిని కుమారి, డాక్టర్ వీరన్నలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అనధికారికంగా విధులకు హాజరు కాని వైద్యులు, సిబ్బందిపై చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ఆసుపత్రిలో ఎమర్జెన్సీ వార్డులను కలియ తిరిగారు. వార్డులలో పరిశుభ్రంగా లేనందున శానిటేషన్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందిని హెచ్చరించారు. వైద్యులు అందరూ రోజు విధు లకు హాజరు కావాలని నిర్లక్ష్యంగా వహిస్తే కఠిన చర్యలు తప్పవు అని హెచ్చ రించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో కలెక్టర్ మాట్లాడారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో వైద్యులు మంచిగా వైద్యం అందిస్తున్నారా, సిబ్బంది ఏమైనా ఇబ్బంది పెడుతున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి ఆవరణలో వర్షం నీరు నిలువ ఉండ డంతో నీరు బయటకు వెళ్లేలా మార్గం ఏర్పాటు చేయాలని తహసీల్దార్ ఆదే శించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## క్షేత్ర సందర్శనకు వెళ్ళిన రైతులు




ప్రజాపక్షం/తుంగతుర్తి : ఆయిల్ పామ్ తోటల సాగులో మెలుకువలు తెలుసుకునేందుకు తుంగ తుర్తి, సూర్యాపేట డివిజన్ పరిధిలోని వివిధ మండలా లకు చెందిన పలువురు రైతులు మంగళవారం ఉమ్మడి ఖమ్మం జిల్లా సత్తుపల్లి, దమ్మపేట మండలాలకు క్షేత్ర సందర్శనకు వెళ్ళారు. ఇట్టి కార్యక్రమంను సూర్యాపేట డివిజన్ ఉద్యాన పట్టు పరిశ్రమ అధికారి కె స్వాతి జెండా ఊపి ప్రారంభించారు. తుంగతుర్తి, సూర్యాపేట డివిజన్ పరిధిలోని మండ లాల్లో ఆయిల్ పామ్ తోట సాగు చేయాలనుకునే రైతులు క్షేత్ర సందర్శనలో ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులతో ముఖాముఖి చర్చించారు. పంటసాగులో ఉండే కష్టన ష్టాలు, పంట దిగుబడి, పంటను అమ్ముకునే విధానాన్ని నేరుగా వారి నుండి తెలుసు కున్నారు. ఆయిల్‌పామ్ తోటలో అంతరపంటలుగా చేస్తున్న కోకో, వక్క, తమలపాకు, జాజికాయ, జాపత్రి, మిర్యాల వంటి నూతన పంటలను రైతులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ ఉద్యానవన అధికారిని స్వాతి, పతంజలి ఆయిల్‌పామ్ కంపెనీ జిల్లా మేనేజర్ శశికుమార్, ఫీల్డ్ ఆఫీసర్ అశోక్, విస్తరణ అధికారులు ముత్యం రాజు, కె రాము, అనిల్, క్షేత్ర సహాయకులు భద్రాచలం, నాగరాజు, రమేష్, కరుణా కర్, సందీప్, లింగయ్య, అశోక్, రైతులు పాల్గొన్నారు.

# ఎంజాయి పేరుతో గంజాయి వద్దే వద్దు

తెలంగాణ ప్రజా నాట్యమండలి ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహా

యువతను చైతన్యం చేస్తున్న తెలంగాణ ప్రజా నాట్యమండలి




ప్రజాపక్షం/దేవరకొండ: డ్రగ్స్‌పై అవగాహన కల్పించేందుకు ఈనెల 27 నుండి నవంబర్ 02 వరకు బస్సు కళా జాత మంగళవారం దేవరకొండ పట్టణానికి చేరింది. పట్టణంలోని బస్టాండ్ లో ప్రజ లను, యువతను చైతన్యం చేసేందుకు పాటలు, ప్రదర్శనలు, కళారూపాలతో ఆకట్టుకున్నారు. సాంస్కృతిక సలహామం డలి సభ్యులు, తెలంగాణ ప్రజా నాట్యమండలి ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహా నేతృత్వంలో 30 మంది కళాకారులు పాల్గొన్నారు. ఈ కళా జాత వివిధ విశ్వవిద్యాలయాలు, డిగ్రి, జూనియర్ కళాశాలను సంద ర్శించి తమ సాంస్కృతిక కళారూపాల ద్వారా విద్యార్థులకు గంజా యి, డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తూ ముందుకు సాగనుందని నర్సింహా తెలిపారు. ఈబస్సు జాత ఎంపిక చేసిన జిల్లాలలో, మండల కేంద్రాలు, గ్రామాల్లో సైతం సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రజలకు అవగా హన కల్పించనుందని ఈ బస్సు కళాజాతను నవంబర్ 02వ తేదిన ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలోని మంచిర్యాలలో సాయంత్రం 5 గంట లకు ముగియనుందని తెలిసి తెలియక కొంత మంది విద్యార్థులు డ్రగ్స్, గంజాయికి అలవాటుపడి వారి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్న నేపథ్యంలో కళాజాతను చేపట్టామని పల్లె నర్సింహా వివ రించారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ సిఐ వెంకట్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది, వివిధ పార్టీల నాయకులు, కళాజాత బృందం, ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్, ప్రజలు పాల్గొన్నారు.

# వేగవంతమైన సేవలు అందించినప్పుడే ప్రజల్లో నమ్మకం

జిల్లా ఎస్‌పి కె నరసింహ



ప్రజాపక్షం/సూర్యాపేట : వేగవంతమైన సేవలు అందించినప్పుడే పోలీసులపై ప్రజల్లో నమ్మకం పెరుగు తుందని జిల్లా ఎస్‌పి కె నరసింహ అన్నారు. మంగళ వారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు అధికా రుల నెలవారి సమీక్షా సమావేశం నిర్వహించి గత నెలలో జరిగిన నేరాల స్థితిగతులను సమీక్షించారు. అనంతరం కేసు దస్త్రాలను పరిశీలించి సిబ్బందికి సూచ నలు, సలహాలు అందించారు. నేర నిరూపణలో సిబ్బంది సాంకేతిక సామర్థ్యం కలిగి ఉండాలి అన్నారు. ఫిర్యాదులపై త్వరగా స్పందించి సంఘటనా స్థలానికి త్వరగా చేరుకోవాలని సూచించారు. రాత్రిళ్ళు పెట్రో లింగ్ పటిష్టంగా ఉండాలి, కేసులు పెండింగ్‌లో లేకుండా వేగంగా దర్యాప్తు చేయాలన్నారు. నేరస్తులకు త్వరగా శిక్షలు పడేలా సంబంధ కేసుల్లో వేగంగా దర్యాప్తు చేసి కోర్టులతో సమన్వయంగా పనిచేయాలని తెలిపారు. ప్రజలను, శాంతిభద్రతలకు ఇబ్బందులు కలిగించే వారిపై ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించవద్దని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిత్యం తనిఖీలు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదాలపై అవ గాహన కల్పించి రోడ్డు ప్రమాదాల ద్వార ఒక్క ప్రాణం కూడా పోకుండా సిబ్బంది పనిచేయాలని దిశా నిర్ధేశం చేశారు. స్టేషన్ హౌస్ ఆఫీసర్ పని విభాగాన్ని సమర్థ వంతంగా నిర్వహిస్తూ గత నెలలో కేసుల ధర్యాప్తు, ఇన్విస్టిగేషన్‌లో బాగా పనిచేసిన కోదాడ పట్ట ణ ఇన్‌స్పె క్టర్ శివశంకర్, సూర్యాపేట టూ టౌన్ ఎస్ఐ శివతేజ, అనంతగిరి ఎస్ఐ నవీన్ కుమార్‌లను జిల్లా ఎస్‌పి అభి నందించి, వారికి రివార్డులను అందజేశారు.

**పోలీసు వాహనాలను తనిఖీ చేసిన ఎస్‌పి**

బాధితులకు వేగవంతంగా పోలీసు సేవలు అందించ డంలో పోలీసు వాహనాలు కీలకమని ఎస్‌పి తెలిపారు. ఈ సందర్భంగా పోలీసు వాహనాలను తనిఖీ చేశారు. వాహనాలు పూర్తి కండీషన్‌లో ఉండాలని, వాటిని ఎక్కువ కాలం ఉపయోగించే విధంగా ఎప్పటికప్పుడు నాణ్యత పరిశీ లించుకోవడంతోపాటు సర్వీ సింగ్ చేయించాలని డ్రైవర్లకు సూచించారు. పూర్తి స్థాయిలో పర్యవేక్షణ చేయాలని పోలీస్ మోటర్ ట్రాన్స్‌పోర్ట్ అధికారిని ఎస్‌పి ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అడ్మిన్ అదనపు ఎస్‌పి రవీందర్ రెడ్డి, సూర్యాపేట డిఎస్‌పి ప్రసన్నకుమార్, డిసిఆర్‌బి డిఎస్‌పి రవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, డిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ హరిబాబు, ఇన్‌స్పెక్టర్లు శివశం కర్, ప్రతాప్‌లింగం, రామకృష్ణారెడ్డి, చరమందరాజు, నాగేశ్వరరావు, నరసింహారావు, రాజశేఖర్, వెంక టయ్య, సైబర్ సెల్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మి నారాయణ, ఎస్ ఐలు, ఐటి కోర్ సిబ్బంది, డిసిఆర్‌బి సిబ్బంది ఉన్నారు.

## దోషులను కఠినంగా శిక్షించాలి

ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ జిల్లా కన్వీనర్ గిరి రామ

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : తిరుమలగిరి సాగర్ మండలం ఎల్లాపురం తండాకు చెందిన కుర్రబాబు పా ర్వతిల దంపతులు జీవనోపాధి కోసం నల్లగొండలో కూలీ పనులు చేస్తూ ఉంటూ, తమ చిన్న కుమార్తెను దళారీల ద్వారా అమ్మినట్టు వెలుగులోకి వచ్చిన దారుణ సంఘటనపై జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ ఎఫ్ఐడబ్ల్యూ) జిల్లా కన్వీనర్ గిరి రామ ఆందోళన వ్యక్తం చేశారు. దళారులు గిరిజన తండాలను లక్ష్యంగా చేసుకోని ఆడపిల్లల వివక్ష,పేదరికం,అవగా హన లోపం,నిరక్షరాస్యత, ఆర్థికభారాలను ఆసరాగా చేసుకోని ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయి అని పెర్కోన్నారు.మహిళల రక్షణ, ఆడపిల్లల భద్రత పట్ల సమాజం, ప్రభుత్వం, చట్ట అమలు సంస్థలు అప్రమ త్తంగా వ్యవహరించవలసిన అవసరం ఉందన్నారు. ఈ ఘటనపై తక్షణం సమగ్ర విచారణ జరిపి, దళారీలతో పాటు దీనికి కారణమైన వారిని గుర్తించి, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక పర్యవేక్షణ కమిటీలు ఏర్పాటు చేసి గ్రామీణ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

# రీల్

## 31న చిన్ని గుండెలో పాట రిలీజ్



రామ్ పోతినేని హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఆంధ్రా కింగ్ తాలూక'. మహేష్ బాబు పి దర్శకత్వంలో మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రం నవంబర్ 28న గ్రాండ్ థియేట్రికల్ విడుదలకు సిద్ధమవుతోంది. ఫస్ట్ సింగిల్ నువ్వుంటే చాలే ద్వారా రామ్ తన సింగింగ్ డెబ్యూ చేస్తూ అందరినీ ఆకట్టుకున్నాడు. ఈ పాట ప్రేక్షకుల మనసులను దోచుకుని బిగ్గెస్ట్ మ్యూజికల్ హిట్‌గా నిలిచింది. రెండవ పాట పప్పీ షేమ్ కూడా అలరిస్తోంది. ఈ సాంగ్‌కి రామ్ స్వయంగా వాయిస్ ఇచ్చారు. 'చిన్ని గుండెలో' పాటను ఈనెల 31న రిలీజ్ చేయనున్నారు. సాంగ్‌కు సంబధించిన పోస్టర్‌లో రామ్, భాగ్యశ్రీ క్లాసిక్ లవ్ మూమెంట్ అదిరిపోయింది.

## అదే నా డ్రీం..

### 'చిట్ చాట్'లో శిల్పా శిరోద్కర్



సుధీర్ బాబు, సోనాక్షి సిన్హా ప్రధాన పాత్రలలో నటిస్తున్న సూపర్ నేచురల్ మైథలాజికల్ థ్రిల్లర్ జటాధర. ఈ పాన్‌ఇండియా ద్విభాషా చిత్రానికి వెంకట్ కళ్యాణ్, అభిషేక్ జైస్వాల్ దర్శకత్వం వహించారు. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సమర్పిస్తున్న ఈ చిత్రాన్ని ఉమేష్ కుమార్ బన్సల్, శివిన్ నారంగ్, అరుణ అగర్వాల్, ప్రేరణ అరోరా, శిల్పా సింగ్‌హల్, నిఖిల్ నందా నిర్మించారు. ఈ చిత్రంలో శిల్పా శిరోధ్కర్ కీలక పాత్ర పోషించారు. జటాధర నవంబర్ 7న హిందీ, తెలుగు భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. 'బ్రహ్మ' తర్వాత ఈ సినిమాతో మళ్లీ తెలుగులోకి వస్తున్నాను. చాలా ఆనందంగా ఉంది. ఇందులో శోభ అనే క్యారెక్టర్ కనిపిస్తాను. చాలా ఇంట్రెస్టింగ్ క్యారెక్టర్. తనకి డబ్బంటే అత్యాశ. ఎలాగైనా సరే రిచ్ అయిపోవాలి అనుకునే క్యారెక్టర్. సినిమాలో చాలా ఇంపార్టెంట్ రోల్ ప్లే చేస్తుంది. ఈ క్యారెక్టర్ ప్లే చేయడం చాలా చాలెంజింగ్‌గా అనిపించింది. ఎందుకంటే ఇలాంటి క్యారెక్టర్ నేనెప్పుడూ చేయలేదు. అయితే మా డైరెక్టర్స్ క్లియర్ విజన్, సపోర్ట్ తో ఈ క్యారెక్టర్ని చేయగలిగాను.జటాధరతో రీఎంట్రీ ఇవ్వడం చాలా ఆనందంగా ఉంది. సుధీర్ బాబుతో కలిసి వర్క్ చేయడం మంచి ఎక్స్పీరియన్స్. ఈ జనరేషన్ యాక్టర్స్ నుంచి చాలా విషయాలు నేర్చుకోవచ్చు. సుదీర్ బాబు చాలా డెడికేషన్‌తో ఈ ప్రాజెక్టు చేశారు. ఆయనతో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోవడం గుర్తుండిపోయే అనుభూతి. సుధీర్ బాబు మాకు రిలేటివ్. అయినప్పటికీ మేము చాలా ప్రొఫెషనల్‌గా ఉంటాము. సెట్‌లోకి ఎంటర్ అయిన తర్వాత మేము కేవలం యాక్టర్స్ మాత్రమే. మహేష్ బాబు మా ట్రైలర్ లాంచ్ చేయడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. ఆయన ఇండస్ట్రీ లోకి వెల్కం చెప్పడం మరింత హ్యాపీనెస్ ఇచ్చింది. పరిశ్రమ చాలా అభివృద్ధి చెందింది. కంటెంట్ పరంగా టెక్నికల్‌గా చాలా అడ్వాన్స్ అయ్యాము. ప్రస్తుతం తెలుగు సినిమా బెస్ట్ పేజ్‌లో ఉంది. జటాధరా ఇది మంచి సూపర్ నేచురల్ థ్రిల్లర్. స్టన్నింగ్ విజువల్స్ ఉంటాయి. ఎమోషన్స్ కూడా చాలా అద్భుతంగా ఉంటాయి. మంచి మ్యూజిక్ ఉంటుంది. అందరికీ కనెక్ట్ అయ్యే సినిమా ఇది. ఖచ్చితంగా ఆడియన్స్‌కి చాలా మంచి ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది. వెంకట్ అభిషేక్ చాలా క్లారిటీ ఉన్న డైరెక్టర్స్. యాక్టర్స్ నుంచి ఏం కావాలో వాళ్ళకి తెలుసు. ప్రతి యాక్టర్ నుంచి మంచి పెర్ఫార్మెన్స్‌ని రాబట్టుకున్నారు.ప్రేరణ అరోరా చాలా ఫ్యాసినేట్ ప్రొడ్యూసర్. ఈ సబ్జెక్టు చెప్తున్నప్పుడే అద్భుతంగా అనిపించింది. చాలా మంచి ప్రొడక్షన్ వాల్యూస్ తో సినిమా నిర్మించారు.సినిమా కోసం తెలుగు హిందీ అన్నిచోట్ల చాలా క్యూరియస్‌గా ఎదురుచూస్తున్నారు. ట్రైలర్ రిలీజ్ అయిన తర్వాత అంచనాలు మరింతగా పెరిగాయి. నవంబర్ 7న ఖచ్చితంగా ఒక అద్భుతమైన సినిమాని చూడబోతున్నారు. నాకు రొమాంటిక్ కామెడీలు ఇష్టం, మంచి సినిమాలు చేయడమే నా డ్రీం అని అన్నారు.

## 'మాస్ జాతర' ట్రైలర్ విడుదల



రవితేజ హీరోగా, శ్రీలీల హీరోయిన్‌గా నటించిన తాజా చిత్రం 'మాస్ జాతర' ట్రైలర్ విడుదలైంది. రైల్వే పోలీస్ అధికారిగా రవితేజ తనదైన శైలిలో ఒదిగిపోయిన తీరు కట్టిపడేసింది. ఆ ఉత్సాహం 'మాస్ జతర' ట్రైలర్ లో అడుగడుగునా కనిపించింది. భారీ యాక్షన్ సన్నివేశాలు, అదిరిపోయే పంచ్ డైలాగ్‌లతో మాస్ మహారాజా అభిమానులు కోరుకునే మాస్ విందులా ఈ ట్రైలర్ ను మలిచారు. కథానాయకుడు, ప్రతినాయకుడు మధ్య ఉత్కంఠభరితమైన సంఘర్షణ నేపథ్యంలో ట్రైలర్ ను రూపొందిన తీరు ఆకట్టుకుంది. వాణిజ్య అంశాలతో నిండిన పూర్తి స్థాయి వినోదాత్మక చిత్రం 'మాస్ జాతర' ట్రైలర్ ఉంది. నవీన్ చంద్ర మరోసారి శక్తివంతమైన ప్రతినాయక పాత్రలో మెరిసి, రవితేజను ఢీకొట్టే పాత్రలో మెప్పించారు. ట్రైలర్‌కు మరింత ఆకర్షణ, తాజాదనాన్ని జోడిస్తూ, కథానాయిక శ్రీలీల తెరపై ఎంతో అందంగా కనిపించారు. ఆమె మొదటిసారి శ్రీకాకుళం యాసలో మాట్లాడినప్పటికీ, ఆ యాసను పూర్తిగా ఆస్వాదిస్తూ అద్భుతంగా పలికిన తీరు ఆశ్చర్యపరిచింది. రవితేజ శ్రీలీల ఆన్ స్క్రీన్ కెమిస్ట్రీ, ఈ ట్రైలర్‌కు మరింత అందాన్ని తీసుకొచ్చింది. ఇప్పటికే పాటలతో ప్రేక్షకుల మనసు దోచుకున్న సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో, తన నేపథ్య సంగీతంతో ట్రైలర్ ను మరో స్థాయికి తీసుకెళ్ళారు. రవితేజ వింటేజ్ మాస్ ఆరాకు సరిగ్గా సరిపోయేలా ఆయన సంగీతం ఉంది. భారీ పోరాట సన్నివేశాలు, కడుపుబ్బా నవ్వించే హాస్యం, అద్భుతమైన పాటలతో విందు భోజనం లాంటి చిత్రానికి 'మాస్ జాతర' హామీ ఇస్తోంది.తెలుగులో ఎన్నో విజయవంతమైన చిత్రాలకు రచయితగా పనిచేసిన భాను భోగవరపు, 'మాస్ జాతర' చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రేక్షకులకు పూర్తి స్థాయి మాస్ విందుని అందించడానికి 31న 'మాస్ జాతర' చిత్రం ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో అడుగుపెట్టనుంది.

## 31న 'డియాస్ ఇరాయ్' విడుదల



మలయాళ అగ్ర కథానాయకుడు మోహన్ లాల్ తనయుడిగా చిత్రసీమలో అడుగు పెట్టిన ప్రణవ్, అతి తక్కువ సమయంలో తనకంటూ ఒక స్పెషల్ మార్క్ క్రియేట్ చేసుకున్నారు. 'హృదయం'తో భాషలకు అతీతంగా ప్రేక్షకుల మనసుల్లో చోటు సంపాదించుకున్నారు. ఆయన కథానాయకుడిగా నటించిన తాజా సినిమా 'డియాస్ ఇరాయ్'. మిస్టరీ హారర్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ సినిమాను సుప్రసిద్ధ నిర్మాణ సంస్థ శ్రీ స్రవంతి మూవీస్ తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ లో విడుదల చేస్తోంది. కమల్ హాసన్ 'పుష్పక విమానం', 'నాయకుడు' నుంచి ధనుష్ 'రఘువరన్ బీటెక్' వరకు తెలుగులో శ్రీ స్రవంతి మూవీస్ విడుదల చేసిన పరభాషా సినిమాలు భారీ విజయాలు సాధించడంతో పాటు విమర్శకుల ప్రేక్షకుల ప్రశంసలు పొందాయి. అందువల్ల, 'డియాస్ ఇరాయ్' మీద ప్రేక్షకులతో పాటు బిజినెస్ వర్గాల్లో అంచనాలు ఏర్పడ్డాయి. 'హృదయం' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత ప్రణవ్ మోహన్ లాల్ వరుసగా సినిమాలు చేయలేదు. సెలక్టివ్‌గా కథలు ఎంపిక చేసుకుంటూ వస్తున్నారు. 'భూత కాలం', మమ్ముట్టి 'భ్రమ యుగం' చిత్రాలకు దర్శకత్వం వహించిన రాహుల్ సదాశివన్, ఈ 'డియాస్ ఇరాయ్'ను తెరకెక్కించారు. మలయాళ, తమిళ భాషల్లో ఈ నెల 31న ఈ సినిమా విడుదల కానుంది. తెలుగు రాష్ట్రాల్లోనూ 'డియాస్ ఇరాయ్' మలయాళ వెర్షన్ డిస్ట్రిబ్యూట్ చేస్తున్నారు శ్రీ స్రవంతి మూవీస్ అధినేత రవికిశోర్. సుష్మితా భట్, జిబిన్ గోపీనాథ్, జయ కురుప్, మనోహరి జాయ్, అరుణ్ అజికుమార్ ప్రధాన పాత్రల్లో నటించిన 'డియాస్ ఇరాయ్' తెలుగు వెర్షన్‌ను నవంబర్ తొలి వారంలో థియేటర్లలో విడుదల చేయనున్నారు.

## 'చిరంజీవ' ట్రైలర్ రిలీజ్



రాజ్ తరుణ్ హీరోగా నటించిన ఆహా ఒరిజినల్ ఫిల్మ్ 'చిరంజీవ'. ఈ చిత్రంలో కుషిత కల్లపు హీరోయిన్ గా నటించింది. స్ట్రీమ్ లైన్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై రాహుల్ అవుదొడ్డి, సుహాసినీ రాహుల్ నిర్మించారు. అభినయ కృష్ణ దర్శకత్వం వహించారు. నవంబర్ 7వ తేదీ నుంచి చిరంజీవ సినిమా ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్‌కు రాబోతోంది. ఈ సందర్భంగా సినిమా ట్రైలర్‌ను రిలీజ్ చేశారు.చిరంజీవ మూవీ ట్రైలర్ ఎంటర్‌టైన్ మెంట్, లవ్, యాక్షన్‌తో ఆకట్టుకుంది. శివ(రాజ్ తరుణ్) పుట్టగానే మహార్జాతకుడు అవుతాడని పండితులు చెబుతారు. శివకు చిన్నప్పటి నుంచి స్పీడు ఎక్కువ. అంబులెన్స్ డ్రైవర్‌గా పనిచేస్తున్న శివ ఓ రోడ్డు ప్రమాదానికి గురవుతాడు. అతనికి తెలియకుండానే కొన్ని శక్తులు వచ్చేస్తాయి. ఎవరెవరు ఎంతకాలం జీవిస్తారు అనేది శివకు తెలిసిపోతుంటుంది. ఈ క్రమంలోనే శివ రౌడీ సత్తు పైల్వాన్ ను ఎదుర్కోవాల్సి వస్తుంది. ఆ సత్తు పైల్వాన్‌తో చేసిన పోరాటంలో శివ గెలిచాడా లేదా అనేది ట్రైలర్ లో ఆసక్తిని కలిగించింది. హీరో హీరోయిన్స్ కుషిత కల్లపు, రాజ్ తరుణ్ పాత్రల మధ్య వచ్చిన క్యూట్ లవ్ స్టోరీ కూడా ఆకట్టుకుంది. చిరంజీవ సినిమా ఆహా ఓటీటీకి మరో ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్ కానుందని టీజర్‌తో తెలుస్తోంది.

## బాహుబలి ఎపిక్ 31న విడుదల




ప్రభాస్‌ను పాన్ ఇండియా స్టార్‌గా నిలబెట్టిన సినిమా బాహుబలి. ఎస్.ఎస్ రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కిన బాహుబలి సినిమా విడుదలై పదేళ్లు అవుతున్న సందర్భంగా బాహుబలి ఎపిక్ పేరుతో సినిమాను మళ్ళీ విడుదల చేయనున్నారు. రెండు భాగాలుగా ఉన్న బాహుబలిని ఇప్పుడు ఒకే భాగం చేసి ఈనెల 31న విడుదల చేయనున్నారు. ప్రభాస్, రానా దగ్గుపాటి అన్న దమ్ములుగా నటించారు. రాజ్యాన్ని చేజిక్కించుకోవడం కోసం జరిగే పోరాటమే ఈ బాహుబలి కథ. రమ్యకృష్ణ, నాజర్ ముఖ్యపాత్రలు పోషించిన ఈ సినిమాకు ఎంఎం.కీరవాణి సంగీతం అందించారు. ప్రభాస్ సరసన ఇందులో తమన్నా హీరోయిన్‌గా నటించింది. అనుష్క ఇందులో అత్యంత కీలమైన పాత్రను పోషించింది. ఈ చిత్రంలో కథ మలుపు తిరిగే పాత్రలో తమిళ నటుడు సత్యరాజ్ కన్నప్పగా నటించాడు. ఈ పాత్రే బాహుబలి సినిమాకు హైలెట్‌గా చెప్పవచ్చు. ఈ చిత్రానికి కథ విజయేంద్ర ప్రసాద్, నిర్మాత శోభు యార్లగడ్డ.

# సిసిఐ పత్తి కొనుగోళ్లు ప్రారంభం

**సమస్యలు ఉంటే పత్తి రైతులు 'టోల్ ఫ్రీ' నెంబర్‌లో సంప్రదించవచ్చు**

**మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మొంథా తుఫాన్ కారణంగా పత్తి రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులకు విజ్ఞప్తి చేశారు. సచివాలయంలో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమంలో ఖమ్మం, మంచిర్యాల, కామారెడ్డి, నల్గొండ, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ రైతులతో మంత్రి తుమ్మల మాట్లాడి వారి సందేహాలు నివృత్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. తుఫాన్ ప్రభావంతో చేతి కందిన పత్తి తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తేమ శాతం 12శాతం మించకుండా చూడాలని కోరారు. మారిన వాతావరణ పరిస్థితులు దృష్ట్యా తేమ శాతం 20 వరకు ఉన్నప్పటికి పత్తి కొనుగోళ్లు జరపాలని మంత్రి తుమ్మల కేంద్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ఈ వానాకాలం సీజన్ పత్తి కొనుగోళ్లు సిసిఐ ప్రారంభించింది. రాష్ట్ర వ్యాప్తంగా 72 జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోళ్లు సోమవారం నుంచి ప్రారంభించారు. 784 మంది రైతులకు చెందిన 1623 క్వింటాళ్ల పత్తి తొలిరోజు కొనుగోలు చేశారు. పత్తి కొనుగోళ్లకు రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 318 జిన్నింగ్ మిల్లులు నోటిఫై చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 45లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయగా 28లక్షల మెట్రిక్ టన్నుల పత్తి దిగుబడి వస్తుందని అంచనాలు. ఈ ఏడాది అధిక వర్షాల కారణంగా పత్తి దిగుబడులు తగ్గడం, మారిన వాతావరణ పరిస్థితులు దృష్ట్యా తేమ శాతం విషయంలో 12శాతం పైగా ఉన్న పత్తినీ కూడా కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోళ్లు జరపాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ చౌహాన్‌కు లేఖ రాశారు. అలాగే నేటి నుంచి సోయాబీన్ కొనుగోళ్లు చేస్తున్నట్లు మంత్రి తుమ్మల వెల్లడించారు. ప్రైస్ సపోర్ట్ స్కీమ్‌లో మొక్కజొన్న, జొన్నలు చేర్చాలని సోయాపై ఉన్న పరిమితులు ఎత్తి వేయాలని మంత్రి తుమ్మల కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

### 'టోల్ ఫ్రీ' నెంబర్ ఏర్పాటు..

పత్తి రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తినా రైతుల సౌకర్యార్థం టోల్ ఫ్రీ నెంబర్ 1800 599 5779 కి కాల్ చేయొచ్చని మంత్రి తుమ్మల ప్రకటించారు. పత్తి రైతులు ప్రభుత్వ మద్దతు ధరకు అమ్ముకునేలా ప్రజా ప్రభుత్వంలో అన్ని చర్యలు తీసుకున్నట్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పత్తి రైతులు పత్తి అమ్ముకునేలా సిసిఐ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఏర్పాట్లు చేసినట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు.

# పాడి పరిశ్రమ అభివృద్ధి చేస్తాం

**గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు, వంద శాతం ఉచిత చేపల పంపిణీలో మంత్రి శ్రీహరి, ఎమ్మెల్యే గండ్ర**



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** రాష్ట్ర ప్రభుత్వం పాడి పరిశ్రమ, వ్యవసాయ అభివృద్ధికి కట్టుబడి ఉందని రాష్ట్ర పశు సంవర్థక, మత్స్య, పాడి, క్రీడలు, యువజన సేవల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. మంగళవారం భూపాలపల్లి నియోజకవర్గంలో రేగొండ మండల కేంద్రం లోని గుడ్ లైఫ్ పాఠశాల మైదానంలో జిల్లా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పశువులకు గాలికుంటి వ్యాధి టీకాలు వేసే కార్యక్రమాన్ని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ట్రేడ్ ప్రమోషన్ చైర్మన్ అయిత ప్రకాశ్ రెడ్డి, మత్స్య సహకార సంఘం రాష్ట్ర చైర్మన్ మెట్టు సాయి కుమార్ లతో కలిసి మంత్రి శ్రీహరి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో వాడి పరిశ్రమకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, గాలి కుంటు వ్యాధి నివారణ రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రజా ప్రభుత్వం లక్ష్యం అని అన్నారు. పాల ఉత్పత్తి పెంపు, పశువుల సంతానోత్పత్తికి గాలికుం టు వ్యాధి విఘాతం కలుగకుండా వ్యాధి నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 3కోట్ల 26 లక్షల పశువులకు 26 లక్షల 55 వేల టీకాలు వేయడం లక్ష్యం కాగా, ఇప్పటివరకు 25 వేల టీకాలు పూర్తయ్యాయి అని తెలిపారు. ఈ నెల 15వ తేదీ నుండి ప్రారంభమైన గాలి కుంటు వ్యాధి వచ్చేనెల వరకు జరుగుతుందని తెలిపారు. భూపాలపల్లి నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించనున్నట్లు ప్రకటించారు. స్టేడియం నిర్మాణం, పాడి పరిశ్రమలు, క్రీడల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. నియోజకవర్గంలో రెండు పశు వైద్యశాలలు, క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు తన పరిధిలో ఉన్న ఐదు శాఖల ద్వారా నియోజకవర్గ అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి మధ్య వ్యత్యాసం ప్రజలకు స్పష్టంగా కనిపిస్తోందని చెప్పారు. అనంతరం గణపురం మండలంలోని ఘనప సముద్రం చెరువులో 90 వేల మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి చెరువులో చేపలను విడిచారు. ముదిరాజులకు 50 లక్షలతో కళ్యాణ మండపం, 5 కోట్ల తో క్రీడా ప్రాంగణం, ముదిరాజుల ఆరోగ్య దైవమైన పెద్దమ్మ తల్లి దేవాలయ ఏర్పాటుకు సహకరిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, పశుసంవర్ధక శాఖ డిడి డాక్టర్ కుమార్ స్వామి, చిట్యాల భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి, గుటోజు కిష్టయ్య, సింగిల్ విండో చైర్మన్ విజ్జన రావు తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్లకు అండగా ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)



క్షమించదు. మీకు అనుగుణంగా వారు కోవిడ్ ప్రతిస్పందనలో ఉన్నారని, వారు కోవిడ్ కారణంగా మరణించారనే షరతు నెరవేరితే, బీమా కంపెనీని చెల్లించమని మీరు తప్పకుండా ఒత్తిడి చేయాలి.' వారు ప్రభుత్వ డ్యూటీలో లేనందున, వారు లాభాలు ఆర్జిస్తున్నారని భావించి వారు కూర్చోవడం సరైనది కాదు' అని ధర్మాసనం మౌఖికంగా వ్యాఖ్యానించింది. ప్రధానమంత్రి బీమా పథకం గురించి కాకుండా అందుబాటులో ఉన్న ఇతర సారూప్య లేదా సమాంతర పథకాలకు సంబంధించిన డేటా, సమాచారాన్ని అందించాలని సుప్రీంకోర్టు కేంద్రాన్ని ఆదేశించింది. 'ప్రధానమంత్రి పథకం కాకుండా అందుబాటులో ఉన్న ఇతర సమాంతర పథకాల గురించి గణాంకాలు, కొంత సమాచారాన్ని మాకు ఇవ్వండి. మేము సూత్రాన్ని నిర్దేశిస్తాము. దాని ఆధారంగా బీమా కంపెనీకి క్లెయిమ్‌లు నిర్దేశించుకోవచ్చు. మా తీర్పు ఆధారంగా బీమా కంపెనీ పరిగణనలోనికి తీసుకుని ఆదేశాలు జారీ చేస్తుంది' అని ధర్మాసనం పేర్కొంది. రాష్ట్ర లేదా కేంద్ర ప్రభుత్వం వారి సేవలను అభ్యర్థించలేకపోతే ప్రవేట్ హాస్పిటల్ సిబ్బంది బీమా పథకం కింద ప్రయోజనాలను పొందేందుకు అర్హులు కారని బాంబే హైకోర్టు 2021, మార్చి 9న ఉత్తర్వులు ఇచ్చింది. ఈ ఉత్తర్వులను సవాల్‌చేస్తూ ప్రదీప్ అరోరా, ఇతరులు దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారించింది. తన భర్తను కోల్పోయిన కిరణ్ భాస్కర్ సుర్గాడే అనే పిటిషనర్ హైకోర్టులో ఒక పిటిషన్ దాఖలు చేశారు. 2020లో కొవిడ్19 సమయంలో థానేలో ఒక ప్రైవేట్ క్లినిక్‌ను నడిపే ఓ మహిళ తన భర్తను కోల్పోయింది. ఆమె భర్త క్లినిక్ కొవిడ్ 19 హాస్పిటల్‌గా గుర్తించబడలేదనే కారణంతో ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ ప్యాకేజీ (పిఎంజికెపి) కింద ఆమె క్లెయిమ్‌ను బీమా కంపెనీ తిరస్కరించింది. పిఎంజికెపి మార్చి 2020న ప్రకటించబడింది.అప్పటి నుంచి దాని కవరేజీ కూడా పొడిగింపబడింది. పిఎంకెజిపి పథకం కింద ఆరోగ్య కార్యకర్తలకు రూ.50లక్షల బీమా సౌకర్యం అందించబడుతుంది. ఇది ఇన్ఫెక్షన్ కారణంగా ప్రాణాలు కోల్పోయిన కోవిడ్ వారియర్లపై ఆధారపడ్డ వారికి ఒక భద్రతా వలయంగా మారింది.

# వేతన సంఘం

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభిస్తుందని అన్నారు. వేతన సంఘం తన నివేదిక సమర్పించిన 10 సంవత్సరాల తర్వాత దానిని అమలు చేయడం ప్రారంభించడం ఇప్పుడు సర్వసాధారణ విషయంగా మారిపోయింది. ఈ ధోరణిలో ఆలోచిస్తే, ఎనిమిదవ వేతన సంఘం సిఫార్సులు 2026 జనవరి ఒకటో తేదీ నుండి సాధారణంగా అమలులోకి రావాల్సి ఉంది. కానీ ఏడవ వేతన సంఘాన్ని కేంద్ర ప్రభుత్వం 2014 ఫిబ్రవరిలో నియమించింది. ఈ సంఘం ఇచ్చిన సిఫార్సులను 2016 జనవరి 1వ తేదీ నుండి అమలు చేశారు. ఈ విధంగా వేతన సంఘం సిఫార్సులు అమలు చేయడంలో జాప్యం జరుగుతోంది. ఐతే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ద్రవ్యోల్బణం కారణంగా నిజవేతనాల విలువ తగ్గిపోతుంది. దీనిని ఎప్పటికప్పుడు కేంద్రం భర్తీ చేస్తుంది. కరువుభత్యం చెల్లింపు, డి.ఎ నిష్పత్తిని ప్రతి ఆరు నెలలకు ఒకసారి సవరించడం ద్వారా ఈ పరిహారాన్ని భర్తీ చేస్తుంది.

ఎనిమిదవ వేతన సంఘానికి సూత్ర ప్రాయంగా కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిన తొమ్మిది నెలల తర్వాత కేంద్ర మంత్రివర్గం మంగళవారం ఈ సంఘం పరిమితులు, పని పరిధులను నిర్దేశిస్తూ తీర్మానం చేసింది. బీహార్‌లో నవంబరు ఆరో తేదీ నుండి 11వ తేదీ వరకూ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ జరగనున్న తరుణంలో కేంద్ర మంత్రివర్గం చేసిన తీర్మానానికి ప్రాధాన్యత ఏర్పడింది. మంత్రివర్గం నిర్ణయం ప్రకారం, రంజన ప్రకాశ్ దేశాయ్ నాయకత్వానగల ఈ వేతన సంఘంలో బెంగళూరు ఐఐఎంకు చెందిన ప్రొఫెసర్ పులక్ ఘోష్ పార్ట్ టైమ్ సభ్యుడుగా ఉన్నారు. పెట్రోలియం శాఖ కార్యదర్శి పంకజ్ జైన్ మెంబర్ సెక్రటరీగా ఉంటారు. ప్రస్తుతం రంజన ప్రకాశ్ దేశాయ్ ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు ఛైర్మన్‌గా ఉన్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదవీ విరమణ చేసిన తర్వాత గతంలో ఆమె అనేక పెద్ద పెద్ద ప్రభుత్వ కమిటీలకు నాయకత్వ బాధ్యతలు నిర్వహించారు. కేంద్ర పాలిత ప్రాంతం జమ్మూ కశ్మీరులో నియోజకవర్గా ల పునర్విభజన కమిషన్‌కు గతంలో ఆమె నాయకత్వం వహించారు. ఉత్తరాఖండ్ రాష్ట్రం అమలులోకి తెచ్చిన ఉమ్మడి పౌర స్మృతి (యుసిసి) ముసాయిదా రచనలో నిపుణుల కమిటీకి కూడా ఆమె నాయకత్వ బాధ్యతలు నిర్వహించారు. ఈ విధంగా ఆమె దేశంలో తన కెరీర్‌లో అతిపెద్ద నాలుగో కమిషన్‌కు నాయకత్వం వహిస్తున్నారు.

### రబీ సీజన్‌లో ఎరువుల సబ్సిడీ రూ.37,952 కోట్లకు పెంపు

ఈ ఏడాది రబీ సీజనులో యూరియా యేతర ఫాస్ఫరస్ (పి), సల్ఫర్ (ఎస్) ఎరువులకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీని గతం కంటే రూ.14 వేల కోట్లు పెంచింది. కేంద్ర మంత్రివర్గం ఈ మేరకు ఒక తీర్మానం చేసింది. ఐతే నైట్రోజన్ (ఎన్), పోటాష్ (పి) లకు సబ్సిడీలలో ఎలాంటి మార్పులూ లేవు. ఈనెల (అక్టోబరు) ఒకటో తేదీ నుండీ ఆరునెలలపాటు అంటే మార్చి 31వ తేదీ వరకూ పెంచిన సబ్సిడీలు అమలులో ఉంటాయి. దేశవ్యాప్తంగా పలుచోట్ల ఇప్పటికే దాళ్వా పంటల నాట్లు ప్రారంభమయ్యాయి. ఈ రబీ సీజన్‌లో ప్రధానంగా గోధుమలు, అవాలు, కాయధాన్యాల పంటలు పండిస్తారు.

2025–26 ఆర్థిక సంవత్సరం రబీ సీజనుకుగాను రైతులకు ఉపశమనం కలిగించేందుకు వీలుగా ఎరువుల సబ్సిడీని అత్యధికంగా రూ.37,952 కోట్లకు పెంచారు. 2024 ఆర్థిక సంవత్సరం రబీ సీజన్‌లో ఈ ఎరువుల సబ్సిడీ రూ.24,000 కోట్లుగా ఉండేది. గతంకంటే ఈ సారి ఈ సబ్సిడీని రూ.14,000 కోట్లు ఎక్కువ పెంచారు. ఒక కిలో ఫాస్ఫేట్‌కు ప్రస్తుత రబీ సీజనులో సబ్సిడీని రూ.47.96లకు పెంచారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజనులో ఈ సబ్సిడీ కిలోకు రూ.43.60లు ఉండేది. అదేవిధంగా సల్ఫర్‌పై ఒక కిలోకు సబ్సిడీని రూ.1.77ల నుండి రూ.2.87లుకు పెంచారు. నైట్రోజన్ (ఒక కిలోకు రూ.43.02లు), ఫాస్ఫేట్ (ఒక కిలోకు రూ.2.38లు)లకు సబ్సిడీలో మార్పులేదు. దిగుమతి ధరలను దృష్టిలో పెట్టుకుని రైతులకు ఆర్థిక సమస్యలు రాకుండా ఉండటంకోసం ఈ సబ్సిడీ ధరలను కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాదీ సవరిస్తూ ఉంటుంది.

ఐతే దేశంలో డిఎపి (డై అమ్మోనియా ఫాస్ఫేట్), టిఎస్‌పి (ట్రిపుల్ సూపర్ ఫాస్ఫేట్)లు భారీగా రైతులు ఉపయోగిస్తూ ఉంటారు. ఈ డిఎప, టిఎస్‌పిలను అందుబాటులో ఉంచేందుకు వీలుగా ఎంఆర్‌పిలో మార్పులకు సంబంధం లేకుండా ఒక ప్రత్యేక ప్యాకేజీని కేంద్రం సమకూర్చింది. గతంలో ఉన్న స్థాయికంటే ఫాస్ఫరస్, సల్ఫేట్‌ల ధరలను పదిశాతం మేరకు పెంచినట్లు మంత్రి అశ్వనీ వైష్ణవ్ చెప్పారు. ఈ రబీ సీజన్‌లో సబ్సిడీ పెంచడంవల్ల రైతులకు ఆర్థికంగా ఎంతో మేలు జరుగుతుందని ఆయన చెప్పారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com